Estd. 1938
# ఆంధ్రప్రభ
www.prabhanews.com
Journalism first!

## ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం; తిథి: సప్తమి ఉ.6.44 వరకు, అష్టమి మంగళవారం ఉ.5.25 వరకు; నక్షత్రం: పునర్వసు సా.5.33 వరకు; అమృతకాలం: మ.3.11 నుంచి 4.45 వరకు; వర్జ్యం: మంగళవారం తె.1.15 నుండి 2.47 వరకు; దుర్ముహూర్తం: మ.12.23 నుండి 1.09 వరకు, మ.2.42 నుండి 3.28 వరకు; రాహుకాలం: ఉ.7.40 నుండి 9.07 వరకు; యమగండం: ఉ.10.34 నుండి 12.00 వరకు;

నేటి మీ కపిల్‌చిట్స్ తో సభ్యత్వం
ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
39 YEARS Safeguarding Trust
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

సంపుటి:58 • సంచిక: 182 • సోమవారం 21 అక్టోబర్ 2019 • హైదరాబాద్ ❋ పేజీలు:10+12 • వెల: 5.00 • Published from: Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore

### దద్ధరిల్లిన పాక్ ఆక్రమిత కాశ్మీర్

# గర్జించిన భారత్


భారత సైనికుల దాడిలో నీలం లోయ (పీఓకే)లో ధ్వంసమవుతున్న ఉగ్రశిబిరాలు


మోర్టార్లతో భారత సైన్యం దాడులు

**సరిహద్దులో పరిస్థితిపై రక్షణ మంత్రి ఆరా**

భారత డిప్యూటీ హైకమిషనర్‌కు పాక్ సమన్లు

- నాలుగు ఉగ్రవాదుల శిబిరాలు ధ్వంసం
- ఐదుగురు పాక్ సైనికులు, 35మంది ఉగ్రవాదులు హతం
- జైషే, హిజ్బ్, లష్కరే శిబిరాలు లక్ష్యంగా మెరుపుదాడి
- కాల్పుల ఉల్లంఘనతో తొలుత పాక్ కవ్వింపు చర్యలు
- తంగ్ధార్ సెక్టార్‌లో ఉగ్ర చొరబాట్లకు రేంజర్ల కుట్ర
- ఇద్దరు భారత్ జవాన్లు, మరో పౌరుడి మృతి
- క్షణాల్లో స్పందించిన సైన్యం... భీకర ప్రతీకార దాడి

**శ్రీనగర్:** పాకిస్తాన్ సైన్యం కవ్వింపు చర్యలకు భారత బలగాలు దీటైన జవాబిచ్చాయి. ఆదివారం ఉదయం జమ్మూకాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా తంగ్ధార్ సెక్టార్‌పై ఎలాంటి హెచ్చరికలు లేకుండా పాక్ బలగాలు కాల్పులకు తెగబడ్డాయి. ఈ ఘటనతో సరిహద్దులో ఒక్కసారిగా ఉద్రిక్తతలు తలెత్తాయి. కాల్పుల ముసుగులో ఉగ్రవాదులను భారత భూభాగంలోకి చొప్పించేందుకు పాక్ సైన్యం చేసిన ప్రయత్నాలను మన ఆర్మీ తుత్తునియలు చేసింది. తొలుత పాక్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు భారత జవాన్లు, ఒక పౌరుడు మరణించారు. దీంతో కొద్దిగంటల వ్యవధిలోనే భారత సైన్యం వెంటనే ప్రతీకార దాడులకు దిగింది. ఆర్టిలరీ గన్స్‌తో విరుచుకుపడింది. ఉగ్రశిబిరాలే లక్ష్యంగా భీకర కాల్పులు జరిపింది. ప్రతీకార దాడుల్లో ఐదుగురు పాకిస్తాన్ సైనికులు హతమయ్యారు. తంగ్ధార్ సెక్టార్‌కు ఎదురుగా ఉన్న ఎల్ఓసీలోని నీలం ఘాట్ లోని నాలుగు ఉగ్ర శిబిరాలపై దాడులు చేసింది. జైషేమహ్మద్, లష్కరే తోయిబాలకు చెందిన నాలుగు ఉగ్రశిబిరాలు ➪ 7వ పేజీలో...

# బస్సులన్నీ రోడ్డెక్కాల్సిందే

విద్యా సంస్థలు పునఃప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా పల్లెల నుంచి చదువుల కోసం విద్యార్థులు జిల్లా, పట్టణ, మండల ప్రాంతాలకు వెళతారు. వారి కోసం అవసరమైనన్ని బస్సులు అందుబాటులో ఉంచాలి. ఎక్కడా ఇబ్బంది లేకుండా పర్యవేక్షించండి.
- సీఎం కేసీఆర్



- నేటి నుంచి విద్యా సంస్థలు పున:ప్రారంభం • విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా బస్సులు నడపాలి
- తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్ల నియామకాలు సత్వరమే పూర్తి చేయండి • అన్ని గ్రామాలు, మండల కేంద్రాలకు బస్సు సర్వీసులు పునరుద్ధరించండి • ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులతో సీఎం కేసీఆర్ ఉన్నతస్థాయి సమీక్ష

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో విద్యార్థుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. దసరా పండుగ తర్వాత సోమవారం నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలలకు వెళ్లే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని సోమవారం నుంచి బస్సులన్నింటినీ అందుబాటులోకి తీసుకురావాలని ఇందుకు డ్రైవర్లు, కండక్టర్లను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని కేసీఆర్ కోరారు. "ఆర్టీసీ సమ్మె, విద్యాసంస్థల పునఃప్రారంభం, తీసుకోవాల్సిన చర్య"లపై ఆదివారం రాత్రి ప్రగతిభవన్‌లో రవాణా మంత్రి పువ్వాడ అజయ్, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి సునీల్‌శర్మ, ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశమై సమీక్షించారు. విద్యా సంస్థలు సోమవారం నుంచి తెరవనున్నారని.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి చదువుల కోసం విద్యార్థులు జిల్లా, పట్టణ, మండల ప్రాంతాలకు వెళతారని వారికి అవసరమైనన్ని బస్సులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఇప్పటిదాకా స్కూలు, కళాశాలల బస్సులను ఆర్టీసీ తీసుకుని నిర్వహించిందని.. ఇక నుంచి సంస్థ బస్సులను అత్యధికంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని కేసీఆర్ చెప్పారు. బస్సులు సక్రమంగా నడుస్తున్నది లేనిదీ తెలుసుకునేందుకు అధికారుల బృందాలను ఎంపికచేసి వారిని ఆయా బస్‌స్టేషన్ల పరిధిలో తనిఖీలకు పంపాలని సూచించారు. ఎక్కడ కూడా బస్సులు లేవని, అందుకే తరగతులకు హాజరు కాలేకపోయామని విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందవద్దని, అప్రమత్తంగా ఉండి బస్సులు నడపాలని కోరారు. ఆర్టీసీ డిపో మేనేజర్లు, ఇతర అధికారులు ఉదయం నుంచే అందుబాటులో ఉండి ఏయే గ్రామాలకు బస్సులను పంపింది.. ఆ గ్రామాల నుంచి బస్సులు గమ్యస్థానాలకు చేరుతుందీ ➪ 3వ పేజీలో...

5



## 30న సకల జనుల సమరభేరి

నేటినుంచి ప్రత్యేక కార్యాచరణ
ఆర్టీసీ జేఏసీ నేత అశ్వత్థామ రెడ్డి





### అమ్మా.. భగవాన్!

ఐటీ దాడులతో ప్రపంచవ్యాప్తంగా సంచలనం

# అంతులేని దుష్ప్రచారం!!

- భక్తుల విరాళాలతో వన్‌నెస్ టెంపుల్ నిర్మాణం • రికార్డులకు ఎక్కిన తర్వాతే విదేశీయుల విరాళాలు • ఆధ్యాత్మిక సంస్థల నిర్మాణాలన్నీ విరాళాలతో జరిపినవే • కథలల్లేస్తూ మీడియా వడ్డనలు • ఆశ్రమంలో వందల కోట్లు ఉన్నట్లు వార్తలు • లెక్కల్లో చూపనివా? ...చూపినవా? • స్పష్టతనివ్వని ఐటీ అధికారులు • దెబ్బతిన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలు • ఇప్పటికైనా వివరణ ఇచ్చి రాద్ధాంతానికి చెక్ పెట్టాలని విజ్ఞప్తులు

**(హైదరాబాద్, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)**

దేశవిదేశాల్లో కోట్లాది మంది భక్తులు, అనుచరులున్న కల్కి భగవాన్ ఆశ్రమం, ఇతర ప్రార్థన మందిరాలపై ఇటీవల ఆదాయ పన్నుశాఖ అధికారులు చేసిన దాడులు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ దాడుల్లో వెల్లడైన అంశాలపట్ల దాడిచేసిన ఆదాయపన్ను అధికార్లు లేదా ఆర్థికశాఖ ఇంతవరకు స్పష్టమైన ప్రకటన చేయలేదు. ఇది అమ్మా భగవాన్ భక్తుల్లో ఆందోళనకు దారితీస్తోంది. ఈ దాడుల నేపథ్యంలో సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు అనూహ్యవేగంతో స్పందిస్తున్నాయి. వందల కోట్ల విలువైన నగలు, వజ్రాలతోపాటు కరెన్సీని కూడా ఆదాయ పన్ను అధికారులు ➪ 3వ పేజీలో...

### హుజూర్‌నగర్ ఉపఎన్నిక

## నేడే పోలింగ్

2






## ఫార్మా సిటీకి నిధులివ్వండి

కేంద్ర మంత్రులకు కేటీఆర్ లేఖ

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ ఫార్మాసిటీకి పెద్దఎత్తున ఆర్థిక సహాయం చేయాలని పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఫార్మాసిటీని జాతీయ పెట్టుబడి-తయారీ జోన్(నిమ్జ్)గా సూత్రప్రాయంగా గుర్తించిన నేపథ్యంలో కేంద్రం, నిమ్జ్ పాలసీ మార్గదర్శకాల మేరకు ➪ 3వ పేజీలో...

### అరేబియా సముద్రంలో అల్పపీడనం

# వారం రోజులు కుండపోత

- తెలుగు రాష్ట్రాలపై తీవ్రప్రభావం
- హైదరాబాద్‌లో ఎడతెరపిలేని వర్షం
- నిండుకుండలా శ్రీరాంసాగర్


హైదరాబాద్‌లో జలమయమైన రోడ్డు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అరేబియా సముద్రంలో మరో అల్పపీడన ద్రోణి ఏర్పడింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ ప్రకటించింది. విస్తరించిన ఈశాన్య రుతుపవనాలకు తోడుగా తుపాను ఏర్పడిన కారణంగా దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లో అతిభారీ వర్షాల తీవ్రత ఉంటుందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం కూడా హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లోనూ మూడు గంటలపాటు ఎడతెరిపి లేని కుండపోత వర్షం కురిసింది. భారత వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తుపాను కారణంగా సంభవించే నష్టాన్ని నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్‌కే జోషి జిల్లా కలెక్టర్లతో మాట్లాడి తగిన మార్గదర్శకాలు ఇచ్చారు. నదీతీర ప్రాంతాల్లో వరదల ఉధృతి కొనసాగుతున్నందున చేపల వేట వెళ్ళవద్దని మత్స్యకారులను ➪ 5వ పేజీలో...



## రోహిత్ డబుల్

- మూడో టెస్టులో ద్విశతకం
- వన్డేలో 3 సార్లు డబుల్ సెంచరీలు
- టెస్టుల్లో తొలి డబుల్ సెంచరీ
- టెస్టు క్రికెట్ స్ట్రయిక్ రేటులోనూ రికార్డు




## పోలీసులపై ఈసీకే ఫిర్యాదు చేస్తా

### ఆ వ్యాఖ్యలు.. తెరాస ఓటమికి సంకేతం



**హుజూర్‌నగర్(అర్బన్), ప్రభన్యూస్ :** హుజూర్‌నగర్ ఉపఎన్నికలకు ముందు సీపీఐని తోకపార్టీలంటూ విమర్శించిన తెరాస, ఆ తరువాత మద్దతు కోరిందని, మొదట సై అన్న సీపీఐ, ఆ తరువాత మద్దతు ఉపసంహరించడంతో ఆ పార్టీకి పెద్దగా ఓట్లు లేవని మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యానించడం ఓటమిని ముందే అంగీకరించినట్టయిందని పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో తనను హుజూర్‌నగర్ నుంచి వెళ్లిపోవాలని పోలీసు అధికారులు ఇంటికొచ్చి హెచ్చరించారని, తనకు ఇక్కడ ఓటు లేనందున వెళ్లిపోమంటున్నారని, ఇది సరికాదని, పోలీసులపై ఈసీకి ఫిర్యాదు చేశానని, వారి అనుమతి తీసుకున్నానని, ఇక్కడే ఉంటానని స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాలవారు వస్తే పంపించేయాలిగాని, స్థానికుడిని, కాంగ్రెస్ అభ్యర్థి భర్తను, నల్లగొండ ఎంపీగా ఉన్న తనను పంపేసే అధికారం వారికి లేదన్నారు. ఎన్నిక సంఘం ఆదివారం తన ఇంట్లో జరిగిన సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. ఎన్నికల కమిషన్ అనుమతితోనే పాత్రికేయుల సమావేశం నిర్వహిసున్నానని స్పష్టం చేశారు.

#### కాంగ్రెస్ కార్యకర్తలపై కేసుల బనాయిస్తున్నారు

టీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులపైనా అక్రమంగా కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత టీఆర్ఎస్ పార్టీకి లేదని ఆయన అన్నారు. సీఎం సభ ఎందుకు రద్దు చేసుకున్నారో అందరికీ తెలుసునని అన్నారు. జోరువర్షంలో కాంగ్రెస్ పార్టీ రెండు రోజులు రోడ్ షో నిర్వహించిందని స్పష్టం చేశారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ వంద కోట్లు ఖర్చు పెట్టి మద్యం, డబ్బు విచ్చలవిడిగా పంపిణీ చేస్తోందని ఆరోపించారు. టీఆర్ఎస్ పార్టీ బెదిరింపులకు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిని గెలిపిస్తే, జగ్గయ్యపేట-మఠంపల్లి రైల్వే లైన్లో పాసింజర్ రైల్ నడిపించడానికి కృషి చేస్తానన్నారు. హుజూర్‌నగర్,ఖమ్మం, మిర్యాలగూడ, నేరేడుచర్ల, ప్రాంతాల రోడ్లను నాలుగులైన్లకు విస్తరిస్తామన్నారు. హుజూర్‌నగర్ మేళ్లచెర్వు ప్రాంతాలలో అధునాతనమైన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మాణం చేయడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. జాన్‌పహాడ్ ప్రాంతానికి నీరందించడానికి లిఫ్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసిపోయాయని ఆరోపించడం సరికాదని, తమ పార్టీల సిద్ధాంతాలు వేరని అన్నారు. ఈ సమావేశంలో యరగాని నాగన్నగౌడ్, అరుణ్‌కుమార్‌దేశ్‌ముఖ్, ఈడుపుగంటి సుబ్బారావు, అల్లం ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు

**హుజూర్‌నగర్(అర్బన్), ప్రభన్యూస్ :** ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో నల్గొండ పార్లమెంట్ సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనీల్‌రెడ్డి తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి ఆయన ఇంట్లో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేయడంతో ఎస్‌సిసి టీమ్ పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనీల్‌రెడ్డి తెలిపారు.

## కాంగ్రెస్ గెలుపు ఖాయం: మల్లు రవి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని టిపిసిసి ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రజలను మోసం చేసిందని, చివరకు ఆర్టీసీ కార్మికులకు కూడా అన్యాయం చేసిందని ఆయన విమర్శించారు. టిఆర్ఎస్ పాలనకు బుద్ధి చెప్పాలంటే హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.



ఈవీఎం, వీవీప్యాట్ పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

# నేడే పోలింగ్



| బరిలో 28 మంది | ప్రధాన పోటీ తెరాస, కాంగ్రెస్‌ల మధ్యే |
|---|---|
| ప్రభావం చూపనున్న బిజెపీ, టీడీపీ | పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది |
| మొత్తం ఓటర్లు 2,36,842 | మొత్తం ఈవిఎంలు 3,782 |



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ రేపుతున్న సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ శాసనసభా స్థానం ఉప ఎన్నిక పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం ఏడుగంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా ఉపయోగించుకునేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాజీనామా చేసిన కారణంగా ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికలో మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా అందులో కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ తదితర మొత్తం 13 రాజకీయ పార్టీల అభ్యర్థులతోపాటు మరో 15మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

#### మహిళా ఓటర్లే ఎక్కువ

నియోజకవర్గంలో మొత్తం 2,36,842మంది ఓటర్లు ఉండగా అందులో 1,18,621మంది మహిళా ఓటర్లు ఉండగా , 1,18,221మంది పురుష ఓటర్లు ఉన్నారు. ఈ నియోజకవర్గం పరిధిలోని హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలతోపాటు చింతలపాలెం, మేళ్ల చెరువు, పాలకీడు, మఠంపల్లి, గరిడేపల్లి మండలాల పరిధిలో సోమవారం నాటి పోలింగ్‌కు 302 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల పోలింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలద్వారా నిర్వహిస్తున్నారు. ఏడు మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 3782 ఈవీఎంలను ఉపయోగిస్తున్నట్టు రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి సత్యవాణి వివరించారు.

#### అంతా సిద్ధం

పోలింగ్ నిర్వహణకోసం మొత్తం 15వందల మంది సిబ్బందిని నియమించారు. ఇందులో 392మంది పోలింగ్ అధికారులు, మరో 392 మంది అసిస్టెంట్ పోలింగ్ అధికారులను ఉన్నారు. పోలింగ్ సందర్భంగా అత్యవసర పరిస్థితుల్లో వారి సేవలు ఉపయోంచుకునేందుకు మరో పదిశాతం పోలింగ్ సిబ్బందిని రిజర్వ్‌లో ఉంచినట్టు అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును సునాయాసంగా ఉపయోంచుకునేందుకు వీలుగా వీల్ చైర్లు తదితర అవసరమైన ప్రత్యేక ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైన సాయంత్రం 5గంటలకు ముగియనుంది. పోలింగ్ సమయం ముగిసేలో పు పొలింగ్ కేంద్రం ప్రాంగణంలో ఉన్న వారందరికీ ఓటు వేసుకునే అవకాశం కల్పించినట్టు తెలిపారు. హుజూర్ నగర్ ఉప ఎన్నికల నిర్వహణకోసం ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన హుజూర్‌నగర్ మార్కెట్ యార్డునుంచి పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రిని తీసుకుని పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలిపోయారు. ఉదయం పోలింగ్ నిర్వహణకు అవసరమైన పోలింగ్ బూత్‌లను ఆదివారం రాత్రికే సిద్ధం చేసుకున్నారు.

#### పోలింగ్ నిర్వహణపై ప్రత్యేక నిఘా

హుజూర్ నగర్ ఉపఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంది. ఎన్నికల్లో నియమ నిబంధనలు ఉల్లంఘించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు హుజున్‌నగర్ ఉప ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు భాస్కరన్ పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా సూక్ష్మస్థాయి నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో మొత్తం 79 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. వీటి పరిధిలో పోలింగ్ సందర్భగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ఠమైన పోలిసు బందోబస్తుతో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు.

ఎన్నికల విధులకు సమాయత్తం అవుతున్న సిబ్బంది



# హుజూర్‌నగర్ హోరాహోరీ

### గెలుపుపై టీఆర్ఎస్, కాంగ్రెస్ ధీమా.. ఆఖరి రోజు జోరుగా నోట్ల ప్రవాహం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** హుజూర్‌నగర్ ఉప ఎన్నిక కీలక ఘట్టానికి చేరింది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేసేందుకు సిద్ధమయ్యారు. అధికార తెరాస, విపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య జరుగుతున్న హోరాహోరీ పోరు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠను రేకెత్తిస్తోంది. విజయంపై టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎవరికివారే ధీమాగా ఉన్నాయి. ఈ ఎన్నికను ఇరు పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నేపథ్యంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అన్ని రకాల తరుణోపాయాలను అనుసరిస్తున్నారు. ప్రలోభాలను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసింది. అయినా, ఆయా పార్టీలు ముందస్తు ప్రణాళికలతో ఓటర్లకు నోట్లు పంపిణీ చేసినట్లు సమాచారం.

#### తెరాస జోష్..

సామాజిక, కులసమీకరణలు పక్కాగా వర్క్అవుట్ అయ్యాయని, సైదిరెడ్డి విజయం ఖాయమని టిఆర్ఎస్ నేతలు ధీమాతో ఉన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి నుంచీ పక్కా వ్యూహంతో వ్యవహరించారు. నియోజకవర్గంలోని 141గ్రామాలకు 705మంది ఇన్‌ఛార్జిలను నియమించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, రాష్ట్ర ప్రధానకార్యదర్శులను ఆపైన ఇన్‌ఛార్జిలుగా నియమించారు. పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పల్లా రాజేశ్వరరెడ్డికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌ఛార్జిల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశారు. జిల్లాకు చెందిన మంత్రి జగదీష్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. మంత్రి కేటీఆర్ ఒక రోజు రోడ్‌షో నిర్వహించారు.17న కేసీఆర్ బహిరంగసభలో పాల్గొనాల్సి ఉండగా, వర్షం వల్ల అది రద్దయింది. దీంతో టీఆర్ఎస్ శ్రేణులు కొంత నిరాశకు గురయ్యాయి.

#### సామాజిక సమీకరణలపై ధీమా

నియోజకవర్గంలో కీలక ఓటు బ్యాంకుగా ఉన్న లంబాడా సామాజికవర్గాన్ని తమవైపు తిప్పుకునేందుకు తెరాస పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేసింది. మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, మాజీ మంత్రి రెడ్యానాయక్, ఎమ్మెల్యేలు రవీంద్రనాయక్, శంకర్‌నాయక్ తదితరులతో ప్రచారం నిర్వహించింది. ఇక వైశ్య సామాజికవర్గం ఓటు బ్యాంకును సొంతం చేసుకునేందుకు బొల్లం సంపత్‌కుమార్ గుప్తా, కోలేటి దామోదర్ గుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులతో విస్తృత ప్రచారం చేయించింది. ఇది సత్ఫలితాన్నిస్తుందని, వైశ్యుల ఓట్లు గంపగుత్తగా తమకే పడతాయన్న అంచనాలో తెరాస ఉంది. స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని పల్లా రాజేశ్వరరెడ్డి పార్టీ ఎన్నికల యంత్రాంగాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపారు. మంత్రి జగదీష్‌రెడ్డితో పాటు సూర్యాపేట జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలంతా ప్రచారంలో తీవ్రంగా శ్రమించారు.

#### కాంగ్రెస్ గెలుపు ధీమా

మరోవైపు కాంగ్రెస్ కూడా విజయంపై ధీమాగా ఉంది. ఇది సిట్టింగ్ స్థానం కావడం, ఇక్కడ వరుసగా మూడుసార్లు విజయం సాధించడం, ముందునుండే ప్రచారంలో వ్యూహాత్మకంగా ఉండడం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వమంతా కలిసిరావడం ఉత్తమ్ సతీమణి పద్మావతికి కలిసి వస్తుందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఎన్నికల ప్రచారం కూడా చివరిదాకా జోరుగా కొనసాగించడం, క్యాడర్‌లో ఊపు తేవడం, ప్రజల్లో గతంలో చేసిన అభివృద్ధి నిలవడం, ఆర్టీసి సమ్మె ప్రభావం అన్నీ కలిసొచ్చే అంశాలుగా కాంగ్రెస్ నేతలు లెక్కలేసుకుంటున్నారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌తో పాటు సీఎల్పీనేత భట్టి విక్రమార్క, ఎంపీలు రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి ప్రచారం కలిసొచ్చాయన్న అంచనాలో కాంగ్రెస్ వర్గాలున్నాయి. మొదటినుండి చివరిదాకా టెంపో కొనసాగించగలిగామని, ఇది విజయానికి దోహదపడుతుందని విశ్లేషిస్తున్నారు.

#### తెదేపా సత్తా చాటేనా?

తెలంగాణలో పూర్వవైభవం కోసం కృషి చేస్తున్న టీడీపీకి హుజూర్‌నగర్ ఎన్నిక సత్తాకు పరీక్ష. క్షేత్రస్థాయిలో బలమైన కేడర్ ఉండటం, చావా కిరణ్మయి రూపంలో ప్రజాదరణ కలిగిన అభ్యర్థి లభించడంతో గట్టిపోటీ ఇస్తామని తెదేపా భావిస్తోంది. కిరణ్మయి స్థానికురాలు కావటం, ఇక్కడ సామాజికంగా బలమైన మద్దతు ఉండటం సైకిల్ దూకుడుకు కలిసొచ్చే అంశాలు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రమణతోపాటు, పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రచారం చేయాలని భావించినప్పటికీ, ఆ తర్వాత ఈ ఆలోచన వెనకడుగేసింది. నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ, సుహాసిని ప్రచారానికి వస్తారని తొలుత పార్టీ వర్గాలు భావించాయి. కానీ వారు కూడా దూరంగా ఉండిపోయారు. అయినప్పటికీ ప్రధాన పార్టీల అభ్యర్ధులకు దీటుగా కిరణ్మయి ప్రచారం నిర్వహించారు.ఉప ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి ఏమేరకు అండగా నిలుస్తారన్న దాన్ని బట్టే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ రాజకీయ ఎతుగడలు ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక్కడ లభించే ఓటింగ్ శాతాన్నిబట్టి, త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం కావాలని తెదేపా వ్యూహకర్తలు భావిస్తున్నారు.



## బ్రెగ్జిట్ మార్చ్

ఐరోపా సమాఖ్య నుంచి విడిపోయే ప్రక్రియ బ్రెగ్జిట్‌ను ఈనెల 31లోగా పూర్తి చేసి తీరుతానని భీష్మించుకుని కూర్చున్న బ్రిటన్ ప్రధాని, అతడి అనుంగు మద్దతుదారు డొమినిక్ కమింగ్స్ ప్రజాగ్రహాన్ని ఎదుర్కొంటున్నారు. బ్రెగ్జిట్ గడువును మరింత జాప్యం చేయాలని, మార్చిలో తుది నిర్ణయం తీసుకోవాలన్నది జనాభిప్రాయం. రెండురోజుల క్రితంపార్లమెంట్‌లో ఈమేరకు ఓ తీర్మానం కూడా నెగ్గింది. అయినా గడువు పెంపుపై ఈయూను కోరనుగాక కోరనంటున్నాడు. ఆయన తీరుపై తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. అదిగో ఆ నిరసనను జాన్సన్, కమింగ్స్ బొమ్మలను ఇలా ఊరేగిస్తూ చేస్తున్నారు.



## గోడపై కళాకాంతి

గోడలపై భారీ చిత్రాలు గీయడాన్ని మ్యూరల్ కళ అని చెప్పొచ్చు. పాశ్చాత్య ప్రపంచంలో దీనికి ఆదరణ జాస్తి. ఇప్పుడిప్పుడే మనదేశంలోనూ విస్తృతమవుతోంది. ఇదిగో బీహార్ రాజధాని పాట్నాలోని విద్యుత్ భవన్ గోడలపై ఇలా బొమ్మలు చిత్రించారు. ఇందులో ఓ విశేషం ఉంది. ఆ చిత్రంలోని ఇద్దరి చేతుల్లోను ప్రమిదలు వెలిగించిన దృశ్యం కనిపిస్తోంది. వారం రోజుల్లో రానున్న దీపావళి కళాకాంతి అంతా ఇక్కడే కనిపిస్తోంది. మట్టి ప్రమిదలనే వెలిగించాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ ఉద్దేశం. ఐడియా బాగుంది కదూ!



## ప్రమిదావనం

దివ్వెల పండుగ దీపావళికి దగ్గరకొచ్చింది. ఈ వేడుకలో దీపాలు వెలిగించి చీకటిని తరిమేయడమన్నది ఓ సంప్రదాయలక్ష్యం. కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలు అలంకరణకు వాడినా, మట్టితో చేసిన ప్రమిదలను వాడటానికి హిందువులు ఇష్టపడతారు. పర్యావరణపరంగా వీటిని వాడటమే శ్రేయస్కరం. పైగా వందలాది కుమ్మరులకు ఇది ఆదాయాన్ని శుభఘడియ కూడా. ఈమధ్య వర్షాలతో ప్రమిదల తయారీ వెనుకబడింది. ఇప్పుడు కాస్త ఎండ పొడ వస్తూండటంతో ప్రమిదలను తయారు చేసి ఇలా ఆరబెడుతున్నారు. యూపీలోని మొరాదాబాద్‌లో ప్రమిదల తయారీ ఊపందుకుంది.



## మగాళ్లూ.. మగువలను చంపొద్దు!

పారిస్‌లోని ప్రఖ్యాత డి ల రిపబ్లిక ప్రాంతంలో ఇలా శయనించిన మహిళల గుండె నిండా ఆవేదన నిండిపోయింది. భర్త లేదా మాజీ భర్త, ప్రియుడి చేతిలో మరణించిన మహిళల ఆత్మశాంతికోసం వీరంతా ఇలా ప్రార్ధనలు చేస్తున్నారు. జీవితం పంచుకున్నవాళ్లే చంపేస్తూండటం (ఫెమినిసైడ్) ఇటీవలి కాలంలో ఫ్రాన్స్‌లో ఎక్కువైంది. గడచిన మూడేళ్లలో ఇలాంటి హత్యలు పెరిగిపోయాయ్. 2016లో 123, 2017లో 130మంది మహిళలను ఇలా నమ్మినవారే అంతం చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఇలాంటి హత్యలు 74 జరిగాయి. ఇలాంటి నేరాలను అరికట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ 'డై ఇన్ ప్రొటెస్ట్' కార్యక్రమాన్ని మహిళాసంఘాలు చేపట్టాయి. అందులో భాగంగా ఇలా పడుకుని, మృతుల పేర్లు చదువుతూ వారి ఆత్మశాంతి కోసం ప్రార్ధనలు చేశారు. ఫ్రాన్స్‌లో ఫెమినిసైడ్ పెద్ద జాడ్యంగా మారింది.




# రేపటి నుంచి భాజపా సంకల్ప యాత్రలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మహాత్మా గాంధీ 150 జయంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి తెలంగాణలో సంకల్ప యాత్రలు చేపట్టనున్నట్లు భారతీయ జనతాపార్టీ ప్రకటించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ నేతృత్వంలో రాష్ట్ర పార్టీ పదాధికారుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. బతుకమ్మ, దసరా పండుగ, హుజూర్‌నగర్ ఉప ఎన్నిక తదితర అంశాల కారణంగా, లోక్‌సభ నియోజకవర్గాలలో సంకల్ప యాత్రలు సాగలేదు.

దీంతో ఈ నెల 22 వ తేదీ నుంచి చేపట్టాలని నిర్ణయించారు. 15 రోజుల పాటు సాగే యాత్ర రోజుకు కనీసం 10 కిలోమీటర్లు ఉండాలని సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే సికింద్రాబాద్ నియోజకవర్గ ఎంపీ జి. కిషన్‌రెడ్డితో పాటు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ అరవింద్‌లు ప్రారంభించారు.

#### నవంబర్ 8 లోగా పోలింగ్ బూత్ కమిటీలు

పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా నవంబర్ 8 లోగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో పార్టీ కమిటీలను నియమించాలని నిర్ణయించారు.

రాష్ట్రంలో మొత్తం 33 వేల పోలింగ్ కేంద్రాలుండగా, కేవలం అయిదు వేల పోలింగ్ కేంద్రాలలో కమిటీలను పూర్తి చేశారు. మిగతా కేంద్రాలలో నవంబర్ 8 లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. నవంబర్ 10 నుంచి రాష్ట్రంలోని 891 మండలాలు, అన్ని పట్టణాల లోని డివిజన్‌ల కమిటీలను నియమించే ప్రక్రియను ముమ్మరం చేయాలని సమావేశం ఖరారు చేసింది.



#### కేసీఆర్ పతనం ప్రారంభమైంది : లక్ష్మణ్

ముఖ్యమంత్రి కేసీఆర్ పతనం ప్రారంభమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పలువురు డాక్టర్లు, ప్రొఫెసర్లు ఆదివారం లక్ష్మణ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యమాన్ని బీజేపీ భుజానేసుకుని నడిపిస్తుందన్నారు. ఆర్టీసీ నష్టాల కు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కార్మికులతో పెట్టుకుంటే అగ్గితో తలగోక్కోవడమేనని ఉద్యమ సమయంలో కేసీఆర్ చెప్పారని, ఇప్పుడు అదే కార్మికులతో తల గోక్కుంటున్నారని, కేసీఆర్ పతనం ప్రారంభమైందన్నారు. కేసీఆర్ పాలన, ఏకపక్ష నిర్ణయాలు, అప్రజాస్వామిక చర్యలు చూసిన డాక్టర్లు, ప్రొఫెసర్లు బీజేపీలో చేరి పోరాటానికి మద్దతు ఇచ్చేందుకు వచ్చారన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జి. ప్రేమేందర్‌రెడ్డి, అధికార ప్రతినిధులు ఎన్‌వి సుభాష్, శ్రీధర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కె. మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రభ సారస్వత వేదిక

# సాహితీగవాక్షం

ఈ తరానికి ఆ తరం కవిత



"మాకు వద్దీ రాజప్రముఖ్ / ఈ కఠిన పాషాణ సదృశ/ఓ నిరంకుశ లోహమూర్తి/మాకు వద్దు" తెగేసి చెప్పిన ఉద్యమయోధుడు హీరాలాల్ మోరియా. సర్దార్ జమలాపురం కేశవరావు, బొమ్మకంటి సత్యనారాయణ వంటి వారితో కలిసి నిజాంకు వ్యతిరేకంగా, తెలంగాణ విమోచనోద్యమంలో చురుకుగా పోరాడారు హీరాలాల్ మోరియా. నిజాం ప్రభుత్వం ఆయనపై 17 వరకు కేసులు పెట్టింది. జైళ్లలో ఉన్న సమయంలో దాశరథి వలె కవితాస్వరం వినిపించా రాయన. హీరాలాల్ మోరియా పూర్వీకులు ఉత్తర భారతదేశం నుండి వచ్చి ఖమ్మంలో స్థిరపడ్డారు. స్వేచ్ఛా ప్రియుడైన హీరాలాల్ మోరియా చిన్నతనం నుండి సాహిత్యం పట్ల ఆసక్తి పెంచుకున్నారు. మోరియా హిందీ, ఉర్దూ, తెలుగు భాషలలో రచనలు చేశారు. నవలలు, నాటకాలు, కథలు, కవితలు ఇలా అనేకం ఆయన సృజనలో కనిపిస్తాయి. తన 60 సంవత్సరాల సాహితీ ప్రస్థానంలో 100వరకు రచనలు చేశారు. విశాలాంధ్ర ఏర్పడ్డాక ఆయన ఈ ప్రాంతాలు, ఈ దేశం గొప్పగా ఉంటుందనుకున్నారు. కాని రాజకీయ నాయకుల స్వార్థపరత్వం చూసి ఎంతో వేదన చెందారు. ఈక్రమంలోనే ఆయన "నౌజవానో జాగో ఉఠో" అనేపేరుతో ఒక దీర్ఘ కవిత రాశారు. ఈకవితను "యువతరం మేల్కొనాలి" పేరుతో కొండపల్లి వేంకట శేష గిరిరావు తెలుగు లోకి అనువదించారు. ఇందులో యువతను చైతన్యవంతులను చేయడానికి మోరియా ప్రయత్నించారు. అలాగే మన సంస్కృతి యొక్క గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటుతూనే యువత దేశభక్తి పూరితులై మానవతకు మచ్చరాని విధంగా ఉద్యమం నడపాలంటారాయన. యువతరం మేల్కొనాలి కవిత నుండి కొంతభాగం 'సాహితీగవాక్షం" పాఠకుల కోసం ఈవారం.

## యువతరం మేల్కొనాలి



యువకులార! యువతులార!
నవయుగ నిర్మాతలార!
మనజాతి మన నీతి
మన త్యాగం, మన ధర్మం
యుగయుగాల పేరొందిన
అత్యుత్తమమైనట్టివి-
ఎందరెంత హేయంగా
ఎందరెంత దైన్యంగా
ఎందరెంత అవినీతిగా
ఎందరెంత అక్రమంగా
ఎందరెంత స్వార్థంగా
దేశానికి చెప్పరాని
ద్రోహం తల పెట్టిననూ,
మచ్చలేని మన సంస్కృతి
మాసిపోక వెలుగుతుంది
మన దేశంలోన గొప్ప
మార్పెంతో అవసరము-
దీక్షతోడ యువకులంతా
దేశభక్తిపూరితులై
మానవతకు మచ్చరాని
మహోద్యమం నడపాలి...
స్వచ్ఛమైన స్వేచ్ఛాయుత
ప్రజాస్వామ్య- పరిపాలన-
సరసమైన, సౌఖ్యమైన
సామ్యవాద సముద్ధరణ
సర్వజనులు సమ సమాజ,
పౌరసత్వ
హక్కులనూ,
అనుభవించగలిగినట్టి,
అనుపమ పరిపాలన
సముపార్జన జేయు కొరకు
సంఘటితం కావాలి-
అవనిపైని జాతులకు,
ఆదర్శం కావాలి...
వివేకులమై విశ్వశాంతి,
విప్లవ శంఖం మూదాలి...

- మూలం- హీరాలాల్ మోరియా
అనువాదం: కొండపల్లి వేంకట శేష గిరిరావు

## నాకు శేషేంద్ర స్ఫూర్తినిచ్చే ఒక ఊట



శేషేంద్ర ప్రస్థానం, ప్రయాణం ప్రతి ఒక్కరూ గుర్తుచేసుకోవడం ఆనందంగా ఉంది. సాహితీ ప్రపంచం శేషేంద్ర భిన్న కళా ప్రక్రియలను చూసే ప్రయత్నం చేస్తుంది. ఒకరికి శిల్పం మరొకరికి వస్తువు. ఇలా శేషేంద్రలోని భిన్న కోణాలు కనిపిస్తాయి. నాకు శేషేంద్ర ఆనందం, స్ఫూర్తిని ఇచ్చే ఒక ఊటగా కనిపిస్తారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ గారు ఇచ్చిన ఆశీర్వాదం గుర్తుకు వస్తోంది. నా రచనలు పెరుగుతున్న యువతరం అర్థం చేసుకుంటుంది అని శేషేంద్ర చెప్తూండేవారు. ఆ మాటలు ఈరోజే నిజమయ్యాయి. శేషేంద్ర కవితలు చదివి వినిపించేవారు. నేను టైపు రైటర్ మీద టైపు చేస్తూ ఉండేదాన్ని. ఆ దగ్గర సంబంధం కారణంగా నేను ఆయన రచనల మీద విమర్శ జరపలేదు. యువతరం ప్రతి రచయిత యొక్క రచనలు ప్రాంతం, భాషకు అతీతంగా చదివి అర్థం చేసుకోవాలి. రచయిత ఒక సందేశంతో అతని రచన ప్రారంభం చేస్తాడు. అతనితో పాటు ఎగిరే ఊహలను అందరితో పంచుకుంటాడు. కవి వ్రాసే ప్రతి రచన ఒక బీజాక్షరం. "యద్భావం తద్భవతి" రచన యొక్క దర్శనం ప్రతి ఒక్కరికీ ఒకలా ఉండదు. వ్యక్తి వ్యక్తికీ మారుతూ ఉంటుంది. శ్రవణం అయిన ప్రతిభావం ఒక నాదంగా మారుతుంది. నేను వ్రాస్తున్న నా ఆటోబయోగ్రఫీ త్వరలో ముద్రణకు వెళ్లబోతోంది. శేషేంద్ర మీద నా అభిప్రాయం ఆ పుస్తకం ద్వారా అందరితో పంచుకోవడం జరుగుతుంది. సాహితీ అభిమానులందరికి నా హృదయపూర్వక ధన్యవాదములు. మీ అందరితో నేను ముప్పై ఎనిమిది సంవత్సరాలు గడిపాను. నా జీవితంలో మరిచిపోలేని వ్యక్తి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు. శేషేంద్ర స్నేహితులు శ్రీశ్రీ, రాయ ప్రోలు సుబ్బారావు వారితో వచ్చిన సాహితీ స్నేహితులకు ఆతిథ్యం ఇవ్వడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను.

- ఇందిరాదేవి ధనరాజ్ గిర్
జ్ఞాన్‌బాగ్ ప్యాలెస్, గోషామహల్, హైదరాబాద్

### నేడు, రేపు శేషేంద్ర సాహిత్యంపై సదస్సు

కవితా తత్వవేత్త గుంటూరు శేషేంద్రశర్మ సాహిత్యంపై 21వతేది సాయంత్రం 4.గంటల నుండి 6గంటల వరకు 22వ తేది ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ యూనివర్సిటి, గచ్చిబౌలి నందు ఎండోమెంట్ ప్రసంగాలుంటాయి. ఈ కార్యక్రమాలలో ప్రముఖ కవులు, రచయితలు పాల్గొని ప్రసంగిస్తారు.

## రవీంద్ర త్రివిక్రమ్ దూరతీరాలు జాతీయనాటకంగా ఎంపిక



ప్రముఖ రచయిత కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ రచించిన శ్రవ్యనాటకం 'దూర తీరాలు' ఆకాశవాణి జాతీయ నాటకంగా ఎంపిక చేసింది. కేవలం రెండే పాత్రలు గల ఈ నాటకాన్ని ఆయన దేశ భక్తి ఇతివృత్తంగా మలిచారు. గంటపాటు నడిచే ఈ నాటకం లో పాత్రధారులుగా శారదా శ్రీనివాసన్, కోకా సంజీవరావులు నటించారు. ఒక దశాబ్ద విరామం తర్వాత తెలుగు నాటకం జాతీయస్థాయిలో ఎంపిక కావడం విశేషం. ఈ నాటకాన్ని ఆకాశవాణివారు 24వతేదీ రాత్రి 9.30గంటలకు దేశ వ్యాప్తం గా తెలుగుతో సహా అన్ని జాతీయ భాషల్లో ప్రసారమవుతుంది. ఈనాటక రచయిత కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ 1955 నుండి రచనలు గావిస్తున్నారు. ఆయన దాదాపు 120 వరకు నాటకాలను ఆకాశవాణి కొరకు రచించారు. 2000సం.లో వీరు రచించిన 'జురాహమ' నాటకం జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందింది.

## గురువులకు గురువు దివాకర్ల

దివాకర్లవారు కవిగా, రచయితగా, అధ్యాపకునిగా, పరిశోధకునిగా, ఉపన్యాసకునిగా ఎంత గొప్ప ఖ్యాతి నార్జించినా, వారికెంతో ఇష్టమైన ప్రక్రియ అష్టావధానం. అదంటే వారికి అంతులేని ఇష్టం. 1935 ప్రాంతంలో ఆయన విద్యార్థి దశలోనే బందరు హిందూ కాలేజీలోను, "ఉండి"లోను అవధానాలు చేశారు. ఆ తరువాత 1965లోను, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 1975లో హైదరాబాద్‌లోను, ఆ తరువాత కాకినాడలోను, ఉగాది సందర్భంగా ఆకాశవాణిలోను సుమారు 15 వరకు అష్టావధానాలు వీరు చేశారు. అనర్గళమైన ఆవుధార, అనితర సాధ్యమైన ధారణా పటిమ వీరికి సహజసిద్ధంగా లభించాయి.

"కవిగ, అష్టావధానిగ, భువనవిజయ
కర్తగా, వాగ్మి జన చక్రవర్తిగా, మ
హోన్నత వ్యక్తిగా, దేశికోత్తముడుగ
నమరుడై నిల్చునవధాని యాంధ్రధరణి....

ఇది దివాకర్ల వేంకటావధానిగార్ని గూర్చి మధునాపంతుల వారి వాక్కు. వేంకటావధానిగారు గొప్పకవి, పండితుడు. అవధాని, విమర్శకుడు, పరిశోధకుడు. వీటన్నింటికి మించి గొప్ప ఉపన్యాసకుడు. వీరు 17-1-1913న ప.గో.జిల్లా ఆకు తీగలపాడులో మాతామహుల ఇంట జన్మించారు. తండ్రి శ్రీ సుందరరామయ్య, తల్లి శ్రీమతి వేంకటలక్ష్మి. వీరు భీమవరం తాలూకా ఎండగండి వాస్తవ్యులు. తిరుపతి వేంకట కవులలో ఒకరైన దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు అవధానిగారి పినతండ్రి.

అవధానిగారు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారి పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "ఆంధ్ర వాఙ్మయారంభ దశ-నన్నయ భారతము" అనే అంశంపై పరిశోధన చేసి, 1957లో పి.హెచ్.డి పట్టా సాధించారు. వీరి శిష్యుల్లో ఆచార్య ఎం. కులశేఖరరావు, ఇరివెంటి కృష్ణమూర్తి, పి.యశోదారెడ్డి, డా. సి.నారాయణ రెడ్డి, ముద్దసాని రామిరెడ్డి వంటివారు ముఖ్యులు.

ఇక కవిగా, రచయితగా, పరిశోధకునిగా దివాకర్ల వారు అనేక గ్రంథాలు రాశారు. రాజసందర్శనం, మధువనం, త్రిశతి, కవి పరాజయం, పరివర్తనం, సుందరసందేశం, దాసబోధ వంటి పద్య కావ్యాలు రాశారు. కౌముదీ మహోత్సవం, నాగానందం, సత్య హరిశ్చంద్ర వంటి నాటకాలు రాశారు. ప్రకృతి విజయము, మార్గదర్శకాలు, వేమన, పోతన, తిరుపతి వేంకట కవులు, విశిష్ట సభ్యుల ప్రశంస, వ్యాసావళి, సాహిత్య సోపానాలు, కావ్యలహరి, ఆంధ్ర భారతము, కవిత్రయము, విశ్వనాథ కవి సమ్రాట్టు, నన్నయ భట్టారకుడు, వాల్మీకి-విశ్వనాథ, నన్నెచోడుని కుమార సంభవము, వంటి వచన గ్రంథాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు రాశారు. విశాలాంధ్రోదాహరణము, భారత స్వాతంత్రోదాహరణము వంటి ఉదాహరణ కావ్యాలు రాశారు. శివానందలహరి, సౌందర్యలహరిలకు టీకా తాత్పర్యాలు రాశారు. పి.యశోదారెడ్డి, మరుపూరు కోదండ రామిరెడ్డిలతో కలిసి "తెలుగు సామెతలు" గ్రంథానికి సంపాదకత్వం వహించారు.

వీటితో పాటు "telugu in thirty days", మలయాళ వాఙ్మయ చరిత్ర, సంస్కృత వ్యాకరణ సంగ్రహము వంటి మొత్తం 40కిపైగా గ్రంథాలు రాశారు. వీరి సత్యహరిశ్చంద్ర నాటకం సంస్కృతంలో ఆచార్య హేమచంద్రుని శిష్యుడైన రామచంద్రుడు రాసిన సంస్కృత హరిశ్చంద్ర నాటకానికి అనువాదం. ఇది యధామూలకంగా సాగింది. ఇక వీరి "సాహిత్య సోపానములు" అనే గ్రంథం బి.ఏ. స్పెషల్ తెలుగు, మరియు ఎమ్.ఏ. విద్యార్థులకు సాహిత్య విమర్శ, కావ్యస్వరూపం, రసస్వరూపం, దశవిధరూపకాలు, ధ్వనిసోపానం, గుణ-రీతి-వృత్త్యాది సోపానం వంటి అనేక అంశాలపై స్పష్టమైన అవగాహనను కలిగిస్తూ నేటికీ పఠనీయ గ్రంథంగా అలరారుతోంది. వీరు 'విశిష్ట సభ్యుల ప్రశంస' అనే గ్రంథంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, కాశీ కృష్ణమాచార్యులు, గిడుగు వేంకట సీతాపతి, తాపీధర్మారావు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, గుఱ్ఱం జాషువా, వేదుల సత్యనారాయణ శాస్త్రి, దేవులపల్లి, తుమ్మల రాయప్రోలు, విశ్వనాథ, గడియారం, మునిమాణిక్యం, బండారు తమ్మయ్య, పురిపండ దీపాల పిచ్చయ్య శాస్త్రి వంటి 36 మంది మహామహుల జీవిత సాహిత్యాలను గూర్చిన ప్రశంసాత్మక వ్యాసాలు ఉన్నాయి. ఇక అవధానిగారి పద్యకావ్యాలలో "రాజసందర్శనం" అనే కావ్యం వారి పద్యరచనాధిషణకు నిదర్శనం.

భట్టబాణుడు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి శ్రీహర్షుని ఆస్థానంలో స్థానం సంపాదించటం ఇందలి విషయం. శ్రీహర్షుడు తన ఆస్థానంలోని కవుల చెప్పుడు మాటల వల్ల బాణునిపై వ్యతిరేకత పెంచుకొంటాడు. ఆ తరువాత నిజం తెలుసుకొని బాణుని ఎంతో ఆదరించి, గౌరవించి తన ఆస్థానకవిగా నియమిస్తాడు. వారిరువురి బంధం విడదీయరానిదవుతుంది. ఒకరి ప్రభావం ఒకరిపై ప్రగాఢంగా పడుతుంది. ఆ సందర్భంగా వారి సఖ్యతను గూర్చి భ్రమర కీటక న్యాయంతో సరిపోల్చుతూ ఒక చిన్న పద్యంలో ఇలా వివరిస్తారు. **'అధిక సఖ్యంబు కతన నన్యోన్యమెపుడు/తలచుచుంట భ్రమర కీటక ధర్మమొప్ప/ సార్వభౌముడు సత్కవీంద్రుడయ్యె/బాణకవిచంద్రుడును సార్వభౌము డయ్యె-'** వారి ప్రగాఢ సఖ్యత వల్ల భ్రమర కీటక న్యాయంగా బాణుడు శ్రీహర్షుని వలె రాజసౌఖ్యాలను అనుభవిస్తున్నాడని, శ్రీహర్షుడు బాణ మహాకవిలా కవితా సామ్రాజ్యాన్ని కూడా ఏలగలి గాడని ఒక చక్కని పోలిక చేశారు. అవధాని గారి రచనా వైదుష్యం ఈ రాజసందర్శనంలోని ప్రతి పద్యంలోను ప్రస్ఫుటమవుతుంది. ఇక దివాకర్లవారు కవిగా, రచయితగా, అధ్యాపకునిగా, పరిశోధకునిగా, ఉపన్యాసకునిగా ఎంత గొప్ప ఖ్యాతినార్జించినా, వారికెంతో ఇష్టమైన ప్రక్రియ అష్టావధానం. అదంటే వారికి అంతులేని ఇష్టం. 1935 ప్రాంతంలో



నేడు వర్ధంతి

ఆయన విద్యార్థి దశలోనే బందరు హిందూ కాలేజీలోను, "ఉండి" లోను అవధానాలు చేశారు. ఆ తరువాత 1965లోను, ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 1975 లో హైదరాబాద్‌లోను, ఆ తరువాత కాకినాడలోను, ఉగాది సందర్భంగా ఆకాశవాణిలోను సుమారు 15 వరకు అష్టావధానాలు వీరు చేశారు.

అనర్గళమైన ఆవుధార, అనితర సాధ్యమైన ధారణా పటిమ వీరికి సహజసిద్ధంగా లభించాయి. ఉగాదికి ఆకాశవాణిలో చేసిన అవధానంలో ఒక పృచ్ఛకుడు "అంగము చేత పట్టుకొని యాడిరు గాడిని పండితోత్తముల్" అనే సమస్యనిచ్చి పూరించమన్నారు. అది అంగము... కాదు... పంచాం గము. పూరణ ఎలా సాగిందో చూడండి. **"జంగమ భూత సంతతియు స్థావర వస్తుచయంబు కాంతిపూ/ర్ణాంగములయ్యె నెల్లెడ పికాళిరవంబు లెసంగె వల్లరీ/సంగతీ భూజముత్సెలగె చారుసుమప్రకరమ్ము తోడ, పం/చాంగము చేత బట్టుకొని యాడిరుగాదిని పండితోత్తముల్....** "అవధాని ఈ పద్యంలో చైత్రారంభంలోని ప్రత్యేకతల్ని వర్ణిస్తూ, పండితులు పంచాంగములు హస్తములలో నుంచుకొని ఆనందంతో నృత్యం చేశారని ఎంతో ఔచిత్యవంతంగా సమస్యను పూర్తించారు. అవధానికి ఉండవలసిన లక్షణాల్ని వివరించారు. నిజంగా ఈ లక్షణాలన్నీ వేంకటావధానిగారిలో పుష్కలంగా ఉన్నాయి. అందుకే వారి అవధానాలు రాశిలో తక్కువైనా, వాసిలో మిన్నగా ఖ్యాతి కెక్కాయి. ఇక అవధానిగార్కి 1977 లో కళాప్రపూర్ణ పురస్కారం లభించింది. ఆ తరువాత విద్యాసనాథ, కవి భూషణ అనే బిరుదులు వరించాయి. అధ్యాపకునిగా, ఆచార్యునిగా, కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, అవధానిగా, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఈ దివాకరుడు ఉపన్యాసాల నిమిత్తం, రచనల నిమిత్తం, బొంబాయి వెళ్లి అనారోగ్యంతో 21-10-1986న అక్కడే అస్తమించాడు. ఆయన అస్తమించి 33 సంవత్సరాలు గడచినా సాహితీప్రియుల పరిశోధకుల హృదయాలలో ఆయన ఎప్పటికీ సజీవంగా కొలువై ఉంటారు.

- డా॥ జోశ్యుల కృష్ణబాబు
9866454340

## పెన్నేటి పాట కన్నీటి కావ్యం

విద్వాన్ విశ్వం శతాధికంగా రచనలు చేసి ప్రచురించారు. ఇందులో 'పెన్నేటి పాట' ప్రఖ్యాతినందింది. ఇది రాయలసీమ, కన్నీటిపాటగా ప్రసిద్ధి చెందిన గేయకావ్యం, ఇందులో 'రంగమ్మ-రంగడు', 'నాయికా-నాయకులు' గత వైభవం స్మరిస్తూ ప్రస్తుత పరిస్థితిని వర్ణించారు. ఇందులో దంపతుల అనురాగం, పరోపకార బుద్ధి, కల్మషం లేని వారి ప్రవర్తన, రచయిత చూపారు.

విశ్వంగారు విద్వత్కవి, సద్విమర్శకులు, శతాధిక గ్రంథ కర్త, అనువాదకులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ పత్రికా సంపాదకులు, విశ్వంగారి పేరు చెప్పగానే మన స్మృతి పథంలో మెలిగేవి రెండు. అవి ఆంధ్రప్రభ వారపత్రికలో వారు నడిపిన "మాణిక్యవీణ" శీర్షిక, 1956లో వారు రచించి ముద్రించిన పెన్నేటి పాట గేయ కావ్యం. విద్వాన్ విశ్వం గారి అసలు పేరు మీసరగండ విశ్వరూపాచారి. వీరు 1915 అక్టోబరు 21వతేదీన అనంతపురం జిల్లాలోని తరిమెల గ్రామంలో జన్మించారు. కాశీ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న సమయంలో అనారోగ్యం వల్ల పరిశోధన పూర్తి చేయకుండా తిరిగి స్వగ్రామం వచ్చేశారు. కాశీ నుండి తిరిగి అనంతపురం వచ్చిన తర్వాత వారు కమ్యూనిస్టు నాయకుడు తరిమెల నాగిరెడ్డి గారితో కలిసి రాజకీయ కార్యకలాపాలు ప్రారంభించారు. ప్రజలను చైతన్యపరచడానికి గ్రంథ ప్రచురణ అవసరమని నవ్యసాహిత్య మాల అను ప్రచురణ సంస్థను ప్రారంభించారు. నవ్యసాహితి అనే పత్రికను ప్రారంభించారు. దానికి వారు సంపాదకులుగా నున్నారు. ఫాసిజం మున్నగు అంశాలపై గ్రంథాలను ప్రచురించారు. ఈ ప్రచురణలను ఖండిస్తూ బ్రిటీషు ప్రభుత్వం వారు వారిని రాజద్రోహం క్రింద అరెస్టు చేసి మొదట బళ్లారి అల్లీపూర్ జైలు, పిమ్మట వేలూరు, తిరుచిరాపల్లి జైళ్లలోను 18-11-1940 నుండి ఒక సంవత్సరం నిర్బంధించబడ్డారు. తిరుచిరాపల్లి జైలులో నుండగా విశ్వంగారు బెజవాడ గోపాలరెడ్డి గారి దగ్గర బెంగాలీ భాష నేర్చుకొన్నారు. ఇక్కడనే వారికి రాజగోపాలాచారి గారితోను, టంగుటూరు ప్రకాశంగారితోను పరిచయమయ్యింది. 1938-45 సంవత్సరాల మధ్య వారు అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. అంతేకాక వీరు రాయలసీమ కాంగ్రెస్ కార్యాలయ కార్యదర్శిగాను, అనంతపురం జిల్లా జాతీయసభకు, జిల్లాలోనే జన సంఘానికి, మండల క్షామ నివారణ సభకు, జిల్లా ఆంధ్ర మహాసభకు ప్రధాన కార్య దర్శిగాను, జిల్లా రైతు మహాసభకు ఉపాధ్యక్షుడుగాను పనిచేశారు.



నేడు జయంతి

విశ్వంగారికి పత్రికారంగం మంచిపేరు తెచ్చి పెట్టింది. ప్రప్రథమంగా వారు అడివి బాపిరాజుగారు సంపాదకులుగానున్న మీజాన్ పత్రికలో 1945లో అసిస్టెంట్ ఎడిటర్‌గా కొంతకాలం పనిచేశారు. పిమ్మట వారు విజయవాడలో ప్రజాశక్తి దినపత్రికలో మూడు సంవత్సరాలు పనిచేశారు. తరువాత వారు మద్రాసు వెళ్లి అక్కడ బాలభారతీ విద్యాలయంలో సంపాదకులుగా కొంతకాలం పనిచేశారు. 1952 ఆగస్టు 15వ తేదీన ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక ప్రారంభమయ్యింది. దానికి విశ్వంగారు ఎడిటర్ ఇన్‌ఛార్జిగా నియమింపబడ్డారు. 1959 వరకు ఆ హోదాలో పనిచేశారు.

1959లో ఆంధ్రపత్రిక దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా కొంతకాలం మద్రాసులో పనిచేశారు. పిమ్మట వారు 1960లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో అసోసియేట్ ఎడిటర్‌గా విజయవాడలో పనిచేశారు. మరల ఆంధ్రప్రభ దినపత్రికకు 1963లో అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేశారు. 1967లో ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రికకు సంపాదకులుగా చేరి అక్కడ పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. అనంతరం వారు తిరుమల- తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగానికి ప్రధాన సంపాదకులుగా ఉద్యోగించారు. ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ఆంధ్ర కథ 12 సంపుటాలుగా అనువదించారు. వారు చందమామలో ద్విపద కావ్యపద్ధతిలో వ్రాసిన పంచతంత్రమునకు సంబంధించిన కథలు బాపు బొమ్మలతో దేవస్థానం ప్రచురించింది. బ్రహ్మ సూత్రాలు శంకర భాష్యం 4 సంపుటాలను అధర్వ(ణ) వేదాన్ని అనువాదం చేసి ప్రచురించారు. వారు 1987 అక్టోబర్ 19వ తేదీన పరమపదించారు. వారు తెలుగు పత్రికలలో నిర్వహించిన 'మాణిక్య వీణ', 'తెలుపు-నలుపు', 'అవీ-ఇవీ' మొదలైన శీర్షికల ద్వారా రచించిన సమాచారం పాఠకులను బాగా ఆకర్షించాయి. వీరు శతాధికంగా రచనలు చేసి ప్రచురించారు. ఇందులో 'పెన్నేటి పాట' ప్రఖ్యాతి నందింది. ఇది రాయలసీమ, కన్నీటిపాటగా ప్రసిద్ధి చెందిన గేయ కావ్యం, ఇందులో 'రంగమ్మ-రంగడు', 'నాయికా-నాయకులు' ఇందులో గత వైభవం స్మరిస్తూ ప్రస్తుత పరిస్థితిని వర్ణించారు. ఇందులో దంపతుల అనురాగం, పరోపకార బుద్ధి, కల్మషం లేని వారి ప్రవర్తన, రచయిత చూపారు. వీరు రచించిన కావ్యాలలో 'పెన్నేటి పాట', 'ఒకనాడు' 'నా హృదయం', 'విరికన్నె' ప్రసిద్ధి పొందాయి.

విశ్వంగారు కొన్ని రచనలను సంస్కృతం నుండి తెలుగులోనికి అనువదించారు. అవి భాసుని కాదంబరి భారవి కిరాతార్జునీయం, దండి, దశకుమార చరిత్రం మాఘుని శిశుపాల వధ, కల్హణుని రాజతరంగిణి, కాళిదాసు యొక్క రఘువంశము, కుమారసంభవము, మేఘ సందేశము, తెలుగులోనికి అనువదించారు. ఇంతేకాక చెకో కథలు, గోర్కీ కథలు, రోమా రోలా నవల, మానవులు మున్నగునవి అనువదించారు. ప్రముఖ నాయకులైన లెనిన్,స్టాలిన్ మున్నగు నాయకుల జీవిత చరిత్రలు, ఇరాన్, ఇండియా, ఇండోనేషియా, వియాత్నం మున్నగు దేశాల గురించి వీరు రచనలు గావించారు. "ఫాసిజం- దాని ధ్వంసం" అనే రచన వలన బ్రిటీషు వారి కోపానికి గురయ్యింది. వీరు అనేక ఇతర విషయాల గురించి రచనలు వెలువరించారు. ప్రధానంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టి.టి.డి)లో పనిచేస్తున్నప్పుడు అధర్వ(ణ) వేదం సంపుటాలుగా వెలువరించడం వారి కీర్తి కిరీటంలో కలికితురాయిగా భాసిస్తుంది. పోరాటంలో వారు పాల్గొని ఒకవైపు భారతదేశ స్వాతంత్ర్యం కొరకు స్వాతంత్ర్య కారాగారవాస క్లేశాన్ని అనుభవించడం ఒకవైపు అయితే రెండవ వైపు వివిధ తెలుగు పత్రికలలో సంపాదకులుగా ఉద్యోగించడం విశేషంగా పేర్కొనాలి. మూడవ వైపు శతాధికంగా గ్రంథాలు రచించి ప్రచు రించడం, రచయితగా వారి ఖ్యాతి ఆంధ్రదేశంలో దశదిశలా వ్యాపిం చింది. ఇటువంటి సాహితీవేత్తలు కాని దేశానికి గొప్పసేవ చేసిన మహనీయులు కాని మనకు అరుదుగా కనిపిస్తారు. వారు ఈనాడు భౌతికంగా మన ముందు లేకపోయినా వారి జీవితంలోని మరపురాని సంఘటనలు కాని రచనల ద్వారా వారు వెలిగించిన విజ్ఞాన చైతన్యజ్యోతి మన హృదయాలలో ఎల్లప్పుడు భాసమానంగా వెలుగొందుతూనే ఉంటుంది.

జయంతితే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః

- డా॥ రాపాక ఏకాంబరాచార్యులు
9440494752

## జీవం లేని యాత్ర

ఎప్పటివో పురా అనుభూతులు తప్ప
ఇప్పుడు జీవంలేని యాత్రే మిగిలింది
ఒకప్పుడంతా పూలసౌందర్యాలమయం



ఇంకేం చెప్పను-
కంటి ముందు రాలిన కలల సమూహాలు
ఆకులు రాలిన వనాలు
కాలం గీసిన జీవన చిత్రాల
ముగింపులన్నీ ఇలానే ఉంటాయి-

- కె. హరనాథ్
9703542598

## సమసమాజ జీవనం

(మానవత్వమే ఆభరణం)

నా కళ్లను
నేనే నమ్మలేకపోతున్నాను
చూసింది చూస్తున్నది.,
నిజమా! కలా!
ఇకపై చూసేది
ఊహించడమే కష్టం.

గడిచిన ఐదు దశాబ్దాల 'కాలంలో...
నన్ను నేను
వెనుతిరిగి చూసుకున్నాను.
రాలిన జ్ఞాపకాల్ని ఏరుకొంటూ
రేగిన భావాల్ని దాచుకొంటూ
మనిషి అంతర్ముఖంలోకి
తొంగిచూశాను.

ఎన్నో మార్పులు-
మరెన్నో కూర్పులు
కళ్లముందు కదలాడుతూ
నా మనసును కదిపాయి.

మారిన కాలం...
ప్రపంచాన్ని అరచేతిలో పెట్టి
అందాలను కనువిందు చేసింది
క్షణకాలంలో అద్భుతాలెన్నో చూపి
ఖగోళ వింతల్ని కళ్లకట్టింది
సంతోషాల హరివిల్లును భువికి దింపి
మనల్ని ముందుకు నడిపింది.

అయినా-
ఏదో విషాదం-మరేదో అసహనం
వెంటాడుతుంది నన్ను



కన్నోళ్లే- భారమన్న!
కరుణలేని సమాజంలో
పాలబుగ్గల పసిడి తల్లుల
బతుకు చిగుళ్లను చిదిమేస్తుంటే

అధికారం-అలంకారమంటూ
అన్యాయాలకు-తెగబడుతుంటే
విలాపాగ్నులు-విషాదాగ్నులు
కార్చిచ్చై మండుతు వుంటే
జనాల మధ్య
ఎక్కడ శాంతి? ఎక్కడ సహనం?

సమాజ ముంగిళ్లలో-
కులాల కుంపటి రగులుతు వుంటే
మతాల మంటలు రేగుతు వుంటే
వృత్తుల కూడలి కూలుతు వుంటే
కార్మిక కళ్లు వరదవుతుంటే
పేదల బతుకులు బుగ్గవుతుంటే

ఐకమత్యం మన బలమైతే
మానవత్వం మన ఆభరణం కాదా!?
సహస్ర వృత్తుల సంగమమే
సమ సమాజ జీవనం కాదా!?

- డా. తుమ్మల శ్రీనివాసులు
9704129872

## సాహిత్య వార్తలు

### నవలలకు ఆహ్వానం

అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు నవల కారులు తెలుగులో రచించిన మొదటి నవలను ఆహ్వానిస్తున్నది. నవల వంద పేజీలకు తగ్గకుండా, రెండు వందల యాభై పేజీలు మించకుండా ఉండాలి. నవల తాను రచించిన మొదటి నవలేనని హామీ పత్రం జతచేయాలి. నవల 2015-2018 మధ్య కాలంలో రాసినదై ఉండాలి. నవల గతం ఏ పత్రికలోను ప్రచురించబడనిదై ఉండాలి. ఇతివృత్తం తెలుగువారి జీవితాలకు సంబంధించనదై ఉండాలి. ఎంపిక చేయబడ్డ నవలలకు ప్రథమ బహుమతి పదివేల రూపాయలు, ద్వితీయ బహుమతి ఐదు వేల రూపా యలు ఇవ్వబడును. చివరితేది: 2019, అక్టోబర్ 31, నవలలు పంపవలసిన చిరునామా. డి. స్వప్న, కార్యదర్శి, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు, 2-7-71, ఎక్సైజ్ కాలనీ, హనుమ కొండ, వరంగల్ -506001, ఫోన్ -0870-2456458.

- డి. స్వప్న, కార్యదర్శి, అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్టు-వరంగల్

# 30న సకల జనుల సమరభేరి

• సమ్మెకు మద్దతుగా ఎవరు పోరాడినా పాల్గొంటాం: అఖిలపక్ష సమావేశంలో ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సమ్మెలో భాగంగా ఈ నెల 30న 'సకల జనుల సమర భేరీ' పేరుతో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కార్మిక జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. దాదాపు 5 నుంచి 10 లక్షల మందితో ఈ సభను నిర్వహిస్తామని చెప్పారు. సభనిర్వహించేస్థలాన్ని త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఆదివారం ఎస్‌వీకేలో అఖిలపక్షంతో సమావేశం అనంతరం కార్మిక జేఏసీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్టీసీ సమ్మె పరిష్కారం దిశగా చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సమ్మె డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఈ నెల 21 నుంచి 30 వరకు ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు అఖిలపక్షంతో చర్చించి ప్రత్యేక కార్యాచరణను రూపొందించామన్నారు. తెలంగాణలో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె ప్రపంచానికి తెలిసిందన్నారు. ఆస్ట్రేలియాలోనూ సమ్మెకు మద్దతుగా ధర్నాలు జరిగాయని చెప్పారు. ఇప్పుడు పోరాడుతున్న విధంగానే మొక్కవోని ధైర్యంతో పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా ఓయూ విద్యార్థులు, రాజకీయ పార్టీలు చేసే ఏ కార్యక్రమానికైనా ఆర్టీసీ కార్మికుల మద్దతు ఉంటుందన్నారు. సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోయే ప్రగతి భవన్ ముట్టడిలో ఆర్టీసీ కార్మికులు పాల్గొంటారని ప్రకటించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ విధులు నిర్వహించొద్దని తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను కోరాలని ఓయూ విద్యార్థులకు అశ్వత్థామ పిలుపునిచ్చారు. ప్రయివేటు బస్సులు టెండర్లను అడ్డుకోవాలని డిపో మేనేజర్లకు విజ్ఞప్తి చేశారు. కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కార్మిక జేఏసీ నాయకత్వం ఏ కార్యక్రమం చేపట్టదని స్పష్టం చేశారు. కోర్టుకు చెప్పిన విధంగా 100 శాతం బస్సులు నడుస్తుంటే నష్టం ఎలా వస్తుంది..? అని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. 19నాటి బంద్‌లో పాల్గొని అరెస్టు అయినందుకు మహిళా సఫాయి కర్మచారులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా కండక్టర్‌పై దాడి చేసి, ఉద్యమకారులను భయపెట్టాలని చూడటం ప్రభుత్వానికి తగదన్నారు. సమ్మె యధాతథంగా కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

### తాత్కాలిక ఉద్యోగాల్లో చేరొద్దు: రాజిరెడ్డి

ఆర్టీసీ కార్మిక జేఏసీ కో కన్వీనర్ రాజారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ తెచ్చుకుంది ఉద్యోగాల కోసమేనని, దయ చేసి తాత్కాలిక ఉద్యోగాల్లో చేరొద్దని నిరుద్యోగ యువతను కోరారు. తాత్కాలిక ఉద్యోగాల్లో చేరకుండా మీ పిల్లలను అడ్డుకోండి అని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో వేలాది పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ తెచ్చుకుందే నిధులు, నీళ్లతోపాటు నియామకాల కోసమేనని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారని కార్మిక జేఏసీ మరో కో కన్వీనర్ వీఎస్ రావు స్పష్టం చేశారు.

### అన్నిరకాలుగా మద్దతు

సమ్మెలో భాగంగా ఆర్టీసీ కార్మికులు తీసుకునే ఏ కార్యాచరణకైనా పూర్తి మద్దతుగా నిలుస్తామని అఖిలపక్ష నేతలు ప్రకటించారు. ఆర్టీసీ కార్మిక జేఏసీతో ఎస్‌వీకేలో సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు.

### కోర్టు తీర్పును గౌరవించాలి: కోదండరాం

కోర్టు తీర్పును గౌరవించి ఆర్టీసీ కార్మికులను చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని టీజేఎస్ అధినేత ప్రొ. కోదండరాం డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మిక జేఏసీ తీసుకున్న అన్ని కార్యక్రమాలకు టీజేఎస్ పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. సమ్మె కేవలం ఆర్టీసీ కోసమే కాదని రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కూడా అని చెప్పారు.

### అండగా కాంగ్రెస్ పార్టీ: వీహెచ్

ఆర్టీసీ కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని కాంగ్రెస్ సీనియర్ వీ హనుమంతరావు ప్రకటించారు. ప్రభుత్వంలో విలీనం, ఇతరత్రా కార్మికుల అన్ని డిమాండ్లకు కాంగ్రెస్ సానుకూలమన్నారు. కార్మిక జేఏసీ ఏ కార్యక్రమం తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ పూర్తిగా సహకరిస్తుందన్నారు.

### వామపక్షాలు ప్రత్యక్షంగా పాల్గొంటాయి: తమ్మినేని

నేటి నుంచి 30 వరకు ఆర్టీసీ కార్మిక జేఏసీ ప్రతిపాదించిన ఉద్యమ కార్యాచరణలో వామపక్షాలు ప్రత్యక్షంగా పాల్గొంటాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. సమావేశం అనంతరం 21న కార్మికుల కుటుంబాలతోపాటు వామపక్ష కార్యకర్తల కుటుంబాలు డిపోల ముందు బైఠాయిస్తాయన్నారు. 22న వామపక్ష కార్యకర్తలు బస్సుల్లో ప్రయాణించి విధుల్లో చేరొద్దని తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లను వేడుకుంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులను కలవటంలో, మహిళా కండక్టర్ల దీక్షలో, జాతీయ రహదారుల దిగ్బంధంలో, మహిళా కండక్టర్ల దీక్షల్లో వామపక్ష కార్యకర్తలు పాల్గొంటారని వివరించారు. హైకోర్టు సూచనలను పెడిచెవిన పెట్టటం తగదని సీఎంకు హితవు చెప్పారు.

### విచారణ జరిపించాలి: చాడ

బంద్ రోజున ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత పోటు రంగారావు వేలు విరిచిన ఘటనపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆర్టీసీ సమ్మెకు, కార్మికులు మృతిచెందటానికి ప్రధాన కారణంగా సీఎం కేసీఆర్ మొండివైఖరేనని తేల్చి చెప్పారు.

### ఆర్టీసీ ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం: టీటీడీపీ

ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి, ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని టీటీడీపీ అధ్యక్షులు ఎల్. రమణ డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల మృతి బాధాకరమన్నారు.



### మరోసారి గవర్నర్‌ను కలుస్తాం

ఆర్టీసీ సమ్మెపై అవసరమయితే అఖిలపక్షం మరోసారి గవర్నర్‌ను కలుస్తుందని తెలంగాణ ఇంటిపార్టీ అధ్యక్షులు డా. చెరుకు సుధాకర్ ప్రకటించారు. ప్రజాస్వామ్యయుతంగా బంద్ నిర్వహిస్తున్న వారిపై దమనకాండకు దిగటం తగదని ప్రభుత్వానికి గుర్తు చేశారు.

### ఇచ్చిన హామీనే అమలు చేయమంటున్నారు

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లిస్తామని ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీనే అమలు చేయాలని ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి గుర్తు చేశారు. సమ్మెకు అన్నిరకాలుగా బీజేపీ మద్దతు ఉంటుందన్నారు.

### సీఎం రాజీనామా చేయాలి: మోత్కుపల్లి

ఆర్టీసీ సమ్మె విషయంలో కోర్టు మందలించినందున నైతిక బాధ్యత వహించి సీఎం పదవికి రాజీనామా చేయాలని సీఎం కేసీఆర్‌ను సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులపై సెల్ఫ్ డిస్మిస్‌ను ప్రయోగించేందుకు వాళ్లను నువ్వు అపాయింట్ చేశావా? అని సీఎంను నిలదీశారు. అంబేద్కర్ ఆలోచనలను అణగదొక్కటం తగదని ప్రభుత్వానికి హితవు చెప్పారు.

### ఇక్కడెందుకు చేయరు?: మందకృష్ణ మాదిగ



లోటు బడ్జెట్ ఉన్న ఏపీలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయగా కేవలం రూ.3వేల కోట్ల నష్టాలున్న తెలంగాణలో ఎందుకు విలీనం చేయరు..? అని ప్రభుత్వాన్ని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. క్రమంగా ఆర్టీసీని ప్రయివేటీకరించేందుకు సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉండగా సకల జనుల సమ్మె చేసినా ఆర్టీసీ కార్మికులను సెల్ఫ్ డిస్మిస్ చేయలేదని గుర్తు చేశారు. ఆర్టీసీ సమ్మెపై టీఆర్‌ఎస్‌లో తిరుగుబాటు ప్రారంభమయిందని సీఎం కేసీఆర్‌ను హెచ్చరించారు. ఉద్యమ మంత్రులు సమ్మెకు మద్దతుగా ఉన్నారని గుర్తు చేశారు.

### ఉద్యమ కార్యాచరణ

నేడు (21న) అన్ని బస్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు వారి కుటుంబ సభ్యులు బైఠాయింపు.

22న: సమ్మె చేస్తున్న కార్మికుల పొట్టకొట్టొద్దని బస్సుల్లో ప్రయాణిస్తూ తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లకు విజ్ఞప్తి

23న : ప్రజా ప్రతినిధులతో ములాఖత్ అయి చర్చలకు పిలిచే విధంగా, సమ్మె డిమాండ్లను ఆమోదించేవిధంగా సీఎం ఒత్తిడి తేవాలని వినతి.

24న: అన్ని బస్ డిపోల ఎదుట మహిళా కండక్టర్ల దీక్షలు.

25న: సబ్బండ వర్గాలు జాతీయ రహదారులపైకి వచ్చి రాస్తారోకోలు, దిగ్బంధాలు.

26న: సీఎం మనసు కరగాలని వేడుకుంటూ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికుల పిల్లల దీక్షలు.

27న: జీతాలు లేనందున దీపావళి పండుగ జరుపుకోకుండా నిరసనలు.

28న: హైకోర్టులో ఆర్టీసీ కేసుపై వాదనలు.

29న: 30నాటి బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు.

30న: సకల జనుల సమరభేరీ పేరుతో భారీ బహిరంగ సభ.

## గుండెపోటుతో ఆర్టీసీ ఉద్యోగి మృతి



గోసుకొండ మల్లయ్య

**చిట్యాల, ప్రభ న్యూస్ :** సూర్యాపేట జిల్లా, చిట్యాల పట్టణ కేంద్రానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి గోసుకొండ మల్లయ్య (55) గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. మృతుడు నల్లగొండ డిపోలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆర్టీసీ కార్మికుల సమ్మెతో ఉద్యోగులు, కార్మికులను ఉద్యోగాల నుండి తొలగించడంతో మనస్తాపానికి గురైన మల్లయ్య గురువారం రాత్రి గుండెపోటుకు గురయ్యాడు. మల్లయ్యను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మల్లయ్య శనివారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మల్లయ్యను మొదట తార్నాకలోని ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స నిరాకరించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన మల్లయ్య భౌతికకాయాన్ని ఆదివారం ఆర్టీసీ జేఏసీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## ప్రైవేటీకరణ కుట్రను అడ్డుకుందాం



ఆర్టీసీ వంటావార్పు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్

**వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో :** ఆర్టీసీని ప్రయివేటు పరం చేయాలనే కుట్రపూరిత వైఖరితోనే ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరిస్తున్నారని, ముఖ్యమంత్రి కుట్రలను సాగనివ్వమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ హెచ్చరించారు. ఆర్టీసీ సమ్మె కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరంగల్ అర్బన్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ కేసీఆర్ వాఖ్యల వల్లనే ఇప్పటి వరకు 20 మంది చనిపోయారన్నారు. కేసీఆర్‌తన మూర్ఖపు పట్టుదలను వీడి కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్ ఉద్యమ ద్రోహులుగా మారవద్దని లక్ష్మణ్ హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎంఎల్ఎ మార్తినేని ధర్మారావు, మాజీ మేయర్ టి. రాజేశ్వర్‌రావు, బీజేపీ వరంగల్ అర్బన్ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా, మాజీ ఎంఎల్ఎ రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చాడ సురేష్‌రెడ్డి, ఏనుగు రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులతో దీపావళి: బీజేపీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా బీజేపీ దీపావళిని ఆర్టీసీ కార్మికుల కుటుంబాలతో కలిసి జరుపుకోవాలని నిర్ణయించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ నేతృత్వంలో రాష్ట్ర పార్టీ పదాధికారుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల సమ్మె, దసరా పండుగకు కూడా ఆర్టీసీ కార్మికులకు పని చేసిన కాలానికి సంబంధించిన వేతనాన్ని కూడా చెల్లించక పోవడంపై కొందరు నేతలు ప్రస్తావించారు. వేతనాలు రాక పోవడంతో చాలా మంది కార్మికులు దసరా పండుగను జరుపుకోలేదని, వారి కుటుంబాలలో పండుగ శోభలేకుండా పోయిందని ప్రస్తావించారు. దీంతో దీపావళి వరకు కూడా కార్మికులకు ప్రభుత్వం వేతనాలను చెల్లించక పోతే వారి కుటుంబాలతో కలిసి దీపావళిని జరుపుకోవాలని పార్టీ నిర్ణయించింది.

### కాంగ్రెస్ రహిత జేఏసీలో పాల్గొనాలి

ఆర్టీసీ సమ్మెకు పూర్తి స్థాయిలో మద్దతివ్వాలని, ఆర్టీసీ జేఏసీ చేసే అన్ని ఆందోళనల్లో పాల్గొనాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసే సమావేశాలకూ వెళ్ళొచ్చని, అయితే కాంగ్రెస్ రహిత రాజకీయ జేఏసీతో కలిసి వెళ్ళాలని ఆదేశించారు. ఆర్టీసీ విషయంలో ప్రభుత్వం తల వంచాల్సిందేనని, ఎట్టి పరిస్థితులలో ఆర్టీసీ కార్మికులకు అన్యాయం జరుగకుండా చూడాలని సమావేశం నిర్ణయించింది.

## సమ్మెకు పెరుగుతున్న మద్దతు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు పెరుగతోంది. సమ్మెకు ఏపీఎస్‌ఆర్టీసీ కార్మిక జేఏసీ మద్దతుగా నిలుస్తుందని ఆ రాష్ట్ర నేత సుందరయ్య ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఎస్‌వీకేలో అఖిలపక్ష, కార్మిక జేఏసీ నేతలను కలిసి సంఘీభావం ప్రకటించారు. ఈనెల 24న విజయవాడలో సామూహిక దీక్షలు, నిరసనలు చేస్తామన్నారు. ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. జాతీయ కార్మిక సంఘాలు పిలుపునిస్తే అవసరం అయితే ఒకరోజు సమ్మెకు కూడా దిగుతామన్నారు. టీఎస్‌ఆర్టీసీ సమ్మెకు మద్దతుగా తమిళనాడులో ఒకరోజు సమ్మె చేయనున్నట్లు అక్కడి కార్మికులు సందేశం పంపారని తెలిపారు.

### తెలంగాణ సర్పంచ్ సంఘం మద్దతు

ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు తెలంగాణ సర్పంచ్‌ల సంఘం పూర్తి మద్దతు తెలిపింది. జైలు నుంచి విడుదలయిన సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూమన్న యాదవ్‌ను ఆసంఘం నేతలు కలిశారు. అనంతరం ప్రణిల్‌చందర్, ధనలక్ష్మీ మాట్లాడుతూ... ఆర్టీసీకి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవినాభావ సంబంధం ఉందన్నారు. వెంటనే ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా గ్రామీణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం కేసీఆర్‌కు గుర్తు చేశారు. కాగా... మనస్థాపంతో మృతిచెందిన సత్తుపల్లి డిపో డ్రైవర్ ఖాజామియా అంత్యక్రియల్లో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మంద కృష్ణమాదిగ పాల్గొన్నారు. కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలో ఖాజా మియా అంత్యక్రియలు జరిగాయి.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో నేడు ప్రగతి భవన్ ముట్టడి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ సోమవారం చేపట్టిన ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని పీసీసీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం మెడలు వంచి ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేసే వరకు పోరాడతామని, అందులో భాగంగా ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

### కాంగ్రెస్ ఎంపీలు రేవంత్, కోమటిరెడ్డి భేటీ

ప్రగతి భవన్ ముట్టడిపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు జూబ్లీహిల్స్‌లోని మాజీమంత్రి షబ్బీర్ ఆలీ నివాసంలో కాంగ్రెస్ ఎంపీలు రేవంత్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఏఐసీసీ సభ్యుడు దయాసాగర్, ఇతర సీనియర్ నాయకులు భేటీ అయ్యారు. అనంతరం షబ్బీర్ ఆలీ మీడియాతో మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమ్మెను విరమింపజేయడానికి సీఎం కేసీఆర్ విఫలమైతే 21వ తేదీన ప్రగతిభవన్ ముట్టడిస్తామని ఇదివరకే కాంగ్రెస్ పార్టీ హెచ్చరించిందన్నారు. చర్చలు జరపాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ కేసీఆర్ ధిక్కరించారని, హైకోర్టు ఆదేశించినప్పటికీ ఆర్టీసీకి పూర్తి స్తాయి ఎండీని నియమించలేదని విమర్శించారు.

## సురేందర్‌గౌడ్ కుటుంబానికి వీహెచ్ సాయం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆత్మహత్యకు పాల్పడిన ఆర్టీసీ కార్మికుడు సురేందర్ గౌడ్ కుటుంబానికి రూ.50 వేల సహాయాన్ని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఆదివారం అందజేశారు. కార్వాన్‌లోని సురేందర్ గౌడ్ నివాసానికి వెళ్ళి, సురేందర్ గౌడ్ భార్య జ్యోతి, పిల్లలు సంకీర్తన్‌ను పరామర్శించి ఓదార్చారు. సురేందర్ గౌడ్ కుమారుడికి ఆర్టీసీలో ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని వీహెచ్ డిమాండ్ చేశారు. హైకోర్టు సూచనలు, ఉద్యోగుల ఆత్మహత్యల తర్వాత కూడా ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించకపోవడం విచారకరమన్నారు.

## తాత్కాలిక డ్రైవర్ల అజాగ్రత్తకు ఇద్దరు బలి

**హైదరాబాద్/మాక్లూర్, ఆంధ్రప్రభ:** కార్మికుల సమ్మె ప్రభావం కార్మికులపై ఏ మాత్రం పడకుండా ఉండేందుకు ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏర్పాట్లు ప్రయాణికులు, ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. ఆదివారం వరంగల్ జిల్లాలో బస్సు ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. ఇదే జిల్లాలో మరో బస్సు ప్రమాదం తృటిలో తప్పింది. వరంగల్ జిల్లా పస్రా వద్ద బస్సు వెనక చక్రాల కింద పడి మహిళ మృతి చెందింది. అదే జిల్లాలో మడికొండ వద్ద బస్సులో నుంచి పొగలు రావడంతో ప్రయాణికులు కేకలు వేశారు. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును నిలిపి వేయడంతో ప్రయాణికులంతా బస్సు దిగి పరుగులు తీయడంతో కొంత గందరగోళం ఏర్పడింది.

సమ్మె మొదలై 16 రోజులవుతున్నా ప్రభుత్వం, కార్మికులు బెట్టు వీడక పోవడంతో సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. సమ్మెను మరింత ఉదృతం చేయాలని ఆర్టీసీ జేఏసీ నిర్ణయించడం, సోమవారం నుంచి పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోనుండటంతో ప్రయాణికులకు మరిన్ని ఇక్కట్లు తప్పేలా లేవు. యధావిధిగా తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో ఆర్టీసీ యాజమాన్యం బస్సులను తిప్పుతోంది. బస్సులను నడిపే అనుభవం అంతంత మాత్రంగానే ఉండటంతో చాలాచోట్ల బస్సుల మొరాయింపు మొదలైంది. ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 200 బస్సులు మొరాయించాయని గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లోని ప్రధాన రోడ్లలో చిన్న చిన్న సాంకేతికలోపాలతో బస్సులు నిలిచిపోయాయి. డ్రైవర్లలో మెకానిజం మెలుకువలు లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడుతోందని అధికారులు అంటున్నారు. సాధారణంగా బస్సు మొరాయిస్తే డ్రైవర్లు తాత్కాలిక మరమ్మత్తులు చేసుకుని డిపోలకు తీసుకు వస్తారు. అయితే తాత్కాలిక డ్రైవర్లకు అను భవం లేకపోవడంతో ఎక్కడికక్కడే నిలిచిపోతున్నా యని అధికారులు చెబుతున్నారు.

మరోపక్క తాత్కాలిక మెకానిక్‌ల కొరత కూడా సం స్థను వెంటాడుతోంది. సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండ క్టర్లతో పాటు మెకానిక్‌లను కూడా నియమించుకోవా లని నిర్ణయించి నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే డ్రైవర్, కండక్టర్లకు స్పందన బాగానే వచ్చినప్పటికీ మెకానిక్ పోస్టులకు స్పందన రాకపోవడంతో చాలా డిపోలలో మెకానిక్‌ల కొరత నెలకొంది. ఫలితంగా బస్సులు మొరాయిస్తే వెంటనే రిపేర్ చేయించడంలో జాప్యం ఏర్పడుతుంది.

### రోడ్లపై తిరిగిన 6437 బస్సులు

ఆదివారం తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లతో మొత్తం 6437 బస్సులు తిప్పినట్లు ఆర్టీసీ జారీ చేసిన ప్రకటన తెలిపింది. ఇందులో ఆర్టీసీ బస్సులు 4502, ఆర్టీసీ అద్దె బస్సులు1935 ఉన్నాయని అధికారులు వివరించారు. సోమవారం పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో మరిన్ని బస్సులను నడుపనున్నామని తెలిపారు.



### నిజామాబాద్ జిల్లాలో...

నిజామాబాద్ జిల్లా, మానిక్‌భండార్‌చౌరస్తా వద్ద ఆదివారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. రోడ్డు దాటుతున్న సమయంలో కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధన్‌రాజ్ (34) అనే వ్యక్తికి బలమైన గాయాలు కావడంతో అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా నాగమూక్‌పల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు., ధన్‌రాజ్, సుభాష్ ఇద్దరు అన్నదమ్ములు. అయిదు సంవత్సరాలుగా స్థానికంగా కూలీ పనులు చేసుకుని జీవనం గడుపుతున్నారు. ఇరువురు నడుచుకుంటూ రోడ్డు దాటే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. తమ్ముడి మృతుని కళ్లారా చూపిన సుభాష్ దిగ్భ్రాంతికి లోనయ్యాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని అన్న సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయినాథ్ చెప్పారు.

## నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన

• ఉపాధ్యాయ సంఘాల నిర్ణయం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దసరా సెలవుల అనంతరం రాష్ట్రంలో నేటి (సోమవారం) నుంచి పునః ప్రారంభం కానున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలపనున్నారు. ఆర్‌టీసీ కార్మికులు కొనసాగిస్తున్న నిరవధిక సమ్మెకు సంఘీభావంగా సోమవారం ప్రార్థనా సమయం నుంచే ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలను ధరించి తమ నిరసనను తెలపాలని నిర్ణయించినట్టు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ), జాయింట్ యాక్షన్ కమిటీ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్స్ (జాక్టో) నిర్ణయించాయి.

ఈ మేరకు రెండు కమిటీల స్టీరింగ్ కమిటీల సంయుక్త సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు యూఎస్‌పీసీ నేత చావా రవి తెలిపారు. ప్రభుత్వం వెంటనే కల్పించుకుని ఆర్‌టీసీ కార్మికుల సమ్మెను విరమింప చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలను చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిపారు.

## ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు భారీగా అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎయిర్‌పోర్టులో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు ప్రయాణీకులను తనిఖీ చేయగా వారి వద్ద 915.17 గ్రాముల బంగారం లభించింది. బంగారానికి సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో అధికారులు బంగారాన్ని సీజ్ చేసి.. వారిపై కేసు నమోదు చేశారు.

## ఒక్క రాత్రిలో 1.1 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టిన రతుల్ పురి

**న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్ పురి అమెరికాలో ఒక్క రాత్రి గడిపేందుకు 1.1 మిలియన్ డాలర్లు ఖర్చుచేశారని ఈడీ తెలిపింది. రతుల్ పురిపై మనీ లాండరింగ్ కేసులో చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ ఆయన యూఎస్‌లోని ఓ నైట్‌క్లబ్‌లో లగ్జరీగా గడిపారని, ఒక్క రాత్రిలో భారీ మొత్తంలో ఖర్చుచేసినట్టు తెలిపింది.

## వారం రోజులు కుండపోత



హైదరాబాద్‌లో ఆదివారం వర్షానికి జలమయమైన వీధులు

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించారు. అటు రాయలసీమ, కోస్తాంధ్ర, ఇటు తెలంగాణ వ్యాప్తంగా మరో రెండు రోజులపాటు అతి భారీ వర్షాల తీవ్రత కొనసాగుతుందని హైదరాబాద్ ప్రాంతీయ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ రెండు రాష్ట్రాలతో పాటు మధ్య మహారాష్ట్ర, గోవా, కొంకన్, తూర్పు ఉత్తరప్రదేశ్, మరాఠ్వాడ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్, అసోం, ఒడిషా, మేఘాలయ, కర్నాటక, కేరళ, పుదుచ్చేరి ప్రాంతాల్లో అతిభారీ వర్షాల తీవ్రత జనజీవన స్రవంతిపై ప్రభావం చూపుతోంది. లోతట్టు ప్రాంతాలన్నీ ముంపుకు గురవుతుండడంతో కేంద్ర విపత్తు నిర్వహణ శాఖ ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపింది. పీడిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాతావరణ శాఖ ప్రకారం మరో రెండు రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు ప్రభావం చూపి తేగనుక భారీ పంటనష్టం జరిగే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే అవసరానికి మించిన వర్షాలు కురిసినందున కొన్ని జిల్లాల్లో అతివృష్టి కొనసాగుతోంది. ఆయకట్టు పొలాలు వరదనీటి ముంపుకు గురై రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అలాగే సముద్ర తీర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ బలగాలు సహాయ చర్యలకు సిద్ధమవుతున్నారు.

పలు రాష్ట్రాల్లో ఇప్పటికే చర్యలు ప్రారంభమయ్యాయి. జార్ఖండ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మేఘాలయ, అసోం రాష్ట్రాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి కొనసాగుతోంది. ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు వాతావరణ ఎమర్జెన్సీ ప్రకటించాయి. ఈ తుపాను గరిష్టంగా వారం రోజులపాటు కొనసాగుతుందని వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఆయా రాష్ట్రాలు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. పలుచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు వెలువడిన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకార కుటుంబాలకు సూచనలు, సలహాలు ఇచ్చి ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్ళకుండా హెచ్చరిస్తున్నారు. మరిన్ని రోజులపాటు తుపాను తీవ్రత కొనసాగితే మత్స్యకార కుటుంబాలకు నిత్యావసర వస్తువులను కూడా సరఫరా చేయాలని తెలుగు రాష్ట్రాలు యోచిస్తున్నాయి.

గడిచిన 48 గంటలుగా అతి భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరం అతలాకుతలమైంది. కిలోమీటర్ల పొడవునా రహదారులు ధ్వంసమయ్యాయి. నాలాలు పొంగిపొర్లుతూ లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. అనేకచోట్ల జనజీవనం స్తంభించింది. రోడ్లపై మోకాలులోతు నీళ్ళు ప్రవహిస్తుండడంతో రవాణా రాకపోకలు స్తంభించాయి. గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల పురాతన కట్టడాలు కుప్పకూలాయి. జీహెచ్ఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయ పునరావాస చర్యలు కొనసాగిస్తున్నారు.

## నెల్లూరు అల్లాయ్‌కు త్వరలో శంకుస్థాపన

• ఉప రాష్ట్రపతి సూచనపై రక్షణమంత్రి హామీ



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ప్రతిపాదిత ఉత్కర్ష అల్యూమినియం ధాతు (అల్లాయ్) నిగమ్ లిమిటెడ్ ప్రాజెక్టుకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఆదివారం ఉప రాష్ట్రపతి భవన్‌లో తనను మర్యాదపూర్వకంగా కలిసిన రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో భేటీ సందర్భంగా వెంకయ్యానాయుడు ఈ విషయంపై చర్చించారు. అల్లాయ్ అమలు పనులను వేగవంతం చేయాలని రక్షణ మంత్రికి సూచించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలం బొడ్డువారిపాలెంలోని పారిశ్రామికవాడలో ఈ ప్లాంటును నిర్మించాలని ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. రక్షణ శాఖ ఆధ్వర్యంలో మిధాని, నాల్కో సంయుక్త ఆధ్వర్యంలో రూ.4వేల కోట్లతో అల్యూమినియం అల్లాయ్ ప్రాజెక్టు ఏర్పాటు శంకుస్థాపనకు ఆగస్టు 26వ తేదీన శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. అయితే మాజీ ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆకస్మిక మరణంతో ఈ కార్యక్రమం వాయిదా పడింది. అయితే ఈ ప్రాజెక్టుపై దృష్టి పెట్టి ప్లాంటు పనులను వేగవంతం చేయాలని ఉపరాష్ట్రపతి కోరగా.. త్వరలోనే శంకుస్థాపన చేసి పనులను మొదలు పెడతామని రాజ్‌నాథ్ సింగ్ హామీ ఇచ్చారు.

Andhraprabha business 2019
బిజినెస్
BUSINESS

## థామస్ కుక్ ఇండియా వ్యాపారంలో 25శాతం వృద్ధి




**కోలకతా :** ట్రావెల్ దిగ్గజం థామస్‌కుక్ ఇండియా (టీసీఐఎల్) దేశీయ వ్యాపారంలో 25 శాతం వృద్ధిని సాధించింది. వీటిలో విదేశీ పర్యాటక విభాగం నుంచి ఎక్కువ ఆదాయం సమకూర్చుకుంది. బ్రిటిష్ కంపెనీ థామస్‌కుక్ పీఎల్‌సీ ఆర్థికంగా కుప్పకూలినా దాని ప్రభావం దేశీయ థామస్‌కుక్‌పై లేదని టీసీఐఎల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (లీజర్) రోమిల్‌పంత్ చెప్పారు. ఇటీవలే బ్రిటిష్ కంపెనీ థామస్‌కుక్ కుప్పకూలిన విషయం తెలిసిందే. దేశీయ థామస్‌కుక్‌పై దాని ప్రభావం చూపిస్తుందని ఊహించినా అలాంటి పరిస్థితి ఏమీలేదని పంత్ అన్నారు. కాగా భారత్ థామస్‌కుక్ కొన్ని సంవత్సరాల క్రితమే తమ వ్యాపారాన్ని ప్రారంభించింది. ఏడాదికి 25 శాతం చొప్పున వ్యాపారాభివృద్ధి కనిపిస్తోంది. వాటిలో విదేశీ వ్యాపారం 10-15 శాతం వాటా ఉంటుందని పంత్ చెప్పారు. దేశీయ మార్కెట్లో తమ వాటా 20 శాతం వరకు ఆక్రమిస్తోందని తెలిపారు. వచ్చే రెండు నుంచి మూడు సంవత్సరాల్లో దేశీయ వ్యాపారం వాటా 30-35 శాతానికి చేరుతుం దన్నారు. దేశీయ, అంతర్జాతీయ రూట్లలో మరింత విస్తరిస్తామన్నారు. ముఖ్యంగా అంటార్కిటికా 15 రోజుల పర్యటనకు ఒక్కరికి రూ.9.9 లక్షల చార్జీ వసూలు చేస్తున్నామని.. బుకింగ్‌లు పూర్తిస్థాయిలో ముగిశాయని పంత్ తెలిపారు.

## చైనా నుంచి వచ్చే కంపెనీలకు..

# సుస్వాగతం

● బ్లూప్రింట్‌తో అన్నీ రకాల సదుపాయాలు సిద్ధం : ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**వాషింగ్టన్ :** చైనా నుంచి బయటపడాలనే అంతర్జాతీయ కంపెనీలకు భారత్ స్వాగతం పలుకుతుందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ఇక్కడ చెప్పారు. ఇండియాలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం చేసుకోవాలనే వారికి ఖచ్చితంగా భారత్ సరైన దేశమని వారు భావిస్తారని ఆమె తెలిపారు. ఇలాంటి సమయంలో భారత ప్రభుత్వం ఖచ్చితంగా పరిశ్రమలకు చెందిన దిగ్గజాలతో సమవేశమై భారత్‌లో వ్యాపారాలు చేసుకోవడానికి ఆహ్వానిస్తుందన్నారు.భారత్‌కు తమ కంపెనీలు తరలించాలనే బహుళజాతి కంపెనీలు.. ఉదాహరణకు అమెరికా లేదా యూరోపియన్ లేదా బ్రిటిష్ జాతీయులు చైనా నుంచి బయటపడాలనుకొనే వారి కోసం తాము బ్లూప్రింట్ (అన్నీ రకాల మౌలిక సదుపాయాలు) తయారు చేసి సిద్ధంగా ఉంచుతామన్నారు. వారితో సంప్రదింపులు జరుపుతామని, పెట్టుబడులకు భారత్‌లో అవకాశాలు మెండుగా ఉంటాయని వారికి వివరించి చెబుతామని ఆమె అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ బ్యాంకుల వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా వాషింగ్టన్‌లో మాట్లాడుతూ చెప్పారు.కంపెనీలు స్థాపించే వారి కోసం ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, అది ఎలక్ట్రానిక్స్, లేదా లిథియమ్ ఐయాన్ బ్యాటరీ లేదా ఇతర సెమికం డక్టర్లకని తెలియజేశారు. ప్రస్తుతం అమెరికా - చైనాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాన్ని దృష్టిలో ఉంచుకొని మాత్రం ఈ నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. కొన్ని కంపె నీలు చైనా నుంచి ఏదో కారణంతో బయటికి రావాలనుకుం టున్నాయి కాబట్టి ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. అలాగే చైనా నుంచి అన్నీ కంపెనీలు బయటపడాలని చూడ్డం లేదని, కొన్ని కంపె నీలు అక్కడే ఉండి చైనా మార్కెట్‌కు సేవలందించాలనుకుంటు న్నాయని సీతారామన్ అన్నారు.

### చైనా అతి పెద్ద మార్కెట్

చైనా మార్కెట్ గురించి ప్రస్తావిస్తూ.. దేశీయంగా చైనా అతి పెద్ద మార్కెట్, అదీ కాకుండా అక్కడి ప్రజల్లో కొనుగోలు శక్తి చాలా ఎక్కువ, భారత్‌తో పోల్చుకుంటే వినియోగం మరీ ఎక్కువ. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తలు ఉన్నాలేకున్నా ఈ కంపెనీలు మాత్రం అక్కడే కొనసాగుతాయని ఆమె వివరించారు. భారత్ కూడా అతి పెద్ద మార్కెట్, ఇక్కడ కంపెనీలు స్థాపించి మార్కెట్లో వాటా పెద్ద వాటా దక్కించుకోవాలనే వారికి అన్నీ రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. చైనాలోనే తమ కంపెనీలను కొనసాగిస్తూనే.. అక్కడి నుంచి బయటికి వచ్చి ఇతర దేశాల్లో కంపెనీలు స్థాపించి.. అక్కడి నుంచి విదేశీలకు ఎగుమతులు చేసుకోవాలనే కంపెనీలు, అలాగే కొత్త మార్కెట్‌లోకి (ఉదాహరణకు భారత్) ప్రవేశించాలనుకొనే కంపెనీలకు తాము పూర్తిస్థాయి సహాయ సహకారాలతో పాటు అన్నీ రకాల మద్దతు ఇస్తామని ఆమె వివరించారు.

### వియత్నాంలో అవకాశాలు తక్కువ

పెట్టుబడులకు వియత్నాంలో అవకాశాలు తక్కువ అని.. అక్కడి మార్కెట్ భారత్‌లాగా అంత ఆకర్షణీయంగా ఉండదని ఆమె అన్నారు. బ్యాంకులు, ప్రభుత్వప్రతినిధులతో చర్చలు జరిపినప్పుడు వియత్నాంలో ఇక విస్తరణకు అవకాశాలు లేవని, అలాగే మానవ వనరులు కూడా తక్కువని చెప్పారని సీతారామన్ వివరించారు.

### పన్ను రాయితీల గురించి..

ప్రస్తుతం భారత్‌లో పన్ను వ్యవస్థ సరళీకరించామని, ముఖ్యంగా కార్పొరేట్ ఆదాయంతో పాటు కార్పొరేట్ పన్నును బాగా తగ్గించామన్నారు. ఇప్పుడే వియత్నాం గురించి ప్రస్తావించాను కాబట్టి.. చైనా నుంచి తప్పుకొని ఇతర దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఖచ్చితంగా భారత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయని భరోసాను వ్యక్తం చేశారు.

### వృద్ధిరేటుకు నిర్మాణాత్మకమైన చర్యలు

వృద్ధిరేటులో అభివృద్ధి సాధించాలనుకొనే దేశాలు ద్రవ్య, నిర్మాణాత్మకమైన విధానాలు అమలు చేయాలని నిర్మలా సీతారామన్ సూచించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) కూడా తమ విధాన నిర్ణయాల్లో కొన్ని మార్పులు చేసి బలహీన్నమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాలకు మూలధనం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

అంతర్జాతీయ ద్రవ్యనిధి, ఫైనాన్షియల్ కమిటి (ఐఎంఎఫ్‌సీ) ప్లీనరీ సమావేశంలో ఆమె మాట్లాడారు. కొన్ని దేశాల వృద్ధికి ఐఎంఎఫ్ పరిష్కారమార్గాలు చూపించాలన్నారు. ఈ దేశాలకు పెట్టుబడులు అందేలా కృషి చేసి దానిపై కూడా పర్యవేక్షణ కూడా తమ చేతుల్లోనే ఉంచుకోవాలని చెప్పినట్లు ఆర్థికమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

### జేఎన్‌యూలో తన సమకాలికురాలు సీతారామన్‌పై అభిజిత్ బెనర్జీ

భారత ఆర్థిక వ్యవస్థపై నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా విమర్శించింది. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురించి ఆయన భారతీయ జాతీయ టెలివిజన్‌తో మాట్లాడుతూ.. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో ఆమె తన సమకాలి కురాలని అన్నారు. పలు అంశాలపై తమ అభిప్రాయాలు ఒకే విధంగా ఉండేవన్నారు. ఆర్థిక వ్యవస్థపై బెనర్జీ వ్యాఖ్యాలపై సీతారామన్ మాత్రం స్పందించలేదు. కానీ కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ మాత్రం తేలికగా తోసి పుచ్చారు. వామపక్ష భావాలు కలిగిన వారి అభిప్రాయాలుగా ఇలానే ఉంటాయని తేల్చేశారు. కాగా జెఎన్‌యూ సంప్రదాయబద్ధంగా లెఫ్టిస్ట్ భావాలు కలిగిన వారే ఎక్కువగా ఉంటారు. తన అభిప్రాయాలతో సీతారామన్ అభిప్రాయాలు బాగా కలుస్తాయని బెనర్జీ అన్నారు. అయితే అత్యంత సన్నిహితమిత్రులం కాకున్నా స్నేహితులమేనన్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరు కాదనుకొనే స్థాయిలో లేదన్నారు. విశ్వవిద్యాలయంలో వివిధ రకాల విద్యార్థుల మధ్య అభిప్రాయాలు విభిన్నంగా ఉంటాయన్నారు. మొత్తానికి భారతీయ జనతాపార్టీ నేతృత్వంలో ఆర్థిక వ్యవస్థ మాత్రం మెరుగ్గా లేదని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పెద్దనోట్ల రద్దు సరైన నిర్ణయం కాదని, వినియోగం మందగించడంతో దాని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని బెనర్జీ పేర్కొన్నారు.

## ఈనెలలో విదేశీ పెట్టుబడులు రూ.5,072కోట్లు




**న్యూఢిల్లీ :** విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ)లు దేశీయ మార్కెట్లో ఈ నెలలో రూ.5,072 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. ప్రభుత్వం డిమాండ్ పెంచడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు మొదలుపెట్టడంతో ఎఫ్‌పీఐలు పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. ఈ నెల దేశీయ మార్కెట్లోకి ఈక్విటీ, డెట్ మార్కెట్లోకి మొత్తం రూ.6, 557.8 కోట్లు పెట్టుబడులు రాగా.. అంతకు ముందు జులై, ఆగస్టు నెలల్లో పెద్దమొత్తంలో ఎఫ్‌పీఐలు పెట్టుబడులు తరలిపోయారు. ఈ నెల 1-18వ తేదీ వరకు ఈక్విటీ మార్కెట్లో రూ.4,970 కోట్లు, డెట్ మార్కెట్లో రూ.102 కోట్లు పెట్టుబడులు పెట్టాయి. ఈ రెండు పెట్టుబడులు కలిపితే రూ.5,072 కోట్లుగా తేలాయి. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం మార్కెట్లకు గడ్డుకాలం పోయిందని, ఇక బడ్జెట్, వినియోగం డిమాండ్ పెంచుకోవడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ మార్కెట్లో పెట్టుబడుల జోరు పెంచారని చెబుతున్నారు. దీనికి తగ్గట్టు ప్రభుత్వం డిమాండ్ పెంచడం కోసం ఉద్యోగులకు డిఏ, కార్పొరేట్ పన్ను తగ్గించడంతో పాటు ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు మూలధనం సమకూర్చడం తదితర అంశాలు ఎఫ్‌పీఐలు పెట్టుబడులు పెద్దమొత్తంలో రావడానికి కారణంగా చెబుతున్నారు.

## ఈ-వేలం ద్వారా బకాయిల వసూళ్లు




**న్యూఢిల్లీ :** స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మొత్తం 11 మొండిబకాయిల నుంచి రూ.466.49 కోట్లు వసూలు చేసుకోవడానికి నవంబర్ 7వ తేదీన ఈ-వేలం నిర్వహిస్తుంది. రిజర్వుబ్యాంకు నిబంధనల ప్రకారం మొత్తం 11 ఖాతాలను ఏఆర్‌సీ/బ్యాంకులు/ఎన్‌బీఎఫ్‌సీ, ఎఫ్‌లకు విక్రయించనున్నట్లు ఎస్‌బీఐ వేలం నోటీసులు పేర్కొంది. వేలానికి రానున్న ఖాతాలు ఇలా ఉన్నాయి. భాటియా గ్లోబల్ ట్రేడింగ్ (బీజీటీఎల్) బకాయి రూ.177.02 కోట్లు, భాటియా కోక్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ రూ.104.15 కోట్లు, భాటియా కోల్ వాషరీస్ రూ.12.58 కోట్లు, ఏషియన్ నేచురల్ రీసోర్సెస్ ఇండియా లిమిటెడ్ రూ.2.18 కోట్లు, మహారాష్ట్ర స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.40.51 కోట్లు, అన్నల్ స్టీల్ లిమిటెడ్ రూ.37.70 కోట్లు, విధాతా మెటల్స్ రూ.36.98 కోట్లు వేలానికి రానున్నాయి. ఈ వేలం పాటలు 'స్విస్ చాలెంజ్ పద్దతి' ద్వారా నిర్వహిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆఫర్‌తో పాటు అత్యధికంగా బిడ్ దాఖలు చేసిన వారితో పోల్చిచూసి ఎక్కువ బిడ్‌దాఖలు చేసిన వారిని విజేతగా గుర్తిస్తారు.

## వచ్చేనెల నుంచి ఎయిరిండియా వేలం




**న్యూఢిల్లీ :** ఎయిర్ ఇండియాలో ప్రభుత్వం వంద శాతం వాటాలను విక్రయించాలని నిర్ణయించింది. ప్రాథమిక బిడ్లను వచ్చే నెల నుంచి ఆహ్వానించనుంది. ఇప్పటికే కొన్ని ఎయిర్‌లైన్స్ వాటాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపినట్లు విశ్వసనీ యవర్గాలు తెలియజేశాయి. కాగా ఎయిర్‌లైన్స్ ఇప్పటికే రూ.58వేల కోట్ల అప్పుల్లో మునిగిపోయింది. దీంతో పాటు వేలాది కోట్ల రూపాయల నష్టాల్లో కూరుకుపోయింది. ఎయిర్‌లైన్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఐఎఎల్)కు తుది మెరుగులు దిద్దుతున్నట్లు తెలిసింది. ఈ నెలాఖరున కానీ..వచ్చే నెలలో కానీ ఈఓఎల్‌ను విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. ఈ -బిడ్డింగ్ సిస్టమ్ ద్వారా వేలం జరుగుతుంది. గత వారం పౌరవిమానయాన కార్యదర్శి ప్రదీప్‌సింగ్ ఖరోలా మార్చితో ముగిసిన ఆర్థికసంవత్సరం ఆర్థిక ఫలితాలపై సమీక్ష జరిపారు. కాగా ఎయిర్‌లైన్ బోర్డు సమావేశం ఈ నెల 22న జరుగ నుంది. అలాగే ఈ నెల ప్రారంభంలో ఎయిర్‌ఇండియా యాజమాన్యం ట్రేడ్ యూనియన్‌లతో సమావేశం అయ్యి నష్టాల్లో కూరుకుపోయిన ఎయిర్ ఇండి యా ను ప్రైవటైజేషన్ అంశం గురించి వివరించారు. అయితే మెజారిటి యూని యన్‌లు తమ ఉద్యోగాలు పోతాయన్న ఆందోళనతో ఈ ప్రతిపాదనను వ్యతిరేకించాయి.

## పెన్నార్ ఇండస్ట్రీకి రూ.304 కోట్ల ఆర్డర్

Pennar

**హైదరాబాద్ :** పెన్నార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇంజినీరింగ్ ప్రాడక్టులను ఉత్పత్తి చేసే కంపెనీ సెప్టెంబర్ నెలలో రూ.304 కోట్ల ఆర్డర్‌ను దక్కించుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. విప్రో పర్సనల్ కేర్ నుంచి గిడ్డంగులు, కరాగార భవనాలకు, ఫినిక్స్ ఐవీవై, అనీలా పుడ్స్, ఎస్ ఎస్ డెవలపర్స్ నుంచి ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ డివిజన్ ఆర్డర్లు దక్కించుకుంది. ప్రస్తుతం ప్రీ ఇంజినీర్డ్ బిల్డింగ్ యూనిట్ ఆర్డర్ పుస్తకం రూ.430 కోట్లకు చేరిందని పేర్కొంది. రైల్వే విభాగానికి చెందిన ఇంటగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, యూనివర్శల్ ఇంజినీరింగ్, రైట్స్ నుంచి రూ.250 కోట్ల ఆర్డర్లు దక్కాయి. పారిశ్రామిక విడిభాగాలు తయారు చేసే కంపెనీలు ఎమర్సన్, ఎండ్యరెన్స్, టెక్యుమెష్, బెయిలీ, బీఈఎంఎల్ నుంచి ఆర్డర్ల వచ్చినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ట్యూబ్ విభాగానికి ఎఎల్‌ఎఫ్ ఇంజినీరింగ్, జీఐ ఆటో, పాటన్ ఇంటర్నేషనల్, వీఈ కమర్షియల్ వెహికల్స్, థెర్మాక్స్‌లున్నాయి. ఎన్విరో విభాగానికి జెఎస్‌డబ్ల్యు స్టీల్, అరబిందోఫార్మా, సిండా ఇంజినీరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్‌ల నుంచి ఆర్డర్లు వచ్చినట్లు ఆదివారం ఒక ప్రకటనలో వివరించింది.

## అమెజాన్, ఫ్లిప్‌కార్డులకు నోటీసులు

amazon Flipkart

**న్యూఢిల్లీ :** ఇటీవల ముగిసిన పండుగ సీజన్‌లో తమ ప్లాట్‌పాం ద్వారా అత్యధికంగా విక్రయాలు జరిపిన ఐదుగురు విక్రేతల పేర్లు వెల్లడించాని ఈ- కామర్స్ కంపెనీలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లకు నోటీసు లు అందినట్లు సమాచారం. విక్రయించిన ధరలు, విక్రయదార్లకు (వెండర్స్)కు ఎలాంటి సహకారాలు అందించింది వివరాలు ఇవ్వాలని పరిశ్ర మల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్యం (డీపీఐఐటి) ప్రత్యేకంగా ఒక ప్రశ్నాపత్రాన్ని పైన తెలిపిన ఈ రెండు ఈ కామర్స్ కంపెనీలకు పంపిం చింది. వాటిలో మూలధనం వివరాలతో పాటు వ్యాపార పద్ధతి, సరకు సేకరణ తదితర వివరాలివ్వా లిని కోరినట్లు సమాచారం.ఈ పండుగ సీజన్ లో ఈ రెండు కంపెనీలపై పలు వరక్త మండలులు పలు ఫిర్యాదులను చేశాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను ఉల్లంఘించి ఈ పండుగ సీజన్‌లో భారీఅమ్మకాలు జరుపుకున్నాయని ఆరోపించాయి. కాగా డీపీఐఐటి ఇప్పటికే ఈ-కామర్స్ కంపెనీలతో పాటు సీఏఐటి (వర్తకుల మండలి) సభ్యులతో పలు సమావేశాలు జరిపింది. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్‌గోయల్ చెప్పారు.ప్రస్తుతం అమల్లో ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధన ప్రకారం 100 శాతం ఎఫ్‌డీఐని మార్కెట్ ప్లేస్ మోడల్ (అంటే ఈ -కామర్స్‌కంపెనీలు మార్కెట్లో లభించే వస్తువులను తమ ప్లాట్‌ఫాం ద్వారా విక్రయించుకోవడం.. ఇన్వెంటరీ బేస్డ్ మోడల్ అంటే ఈ-కామర్స్ కంపెనీ ప్రొడక్టును ఉత్పత్తి చేసి విక్రయించడం) కిందికి వస్తుంది. అలాగే ఆన్‌లైన్ కంపెనీలు తమ ప్లాట్‌ఫాం ద్వారా విక్రయించే వస్తువులపై ప్రత్యక్షంగాను లేదా పరోక్షంగా ప్రభావం చూపించరాదు. అయితే ఈ-కామర్స్ కంపెనీలు మాత్రం తాము ఎలాంటి ఎఫ్‌డీఐ నిబంధనలు ఉల్లంఘించలేదని చెబుతున్నాయి. ఈ పండుగ సీజన్‌లో ఈ-కామర్స్ కంపెనీలు సుమారు రూ.39వేల కోట్ల వ్యాపారాలు జరిపినట్లు కన్సెల్టింగ్ కంపెనీ రెడ్‌సీర్ వెల్లడించింది.

## ప్రభుత్వానికి... పాలనకు మధ్య టెక్నాలజీ వారిధిలాంటిది



**న్యూఢిల్లీ :** ప్రభుత్వానికి.. పరిపాలనకు మధ్య టెక్నా లజీ వారధి లాంటిదని ప్రధా న మంత్రి నరేంద్ర మోడీ అన్నా రు. ఆదివారం నాడు ఆయన ఇక్కడ 'బ్రిడ్జిటల్ నేషన్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకంద్వారా తమ ప్రభుత్వం టెక్నాలజీని మరింత బలోపేతంగా వినియోగిం చుకుంటుం దన్నారు. పుస్తకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఈ పుస్తకం ద్వారా తమ ప్రభుత్వం టెక్నాలజీపై మరింత ఫోకస్ పెట్టడానికి వీలవుతుంద న్నారు. టెక్నాలజీ వంతెన లాగా అందరిని కలుపు తుందని, ఎవరిని విడగొట్టదన్నారు. టెక్నాలజీ వల్ల ఎలాంటి ప్రమాదాలు ముంచుకు రావన్నారు. ఆశావాహులు తాము సాధించాలను కున్న లక్ష్యాలను సాధించకోవడానికి వీలవుతుం దన్నారు. టెక్నాలజీ ద్వారా ప్రజల ఇబ్బందుల ను తీర్చవచ్చునని ఆయన పేర్కొన్నారు. టాటాసన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్, రూపా పురుషోత్త మన్‌లు 'బ్రిడ్జ్ నేషన్' పుస్తకానికి సహ రచయితలు.

## రూ.1.47 లక్షల కోట్లు పెరిగిన మార్కెట్ సంపద

### రిలయన్స్ మార్కెట్ క్యాప్ రూ. 9లక్షల కోట్లు

**ముంబై:** శుక్రవారంతో ముగిసిన స్టాక్ మార్కెట్లో టాప్ 10 కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.1.47 లక్షల కోట్లు పెరిగాయి. అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్‌లు తమ మార్కెట్ క్యాప్‌ను పెంచుకున్నాయి. కేవలం ఇన్ఫోసిస్ తప్పించి మిగిలిన తొమ్మిది కంపెనీల మార్కెట్ క్యాప్ బాగా పెరిగాయి. వివరాల్లోకి వెళితే.. రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.39,876.44 కోట్లు పెరిగి రూ.8,97,179.47 కోట్లకు ఎగబాకింది. శుక్రవారం నాడు ఇంట్రాడేలో రిల్ మార్కెట్ క్యాప్ రూ.9 లక్షల కోట్లను దాటిపోయింది. టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ.26, 379.27 కోట్లతో రూ.7,71,996.87 కోట్లకు, హెచ్‌యూఎల్ మార్కెట్ క్యాప్ రూ.21,962.02 కోట్లతో రూ.4,55,952.72 కోట్లకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మార్కెట్ విలువ రూ.16,767.89 కోట్లతో రూ.6,72,466.30 కోట్లకు, హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ క్యాప్ రూ.14,728. 66 కోట్లతో రూ.3,61,801.97 కోట్లకు, ఎస్‌బీఐ మార్కెట్ క్యాప్ రూ.13,521.15 కోట్లతో రూ.2,40, 652.15 కోట్లకు, ఐసీఐసీఐ బ్యాంకు రూ.6,046.16 కోట్లతో రూ.2,82,783.39 కోట్లకు ఎగబాకగా..కొటక్ మహీంద్రా బ్యాంకు రూ.5,223.93 కోట్లతో రూ.3,08,555.52కోట్లకు, ఐటీసీ రూ.2,948.75 కోట్లతో రూ.3,02,861.98 కోట్లకు ఎగబాకగా.. దీనికి వ్యతిరేకంగా ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.20,594.7 కోట్లు తగ్గి రూ.3,29,751.88 కోట్లకు దిగివచ్చింది. బీఎస్‌ఈలో టాప్ 10 కంపెనీలు ఇలా ఉన్నాయి. రిల్ అగ్రస్థానంలో నిలవగా.. తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, కొటక్‌మహీంద్రా బ్యాంకు, ఐటీసీ, ఐసీఐసీఐ బ్యాంకు,ఎస్‌బీఐలు ఆక్రమించాయి. గత వారం సెన్సెక్స్ 1171.30 పాయింట్లు లేదా 3.07 శాతం లాభపడింది.



## ద్విచక్ర వాహనాల అమ్మకాల్లో బజాజ్ టాప్

**న్యూఢిల్లీ:** ద్విచక్ర వాహ నాల ఎగు మతుల్లో ఈ ఏడా ది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలానికి నాలుగు శాతం వృద్ధి కనిపించింది. ఎగు మతు ల్లో బజాజ్ అగ్రస్థా నంలో నిలిచిం ది. బజాజ్‌ఆటో ప్రపంచం లోని పలు మార్కెట్లకు 9 లక్షల యూనిట్లను ఎగుమతి చేసింది. వాటిలో ఆఫ్రికా, లాటిన్ అమెరికాలు న్నాయని సియామ్ విడుదల చేసిన తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. ద్విచక్ర వాహనాల విష యానికి వస్తే మో టార్ సైకిళ్లు, స్కూటర్లు, మోపెడ్‌లు న్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలంలో 17,93,957 యూనిట్లు ఎగుమతి చేయగా.. ఏడాది క్రితం 17,23,280 యూనిట్ల ఎగమ తులు జరిగాయి.

### అమ్మకాలు పెరుగుతాయి: ఎం అండ్‌ఎం



వచ్చే ఆర్థిక సంవ త్సరం నుంచి..వచ్చే ఆర్థి క సం వత్సరం ఆటో రం గం పుంజుకుంటుందని మహీం ద్రా అండ్ మహీంద్రా సీనియర్ అధి కారి ఒకరు తెలి పారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి బీఎ స్-6 ప్రమాణాల నిబంధనలు అమ ల్లోకి ధర లు కూడా పెరుగు తాయి. ధరలు పెరిగినా.. అమ్మకా లు మాత్రం పుంజుకుం టాయని భరోసా ను వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవ త్సరం మాంద్యం ప్రభావం ఆటో రంగంపై తీవ్రంగా ఉందన్నారు. ఆర్థిక వ్యవస్థను బలోపే తం చేయడా నికి ప్రభుత్వం పలు ఉద్దీపన పథకాలకు శ్రీకారం చుట్టింది. దీని ప్రభావంతో వచ్చే ఆరు నుంచి ఏడు నెలల్లోఆటో రంగం తిరిగి గాడిన పడుతుందని ఎంఅండ్‌ఎం సీఈ వో మహీంద్రా ట్రక్ అండ్ బస్ డివిజన్ వినోద్ సాహె చెప్పారు. మాంద్యం ప్రభావం వాణిజ్య వాహనాల అమ్మకాలు బాగా మందగించాయనిసాహె అన్నారు. సియామ్ అంచనా ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ కాలానికి మొత్తం వాణిజ్య వాహనాల అమ్మకాలు 22.95 శాతం క్షీణించి 3,75,480 యూనిట్లకు దిగిరాగా.. ఏడాది క్రితం ఇదేకాలంలో 4,87,319 యూనిట్ల విక్రయాలు జరి గా యని సియామ్ వివ రించింది. బీఎస్-6 ప్రమాణాలు అమల్లోకి వస్తే వాణిజ్య వాహనాల ధరలు పదిశాతం పెరుగు తాయని అంచనా.

## బీమా కంపెనీల ప్రకటనల్లో స్పష్టతుండాలి

irda

**న్యూఢిల్లీ:** బీమా కంపెనీలు ఇచ్చే ప్రకటనల్లో స్పష్టత ఉండాలని, ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉండరాదని బీమా నియం త్రణా సంస్థ ఐఆర్‌డీఏ బీమా కంపెనీలను కోరింది. కస్టమర్ల భద్రత ను దృష్టిలో ఉంచు కొని కంపె నీలు కొన్ని నియమ నిబంధనలు పాటించాలని సూచిం చింది. బీమా కంపెనీల ప్రకటనల్లో డూస్ అండ్ డోంట్స్ (ఇవి అమలవుతాయి.. ఇవి అమలుకా వు) అని స్పష్టంగా ఉండాలని తెలిపింది. ప్రకటనలు స్పష్టంగా ఉండాలని, తప్పుదోవ పట్టించే విధంగా ఉండరాదని స్పష్టం చేసింది. ప్రకటనలకు వినియోగించే సామగ్రి ఉదాహరణకు డిజైన్, కాగితం సైజు,రంగు, ఫాంట్‌టైప్, ఫాంట్‌సైజు, టోన్, వ్యాల్యూమ్ తదితర అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి కస్టమర్లకు తేలికగా అర్ధమయ్యేలా ఉండాలని ఐఆర్‌డీఏ సూచించింది. ఖచ్చితంగా అమలయ్యే నిబంధనలుంటే అదే భాషలోఅంతే పెద్ద అక్షరాలతో ఉండాలని పేర్కొంది. ఇంటర్నెట్ ద్వారా సమాచారం అందించాలనుకుంటే బీమా కంపెనీలు యూజర్‌ను దృష్టిలో ఉంచుకొని పూర్తి టెక్స్ట్‌తో పాటు కీలకమైన సమాచారం కూడా అందివ్వాలని, దీంతో పాటు టెర్మ్స్ అండ్ కండిషన్‌లు.. (నిబంధనలు, షరతులు) గురించి, అలాగే రిస్కుకు సంబంధించిన సమాచారాన్ని అందివ్వాలని ఎలాంటి సమాచారాన్ని దాచిపెట్టరాదని పేర్కొంది. బీమా కంపెనీల ప్రొడక్టులపై నమ్మకం కుదరాలని, బీమా కంపెనీలు పత్రికల్లో ఇచ్చే తమ ప్రొడక్టుల ప్రకటనల్లో స్పష్టం కరువైందన్నారు. ప్రజల్లో గందరగోళం నెలకొందని తెలియజేసింది. తమ ప్రకటనలో వాడే బాష సరళంగా సామాన్యుడికి తేలికగా అర్ధమయ్యేలా ఉండాలని కోరింది. ఏ వ్యక్తి అయినా.. బీమా ప్రొడక్టు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిస్తే మాత్రం ఐఆర్‌డీఏ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

# గర్జించిన భారత్

(మొదటిపేజీ తరువాయి)



ధ్వంసమయ్యాయి. సుమారు 20 మంది తీవ్రవాదులు హతమైనట్టు అధికారికంగా ప్రకటించినా, సుమారు 35 మంది ఉగ్రవాదులు హతమైనట్టు ఆర్మీ భావిస్తోంది. పాక్ మాత్రం ఎప్పటివమాదిరిగానే వక్రబుద్ధిని ప్రదర్శించింది. భారత బలగాలే కాల్పుల ఉల్లంఘన చర్యలకు పాల్పడ్డాయని ఎదురు దాడికి దిగింది. పైగా, తమ బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో 9 మంది భారత సైనికులు హతమయ్యారని, రెండు బంకర్లను ధ్వంసం చేశామని ప్రకటించుకుంది. కాగా, భారత భూభాగంలోకి ఉగ్రవాదులను పాకిస్తాన్ ప్రేరేపిస్తున్నందుకు ప్రతీకారంగానే పీఓకేలో ఉగ్రశిబిరాలే లక్ష్యంగా తమ సైన్యం దాడులు చేపట్టిందని భారతసైనిక ప్రతినిధి వెల్లడించారు. పాక్ బలగాల కాల్పుల్లో ముగ్గురు పౌరులు సైతం గాయపడ్డారని, రెండు ఇళ్లు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. ఎల్‌వోసీకి ఆవలివైప ు సుమారు 200 మంది ఉగ్రవాదులు వివిధ శిబిరాల్లో ఉన్నట్లు ఆర్మీ వద్ద కచ్చితమైన సమాచారం ఉందని రక్షణరంగ నిపుణుడు డీఎస్ ధిల్లాన్ పేర్కొన్నారు. సరిహద్దుకు 15 కిలోమీటర్ల పరిధిలోని ఉగ్రశిబిరాలను నేలమట్టం చేయడమే లక్ష్యంగా మన బలగాలు ఆర్టిలరీ గన్స్‌ను ఎక్కుపెట్టాయని చెప్పారు. నిర్దిష్ట లక్ష్యాలను ఛేదించడంతో ఉగ్రమూకలకు భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. పాక్ సైనికుల అండదండలతో తీవ్రవాదులు దాగివున్నప్పటికీ, వారి అనుపానువులు మన సైనికులకు, నిఘా వర్గాలకు తెలుసునని, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలతో వారి శిబిరాలను సమూలంగా ధ్వంసం చేయగల శక్తిసామర్థ్యాలు మనకున్నా యని విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ పీఎన్ హూన్ తెలిపారు. 2018లో 1629 సార్లు కాల్పుల ఉల్లంఘన చర్యలకు పాల్పడిన పాక్ బలగాలు, 2019లో అక్టోబర్ 1 నాటికి 2300 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది.

### పరిస్థితిపై రాజ్‌నాథ్ ఆరా..

కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లుపొడుస్తూ ఎల్ఓ సీ వెంబడి పాక్ బలగాలు ఆదివారంనాడు విరుచుకు పడిన నేపథ్యంలో తలెత్తిన ఉద్రిక్తతలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అప్రమత్తమయ్యారు. స్వయంగా ఆయన పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్‌క ు ఫోను చేసి సరిహద్దుల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటి కప్పుడు తనకు సమాచారం ఇవ్వాలని బిపిన్ రావత్‌క ు సూచించారు.

### 9 మందిని చంపేశాం: పాక్ ప్రకటన

కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ ఉల్లంఘిస్తూ జూర, షాహ్‌కోట్, నౌషెహ్రా సెక్టార్లలో కాల్పు లకు తెగబడిం దని, ఇందుకు ప్రతిగా తాము జరిపిన దాడుల్లో 9 మంది భారత సైనికులు హత య్యారని, పలువురు గాయపడ్డారని పాకిస్థాన్ ప్రకటించింది. భారత బలగాల దాడుల్లో ఒక పాక్ సైనికుడు, ముగ్గురు పౌరులు సైతం మృతి చెందినట్టు తెలి పింది. తమ సైన్యం జరిపిన ప్రతి దాడుల్లో రెండు భారత బంకర్లు ధ్వంసమైనట్టు కూడా ప్రకటించు కుంది.

### ఢిల్లీలో హైఅలర్ట్

దేశ రాజధాని నగరం ఢిల్లీలో విధ్వంసానికి జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ కుట్రపన్నిందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. 400 ప్రముఖ భవనాలు, ప్రధానమార్కెట్లు లక్ష్యంగా జైషే ప్రణాళికలు రచించినట్లు తెలిసింది. దీంతో ఢిల్లీ నగరంలో హైఅలర్ట్ ప్రకటించారు. రోహిణి, ఈశాన్య, ఆగ్నేయ, నైరుతి, వాయువ్య, మధ్య ఢిల్లీతోపాటు ద్వారక, ఢిల్లీ పరిధిలోని మరో 15 జిల్లాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ ప్రాంతాల్లో 425 భవనాలను సున్నితమైనవిగా పోలీసులు గుర్తించారు. ఇలాంటి భవనాలు ఒక్క ఢిల్లీలోనే 200 ఉన్నాయి. వీటన్నిటివద్ద రోజువారి భద్రతకంటే అదనపు బలగాలను మోహరింపజేశారు. ప్రధాని కార్యాలయం, సేనాభవన్, పార్లమెంట్, రాష్ట్రపతి భవన్‌వంటివి అన్నివేళలా కీలక భవనాలుగా పరిగణిస్తుంటారు. తాజాగా, కన్నాట్ ప్లేస్, ఖాన్ మార్కెట్‌ను కూడా అప్రమత్తత జాబితాలో చేర్చారు. జామా మసీద్, పోలీస్ ప్రధాన కార్యాలయం, రౌస్ అవెన్యూ కోర్టు, లక్ష్మీనగర్, ప్రీత్‌విహార్, ఆనంద్ విహార్ వంటి భవనాలను ఉగ్రవాదులు లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. అయితే, దివాళి నేపథ్యంలోనే భద్రతను కట్టుదిట్టం చేస్తున్నామని, నిఘా వర్గాల నుంచి ఎలాంటి హెచ్చరికలు రాలేదని ఢిల్లీ పోలీస్ డిప్యూటీ కమిషనర్ ఈశ్ సింఘాల్ తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్‌వద్ద సెంట్రీ విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కేవలం ప్రభుత్వ వాహనాలను మాత్రమే లోపలికి అనుమతించేలా ప్రధాన గేట్ వద్ద ఏర్పాట్లుండాలని గతవారం ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. 24 గంటలు నిరంతర నిఘా సారించి, జాగురూకతతో ఉండాలని అన్ని పోలీస్ స్టేషన్లకు వర్తమానం చేరవేశారు.

### భారత దౌత్యాధికారికి పాక్ సమన్లు

పీవోకేలోని ఉగ్రశిబిరాలపై భారత సైనిక దాడులకు పాక్ తీవ్రంగాస్పందించింది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఈ నేపథ్యంలో ఇస్లామాబాద్‌లోని భారత డిప్యూటీ హైకమిషనర్ గౌరవ అహ్లూవాలియాకు పాక విదేశాంగశాఖ సమన్లు జారీచేసింది. సరిహద్దుకు ఆవల తీవ్రవాదులను ప్రోత్సహిస్తూ వస్తున్న పొరుగుదేశం, ఆదివారం మరోమారు కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడింది. తంగ్ధార్ సెక్టార్ నుంచి మిలిటెంట్లను భారత భూభాగంలోకి పంపేందుకు కుట్రపన్నింది. అయితే ఈ కుట్రలను మన బలగాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి. పాక్ కవ్వింపు చర్యలకు దీటుగా ఎదురు కాల్పులు జరిపింది.

## పంచాయతీ కార్మికులకు ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేత నాలను ప్రభుత్వమే చెల్లించాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి కోరారు. సీఎం కేసీఆర్ పంచాయతీ కార్మికుల వేతనలు రూ.8500కు పెంచటం హర్షణీయం అన్నారు. గ్రామ పంచాయ తీలకు కార్మికుల జీతాలు చెల్లించేంత ఆర్థిక స్థితి లేదన్నారు. పెంచిన కార్మికుల జీతాలను నవంబర్ నుంచి ప్రభుత్వమే చెల్లించాలన్నారు. వచ్చే ఏడాది నుంచి ఇందుకోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాని సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఇక్కడున్న అవినీతి ఎక్కడా లేదు



**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** తెలంగాణలో జరుగుతున్న అవినీతి దేశంలో ఎక్కడా జరగడం లేదని మాజీమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నాగం జనార్దన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగు తున్న అవినీతిపై అప్పట్లో గవర్నర్ నరసింహన్‌కు లేఖ రాసినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో నాగం జనార్దన్ రెడ్డి మాట్లాడారు.. 24 వందల కోట్ల రూపా యలతో ఒకే టెండర్ ద్వారా బీటీ రోడ్ల కాంట్రాక్టు ఒక్క సంస్థకు కట్టబెట్టేలా ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని, సబ్‌కాం ట్రాక్టుల పేరిట విపరీతమైన దోపిడీ జరుగుతోందని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా అప్పగిస్తే అప్పులపాలు చేశారని, సెల్ఫ్ డిస్మిస్ పేరుతో 50 వేలమంది ఆర్టీసీ కార్మికులను రోడ్డున పడేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సెక్రటేరియేట్, అసెంబ్లీ భవనాలు పునర్ నిర్మాణం, మిషన్ భగీరథలో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఆరోపించారు. అనుభవ రాహిత్యం, అహంభావంతో కేసీఆర్ పాలన ఉందని, ప్రజలను బిచ్చగాళ్ళ మాదిరిగా తయారు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

## గొడవపడద్దొన్నాడని చంపేశాడు!

- నర్సంపేటలో యువ కానిస్టేబుల్ హత్య
- కాశ్మీర్‌లో విధులు.. సెలవులపై వచ్చి మృత్యువాత



ప్రేమ్‌కుమార్ (ఫైల్)





నిందితుడు దిలీప్

**నర్సంపేట, ప్రభన్యూస్:** మద్యం మత్తులోస్నేహితులు ఘర్షణకు దిగడంతో సర్దిచెప్పబోయిన ఓ యువ కానిస్టేబుల్‌ను ఆ బృందంలోని ఓ యువకుడు కత్తితో పొడిచి హత్య చేసిన సంఘటన వరంగల్ జిల్లాలో చోటుచేసుకుంది. మృతుడిని నర్సంపేటకు చెందిన హన్మకొండ ప్రేమ్‌కుమార్‌గా గుర్తించారు. జమ్మూ కాశ్మీర్ లోని శ్రీనగర్‌లో ఎస్ఎస్‌బీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రేమ్‌కుమార్ మూడు రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. సెలవులు గడిపేందుకు వచ్చిన అతడు స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లినపుడు జరిగిన ఘర్షణ హత్యకు దారి తీసింది. ఈ దుర్ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ రూరల్ జిల్లా, నర్సంపేట పట్టణానికి చెందిన ప్రేమ్‌కుమార్ శ్రీనగర్‌నుంచి మూడు రోజుల క్రితం వచ్చాడు. శనివారం రాత్రి తన మిత్రులతో కలిసి సెకండ్ షో సినిమాకు వెళ్లాడు. మరో మిత్రుడు బత్తుల రాకేష్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నామని, అక్కడకు రావాలని చిలువేరు రాకేష్ అనే స్నేహితుడు ఫోన్‌లో కోరాడు. వెంటనే పార్టీ జరు గుతున్న వల్లబ్‌నగర్‌లోని డిగ్రీ కళాశాలవద్దకు వెళ్లాడు. అతడితోపాటు ఉదయ్ అనే మరో స్నేహితుడు కూడా వెంట వచ్చాడు. అప్పటికే అక్కడ బత్తుల రాకేష్ మిత్రులు మద్యం సేవించి ఉన్నారు. ఆ తరువాత వారి మధ్య వివాదం మొదలై ఘర్షణకు దారితీసింది. వారిలో రెచ్చిపోతున్న దూదిమెట్ల దిలీప్ యాదవ్‌ను గొడవపడొద్దంటూ, అడ్డుకునేందుకు సర్దిచెప్పబోయాడు. దీంతో ఆగ్రహానికి లోనైన దిలీప్ ఇంటిలోకి వెళ్లి కత్తి తెచ్చి ప్రేమ్‌కుమార్ ఛాతి కింది భాగాన పొడవడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి మిత్రులు హుటా హుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీ ఎంకు సిఫార్సు చేశారు. అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కవల పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు.

## యూఎస్‌లో సిక్కు స్మారకచిహ్నం తొలగింపు

**యూఎస్:** భారతదేశంలో 1984లో జరిగిన అల్లర్లలో మృతిచెందినవారి స్మారకార్థం యూఎస్‌లోని ఓటీస్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన చిహ్నాన్ని స్థానిక అధికారులు తొలగించారు. భారత్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మూడు నెలలు అనంతరం దీన్ని తొలగించారు. ఖలీస్థాన్ నేత జర్నైల్ సింగ్ భింద్రావాలే ఫొటో కలిగి ఉన్న ఈ స్మారక చిహ్నంలో భారత ప్రభుత్వం వల్లే మారణహోమం జరిగిందని ఆరోపించారు. దీనిపై భారత్ నిరసన వ్యక్తం చేయడంతో ఓటీస్ లైబ్రరీ మరియు నార్విచ్ మాన్యుమెంట్స్ కమిటీ సంయుక్తంగా ఫలకం, జెండా, చిత్తరువును తొలగించేందుకు అంగీకరించాయని లైబ్రరీ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ అధ్యక్షుడు నికోలస్ ఫోర్ట్సన్ నార్విచ్ తెలిపారు. రెండు వారాల క్రితమే తొలగించామని, జూన్‌లో స్మారక చిహ్నాన్ని ఆవిష్కరించిన తరువాత లైబ్రరీకి విమర్శలతోపాటు మద్దతు కూడా లభించిందని ఫోర్ట్సన్ తెలిపారు.

## మాంసాహార పశువులు

**పనాజీ:** గోవాలోని కలాంగూట్, కాండోలిమ్ తదితర ప్రసిద్ధ బీచ్ పరిసర గ్రామాల్లో తిరిగే పశువులు మాంసాహారులుగా మారాయని గోవా మంత్రి మైఖేల్ లోబో తెలిపారు. చికెన్, వేయించిన చేపముక్కలను మాత్రమే తింటున్నాయని లోబో అన్నారు. కలాంగూట్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే అయిన లోబో ఈ సందర్భంగా మాట్లాడుతూ కలంగూట్ గ్రామానికి చెందిన 76పశువులు శాఖాహారం తినడానికి నిరాకరిస్తున్నా యన్నారు. వీటిని గోశాలకు తరలించి ప్రత్యేక పశువైద్యుల పర్యవేక్షణలో ఉంచామని తెలిపారు. మేయామ్ లోని గోమంతక్ గోసేవక్ మహాసంఘ్ నడుపుతున్న గోశాలకు పశువులను తరలించి వైద్యాన్ని అందిస్తున్నామన్నారు. పశువులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్యులు గోశాలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు.

## నేడు ఢిల్లీకి ఏపీ సీఎం జగన్

**అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ చేరుకోనున్న ఏపీ సీఎం జగన్ మంగళవారం సాయంత్రం వరకు రెండు రోజుల పాటు హస్తినలోనే ఉండబోతున్నారు. ప్రధానంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాతో సహా పలువురు కేంద్ర మంత్రులతో ఈ సందర్భంగా జగన్ భేటీ కానున్నారు. రాష్ట్రానికి సంబంధించి వివిధ అంశాలపై వారితో చర్చించడంతో పాటు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కేంద్ర సహకారం తదితర అంశాలపై ఆయన వారితో చర్చించనున్నారు. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రితో భేటీ అయి రాష్ట్ర విభజన అంశాలతో పాటు 9, 10 షెడ్యూల్‌లోని అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరించి ఆ దిశగా లోటుబడ్జెట్‌ను భర్తీ చేయాలని కోరనున్నారు. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా పూర్తిగా వెనుకబడిపోయింది. ఈ నేపథ్యంలోనే లోటుబడ్జెట్‌తో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఏపీకి కేంద్రం తమవంతు చేయూతగా ప్రత్యేక నిధులను మంజూరు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే రూ. 1.25 లక్షల కోట్లకు గాను ఇప్పటివరకు దశలవారీగా రూ. 45 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందించింది. మిగిలిన సుమారు రూ. 80 వేల కోట్ల నిధులను తక్షణమే విడుదల చేసి ఏపీకి చేయూతనందించాలని తన రెండు రోజుల పర్యటనలో భాగంగా జగన్.. హోం మంత్రిని కోరనున్నారు. అలాగే ఇటీవలే రాష్ట్రంలో ప్రారంభించిన రైతు భరోసా పథకానికి సంబంధించి రూ. 13,500లలో కేంద్రం వాటా క్రింద ఒక్కో రైతుకు రూ. 6 వేలను అందించాల్సి ఉంది.

# మావోలపై డేగకన్ను

### ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఎన్నికల వేళ మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునే అవకాశం ఉంది. నేడు మహారాష్ట్ర పోరుతో పాటు ఇటు హుజూర్‌నగర్ శాసనసభాస్థానంఉప ఎన్నిక జరగ నున్న తరుణంలో పోలీసులు అప్రమత్త మయ్యారు. మావోయిస్టుల కార్యకలా పాలపై నిఘాను తీవ్రతరం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతా లతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రసరిహద్దుల వద్ద పోలీసు కూంబింగ్‌ని పటిష్టం చేశారు. మరోవైపు మావోయిస్టు అగ్రనేతలకు సమాచారం అందించే దెవరు? మావోలకు కొరియర్లుగా వ్యవహరించే వారెవరు? అన్నదానిపై పోలీసులు దృష్టిసారిం చారు. మావోలు సైతం చాపకింద నీరులా తమ బలాన్ని పెంచుకునే దిశగా ప్రయ త్నాలను ప్రారంభించారని ఇటీవల కొన్ని ఘటనల ద్వారా పోలీసులకు ఉప్పంది నట్లు సమా చారం. దీంతో పోలీసులు రాష్ట్రంలోని మావో ప్రభావిత ప్రాంతాలను పూర్తిగా జల్లెడ పడుతున్నారు. మావోయిస్టు పార్టీ రిక్రూట్‌మెంట్లను చేస్తోందన్న ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తమైంది. అదును చూసి ఎన్నికల వేళ మావోయిస్టులు విజృంభించే అవ కాశాన్ని కొట్టి పారేయలేమని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకు గానూ మావోయిస్టులు యాక్షన్ టీంలను రంగంలోకి దింపే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో యాక్షన్ టీంలు రంగ ప్రవేశం చేసినప్పుడు విశ్వసనీయ సమా చారంతో పోలీసులు యాక్షన్ టీంల గుట్టురట్టు చేసిన సంగతి తెలిసిందే. అటు ఏవోబీలో క ూడా భద్రతతో పాటు కూంబింగ్ చర్యలను తీవ్రతరం చేశారు. మావో ియిస్టు అగ్రనేతలకు ఎప్పుడు గాలమేసినా వారు తృటిలో తప్పించుకుంటున్నప్పటికీ కేడర్‌ను మాత్రం పోలీసులు మట్టుబెట్ట గలుగుతున్నారు. మావోయిస్టుల కమిట్‌మెంట్ మాత్రం నిఖా ర్సుగా ఉంటుందనేది పలువురి వాదనగా ఎప్పట్నించో వినవస్తోంది.

### మావోయిస్టులకు భారీ షాక్..

హుజూర్‌నగర్ ఉప ఎన్నిక నిర్వహణ సందర్భంలో పోలీసులకు కీలక కొరి యర్లు ఇద్దరు పట్టుబడ్డారు. వారు మావోయిస్టు పార్టీకి సంబంధిం చిన అగ్రనేతలకు సమావేశాల సారాంశాన్ని చేర వేస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం పోలీసులకు వీరు పట్టు బడగా, వీరినుంచి కీలక లేఖలు, సిమ్ కార్డులను సైతం పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. మావోయిస్టు అగ్రనేతల మధ్య సమావేశాల ఏర్పాట్లు, ఫోన్ సంభాషణలకు ఈ ఇద్దరు మధ్యవర్తిత్వం నెరపుతున్నట్లు సైతం భద్రా ద్రి కొత్తగూడెం పోలీ సులు భావిస్తున్నారు. ప్రధానంగా మావోల రిక్రూట్‌మెంట్ జరుగుతోందన్న వాదన బలపడుతున్న తరుణంలో ఏ విధంగా ఈ రిక్రూట్‌మెంట్ తంతు కొనసాగుతుంది? తదితర అంశాలను సైతం పోలీసులు వీరి నుంచి రాబట్టే అవకాశం ఉంది. తాజా పరిణామం దరిమిలా రాష్ట్రంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర,ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పోలీసు బలగాల సంఖ్య రెట్టింపు అయ్యింది. మావో ప్రభావిత ప్రాంతాల్లోని గిరిజన పల్లెల్లో పోలీసు బూటు చప్పుళ్లతో గిరిజన పల్లెవాసులు హడలి పోతున్నారు.

## విద్యాశాఖకు చేరిన ఎస్‌జీటీ సెలెక్టెడ్ లిస్ట్

- నేడో, రేపో కౌన్సెలింగ్ షెడ్యూల్

**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** ఉపాధ్యాయ నియామకపరీక్షల్లో ఎంపికైన తెలుగు మీడియం సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) లిస్టు విద్య శాఖకు చేరింది. తెలుగు మీడియం ఎస్‌జీటీ పోస్టుల్లో 3325 మందిని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఇందుకు సంబం ధించిన సెలెక్టెడ్ లిస్టును తాము విద్య శాఖకు పంపించామని టీఎస్‌పీ ఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి శనివారం రాత్రి 7 గంటలకు ట్విట్టర్‌లో పేర్కొ న్నారు. ఈ నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీ పంపిన లిస్టు విద్య శాఖకు చేరిన నేపథ్యంలో ఎంపికైన అభ్యర్థులకు ఇంట ర్వ్యూలను నిర్వహించడం కోసం నేడుగానీ లేదా రేపు గానీ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను పాఠశాల విద్య శాఖ విడుదల చేయనుంది. మొత్తం కౌన్సెలింగ్ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయ నున్నారు. జిల్లాల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించి వారికి పోస్టింగ్ లు ఇవ్వనున్నారు. అయితే 3325 మంది ఎస్‌జీటీలు కొత్తగా చేరితే వారి స్థానంలో ఇప్పటికే అక్కడ పనిచేస్తున్న విద్యా వాలంటీర్లను తొలగించే అవకాశం ఉంది.

# మళ్లీ మోగనున్న బడిగంటలు!

- 23 రోజుల సెలవుల అనంతరం తెరచుకోనున్న పాఠశాలలు
- సెలవుల నేపథ్యంలో ఎస్ఏ-1 రెండుసార్లు వాయిదా
- 25 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు
- 15రోజుల పాటు విద్యాక్యాలెండర్‌కు ఆటంకం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో దసరా సెలవుల అనంతరం నేటి (సోమవారం) నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పాఠశాల లతోపాటు జూనియర్, డిగ్రీ, యూనివర్సిటీలు కూడా పనిచేస్తాయి. గత నెల 28 నుంచి రాష్ట్రంలోని పాఠశాలలకు దసరా సెలవులను ప్రకటిం చారు. తిరిగి 14 నుంచి పాఠశాలలను ప్రారం భించాలని నిర్ణయించి నప్పటికీ రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో సెలవులను మరో వారం రోజుల పాటు కొన సాగిస్తూ రాష్ట్ర ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. 14 నుంచి 20 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా సెలవులను ప్రకటించారు. అయితే పాఠశాలలకు సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 20 వరకు దసరా సెలవులు కొనసాగాయి. దీంతో దసరాకు ఏకంగా 23 రోజుల పాటు సెలవులు ఇచ్చినట్టు అయింది. జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలకు అక్టోబర్ 4 నుంచి 9 వరకు సెలవులు ప్రకటించారు. దసరా సెలవుల అనంతరం 10 నుంచి రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ కాలేజీలు పునః ప్రారంభం



అయ్యాయి. అయితే ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో చాలా తక్కువ మంది మాత్రమే కాలేజీల కు హాజరయ్యారు. 12 రెండో శనివారం, 13 ఆదివారం కావడంతో తిరిగి కాలే జీలకు సెలవులు ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో 14 నుంచి 20 వరకు రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు సెలవు లను ప్రకటిస్తూ ప్రభుత్వం అధికారి కంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 14 నుంచి ప్రారంభం కావల్సిన స్కూల్స్‌కు మరో వారం పాటు సెలవులు కొనసాగాయి. దీంతో ఈ ఏడాది పాఠశాలలకు దసరా సెలవులు ఏకంగా 23 రోజులు వచ్చాయి.

### ఎస్ఏ-1 పరీక్షలు 25కు వాయిదా..

2019-20 విద్యా సంవత్సరం క్యాలెండర్ ప్రకారం పాఠశాలల్లో అక్టోబర్ 21 నుంచి సమ్మెటీవ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ)-1 పరీక్షలు ప్రారంభం కావాలి. కానీ 20 వరకు పాఠశాలలకు దసరా సెలవులు కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాలలు పునః ప్రారంభం రోజు నుంచే ఎస్ఏ-1 పరీక్షలు కొనసాగించ కుండా 23 నుంచి ప్రారంభించాలని పాఠశాల విద్య శాఖ నిర్ణయించింది. కానీ ఏమైందో తెలియదు ఎస్ఏ-1 పరీక్షలను 23 నుంచి కాకుండా 25 నుంచి ప్రారంభించాలని నిర్ణయించినట్టు శనివారం పాఠశాల విద్య కమిషనర్ విజయ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. వా స్తవంగా విద్యార్థు లకు అక్టోబర్ 14 నుంచి దసరా సెలవుల అనంతరం క్లాసులను ప్రారంభించి వారంలో సబ్జెక్టులో 2 పాఠాలను పూర్తి చేసిన మరో రోజు ఎస్ఏ-1 పరీక్షల కోసం విద్యార్థులకు రివిజన్ చేసు కునే అవకాశం ఉండేది. ఎస్ఏ-1 పరీక్షలు 21 నుంచి 26 వరకు పూర్తి చేసి తరువాత 2 రోజులపాటు దీపావళి సెలవులు ఇచ్చి తిరిగి క్లాసులను ప్రారంభించేలా విద్యా క్యాలెండర్‌లో నిర్ణయించారు. కానీ ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ఎస్ఏ-1 పరీక్షలు కాస్త అక్టోబర్ 25 నుంచి నవంబర్ 2వరకు కొనసాగ నున్నాయి. దీంతో సుమారు 15 రోజులపాటు పాఠశా లలకు అకడమిక్ క్యాలెండర్ ఆటంకం కలగనుంది. ఇప్పుడు ఆటంకం కలిగిన అకడమిక్ క్యాలెండర్‌ను వచ్చే ఏడాది(2020) వరకు ఉన్న రెండో శనివారాలను పనిదినాలుగా కొనసాగించాలని, దీంతో పాటు ఇతర సెలవులను రద్దు చేసి వాటిని కూడా పనిదినాలుగా కొనసాగించాలని రాష్ట్ర ప్ర భుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

# వివాదంలో కాకతీయ ఈసీ

- అనర్హులను చేర్చారంటూ ఆరోపణలు
- ఉన్నత విద్యామండలి ప్రతిపాదనలు పక్కనపెట్టిన సర్కార్

**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** కాకతీయ విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(ఈసీ) నియామకం వివాదాస్పదంగా మారిం ది. నిబంధనలకు విరుద్ధంగా ఈసీని నియమించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈసీ సభ్యుల ఎంపికలో సామా జిక న్యాయం కొరవడిందని యూనివర్సిటీ అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. ఈసీ కూర్పులో సామాజిక వర్గాలకు న్యా యం చేస్తూ ఉన్నత విద్యా మం డలి తయారు చేసిన ప్రతి పాద నలను కాదని ఇతర సభ్యులతో సర్కార్ ఈసీని ప్రకటిం చింది. దీంతో కాకతీయ ఈసీ కాస్త వివాదాస్పదంగా మారింది. యూనివర్సిటీకి 2010 నుంచి ఈసీ లేకుండానే కొన సాగు తోంది. వర్సిటీకి ఈసీ లేరని నియమించడం లేదని కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఈ నెల 12న హడావుడిగా ఈసీని ఏర్పాటు చేశారు. అయితే ఈసీ నియా మకంలో వర్సిటీ యాక్ట్‌లోని నిబంధ నలను పాటించకపోవ డంతో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

### క్లాస్-2 కేటగిరి ఇలా..

క్లాస్-2 కేటగిరిలోని వర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్ కేటగిరిలో ఇంగ్లీష్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎం రాజేశ్వర్‌ను యూనివర్సిటీ కాలేజ్ ప్రిన్సిపాల్ కేటగిరిలో ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని అనుబంధ కాలేజ్ ప్రిన్సిపాల్ కేటగిరిలో నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళిని యూనివర్సిటీ టీచర్స్ నుంచి డాక్టర్ టి సుమతి ఉమా మహేశ్వరిని అనుబంధ కాలేజ్ లెక్చరర్ కేటగిరిలో డాక్టర్ ఆర్



సీతారామారావును నియమించారు. విద్యావేత్తలు, నిపుణులు, సామాజికవేత్తల స్థానంలో ఎస్ సుందర్‌రాజ్( మాస్టర్ జీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూ ట్స్ సెక్రటరీ) వి రాజిరెడ్డి(డీపీఎస్ ఎడ్యుకేషన్ సోసైటీ)డాక్టర్ ఎం నాగేంద్ర బాబు(ఎంఎస్ ఆర్థో)డాక్టర్ గుండాల మదన్ కుమార్(ఎండీ ఈహెచ్)లను నియమిస్తూ ఈ నెల 12న ప్రభుత్వం జీవో నంబర్ 201ని విడుదల చేసింది. ఈసీ కూర్పు లో సామాజిక న్యాయం కొరవడిందని విమర్శలు రావడంతో తాను ఈసీ నుంచి తప్పుకుంటున్నట్టు సుందర్ రాజు తెలిపారు. దీంతో ఆయన స్థానంలో కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగానికి చెందిన డాక్టర్ తాళ్లపల్లి మనోహర్‌ను నియమిస్తూ ప్రభుత్వం 16వ తేదిన మరో జీవో నంబర్ 207ను జారీ చేసింది.

### వివాదాలు ఇవీ...

యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా కొనసాగు తున్న ప్రొఫెసర్ మల్లారెడ్డిని ఈసీగా తీసుకోవడం వివాదస్పదంగా మారింది. ఆయన కేవలం తాత్కాలిక పద్ధతిలో ప్రిన్సిపాల్‌గా బాధ్య తలు కొనసాగిస్తున్నారు. ఏఐసీటీఈ నిబం ధనల ప్రకారం ఎంఈ/ ఎంటెక్ తోపాటు పీహెచ్‌డీ ఉన్న వారు మాత్రమే ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ పోస్టుకు అర్హులు. కానీ మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఆయనను వర్సిటీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీ రింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. అటువంటి వ్యక్తిని యూని వర్సిటీకి చెందిన పాలన పరమైన కీలకమైన పదవిలో ఎలా ఎంపిక చేస్తారనే విమ ర్శలు వెల్లువెతు తున్నాయి. విచారణ ఎదుర్కొం టున్న అసోసి యేట్ ప్రొఫెసర్‌కు సైతం ఈసీలో స్థానంలో కల్పించారు. 8 సంవత్సరాల అనుభవం ఉన్న అసిస్టెం ట్ ప్రొఫెసర్లకు మాత్రమే అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి వస్తుంది. కానీ మ్యాథ్స్ డిపార్ట్ మెంట్‌కు చెందిన డాక్టర్ సుమతిఉమా మహేశ్వరీ మాత్రం 6 సంవత్స రాలకే ప్రమోషన్ పొందారు. పదోన్నతి పొందేందుకు ఆమె సమర్పిం చిన ఆర్టికిల్స్‌కు ఎక్స్‌పర్ట్ కమిటీ నిర్ణీత పారామీటర్స్ కంటే ఎక్కువ మార్కులు వేశారు. ఈ వివాదంపై అప ్పట్లోనే ఉస్మానియా వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిఖీ నేతృత్వంలో కమిటీ విచారణ జరిపి .. నిజమేనని తేల్చింది. ఇందుకు సంబంధించిన నివేదికను మే 24, 2014న సమర్పించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆమెపై వర్సిటీ అధికారులు ఎటువంటి చర్య తీసుకోలేదు. అంతేకాకుండా మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఇద్దరిని ఈసీలోకి ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు.

### ప్రైవేటు విద్యా సంస్థల నుంచి లేని ప్రాతినిధ్యం

ప్రైవేటు డిగ్రీ, పీజీ విద్యా సంస్థల నుంచి ఒకరికి ఈసీలో స్థానం కల్పిస్తారు. ఈసారి కూడా సుందర్‌రాజ్‌కు అవకాశం కల్పించారు. తాను ఈసీలో ఉండటానికి విముఖత వ్యక్తం చేయడంతో ఆయన స్థానంలో మనోహర్‌కు అవకాశం కల్పించారు. ఎక్కువ సంఖ్యలో ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నప్పటికీ వారికి ఈసీలో స్థానం లేకపోతే వారి సమస్యలను ఎవరు ప్రస్తావిస్తారనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

# వీసీల నియామక ప్రక్రియ వేగవంతం

- రూసా నిధులు పూర్తిస్థాయిలో వినియోగానికి చర్యలు
- వీసీలు లేక ఆగిన అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ
- రూసా 2.0లో రూ.254 కోట్లు కేటాయింపు

**హై దరాబాద్, ఆంధ్రప్రభ:** విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామక ప్రక్రియ వేగవంతంగా కొన సాగుతోంది. ఇప్పటికే సెర్చ్ కమిటీలను నియ మించిన రాష్ట్ర ప్రభుత్వం.. ఆ కమిటీల సమావేశాల కోసం ప్రయ త్నాలు ప్రారంభించింది. ఆ సమావేశం అనంతరం ఒక్కో యూనివర్సిటీకి ముగ్గురు సభ్యుల తో కూడిన ఫ్యానల్‌ను సిద్ధం చేయనుంది. ప్రభుత్వం ఆయా ప్రతి పాదనలను గవర్నర్‌కు సమర్పిస్తుంది. యూనివర్సి టీలకు ఛాన్స్‌లర్ అయిన గవర్నర్ ముగ్గు రిలో ఒకరిని ఆయా వర్సిటీలకు ఉపకులపతిగా నియమిస్తారు.

### సెర్చ్ కమిటీల భేటీకి సన్నాహాలు

సెర్చ్ కమిటీల సమావేశం కోసం ప్రభుత్వం ఇప్ప టికే కసరత్తు ప్రారంభించింది. సెర్చ్ కమిటీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ప్రతినిధి సమయం కోసం ప్రభుత్వం సంప్రదింపులు ప్రారం భిం చినట్టు సమాచారం. ఆ సమావేశాలు జరిగితే, ఆయా కమిటీల పేర్లను ప్రభుత్వానికి సిఫారసు చేస్తారు. వీసీ పదవి కోసం యూనివర్సిటీల వారీగా వచ్చిన దరఖా స్తులను విద్యాశాఖ స్రూటినీ కార్య క్రమాన్ని ప్రారంభించినట్టు తెలిసింది.

### త్వరలో అధ్యాపక పోస్టుల భర్తీ

వీసీల నియామకం జరగగానే యూనివర్సిటీల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయనున్నారు. అక్టోబర్ 3న వీసీలతో జరిగిన సమావేశంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ త్వరలోనే రెగ్యులర్ వీసీల నియా మకం పూర్తి అవుతుందని, వారు రాగానే ఖాళీ అధ్యా పకుల పోస్టులను భర్తీ చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. నవంబర్ నెలలో వీసీల నియామకం పూర్తి అయ్యే అవకాశం ఉన్నందున డిసెంబర్‌లో యూని వర్సిటీల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫి కేషన్‌ను జారీ చేసి నియామకాల ప్రక్రియను 2019-20 విద్యా సంవత్సరంలోనే పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది.

### పూర్తిస్థాయిలో 'రూసా'

రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్(రూసా) 2.0ను కొత్త కంపోనెంట్లతో తీసుకురావాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ నిర్ణయిం చింది. ప్లానింగ్ అప్రూవల్ బోర్డు(పీఏబీ) 12, 13వ మీటింగ్‌ల అనంతరం రూసా 2.0ను రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధి, మౌలిక వసతుల కోసం నిధులను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రూసా 2.0 లో రాష్ట్రా నికి రూ. 254 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఆయా నిధులు విశ్వవిద్యా లయాల్లో మౌలిక వసతుల కల్పన, వర్సిటీల నాణ్యత మరియు శ్రేష్టత, పరిశోధన మరియు ఆవిష్కరణ లతోపాటు న్యూ మోడల్ డిగ్రీ కళాశాలలు, మోడల్ డిగ్రీ కళాశాలల ఉన్నతీకరణ, కళాశాలల మౌలిక వసతులకు గ్రాంట్లు ఇవ్వడం కోసం రూసా 2.0ను ఏర్పాటు చేశారు. దీనిని 2018-19 విద్యా సంవత్సరం నుంచి 2019-20 విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రూసా 2.0 నిధులను పూర్తిగా వినియోగిం చుకోవడం కోసం రాష్ట్ర ప్రభు త్వం యూనివర్సిటీల్లో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## మోడీ టర్కీ పర్యటన రద్దు

**న్యూఢిల్లీ:** ప్రధాని మోడీ తన రెండు రోజుల టర్కీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఐకరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో టర్కీ అధ్యక్షుడు తుయ్యిప్ ఎర్డోగన్ కాశ్మీర్ విషయంలో భారత్‌కు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఆర్టికల్ 370 రద్దును విమర్శిస్తూ ఎర్డోగన్ వ్యాఖ్యలు చేయడాన్ని భారత్ తీవ్రంగా పరిగణించింది. పారిస్‌లో జరిగిన ఎఫ్ఏటీఎఫ్ సమావేశంలో కూడా ఎర్డోగన్ పాక్‌కు మద్దతుగా గళం వినిపించారు. అక్టోబర్ చివర్లో సౌదీ అరేబియాలో జరగనున్న పెట్టుబడుల సదస్సుల్లో పాల్గొనన్ను మోడీ అక్కడి నుంచి టర్కీ రాజధాని అంకారా వెళ్లాల్సి ఉంది. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో అంకార పర్యటన రద్దయింది. 2015లో మోడీ జీ20 సమావేశాల్లో పాల్గొనేందుకు టర్కీకి వెళ్లారు. ఈ ఏడాది ఒసాకాలో జరిగిన సమావేశాల్లో భాగంగా, అక్కడ ఎర్డోగన్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మోడీని తమదేశంలో పర్యటించాల్సిందిగా కోరారు. ఇందుకు మన ప్రధాని సానుకూలత వ్యక్తంచేశారు. అంతకు ముందు 2018 జులైలో ఎర్డోగన్ రెండు రోజుల పాటు భారత్‌లో పర్యటించారు. ఎర్డోగన్ యూఎన్‌జీఏలో మాట్లాడుతూ, కాశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనకు భారత్ పాల్పడిందని ఆరోపించారు.

## షారుఖ్ కామెంట్‌కు మోడీ జవాబు

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి తన పద ప్రయోగంతో పదునైన సందేశం ఇచ్చారు. షారుఖ్ అభిమానులను మెప్పించారు. షారుఖ్ కామెంట్‌కు బదులిస్తూ, మహాత్మాగాంధీ సందేశాన్ని నిజం చేసేందుకు ప్రతి పౌరుడు దిల్‌సే (మనస్ఫూర్తిగా) కేంద్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని అన్నారు. నినాదాలతోపాటు ఆచరణలోనూ గాంధీజీ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. ప్రతిఒక్క పౌరుడు ఎప్పుడైతే మనస్ఫూర్తిగా పనిచేస్తారో, అప్పుడు దాని ఫలితం అమోఘంగా ఉంటుంది. బాపూజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవద్దని సూచించారు. 1998 నాటి షారుఖ్, మనీషా కోయిరాల నటించిన దిల్‌సే సినిమాను ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావిస్తూ ఆదర్శప్రాయ సందేశంతో ట్వీట్‌చేశారు.

## మోడీజీ... మమ్మల్నీ.. గుర్తించండి..!



**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** మోడీజీ...దక్షిణాది తారలను కూడా గుర్తించండి అని టాలీవుడ్ నటుడు రాంచరణ్ సతీమణి ఉపాసన కామినేని కొణిదెల కోరారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. భారత వినోద రంగానికి చెందిన పులువురు ప్రముఖులతో ప్రధాని శనివారం సమావేశమైన విషయం తెలిసిందే. మహాత్మా గాంధీ 150వ జయంతిని పురస్కరించుకొని సినీ ,టీవీ రంగాలు రూపొందించిన నాలుగు సాంస్కృతిక వీడియోలను మోడీ విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ నటీనటులు హాజరయ్యారు. దీంతో ఉపాసన సోషల్ మీడియా వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'ప్రియమైన నరేంద్ర మోడీజీ దక్షిణ భారత దేశంలో ఉన్న మాకు మీరంటే ఎంతో గౌరవం. దేశంలోని అన్ని రంగాలకు చెందిన ప్రముఖులతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాలీవుడ్ తారలు మాత్రమే ఉన్నారు. దక్షిణాది నటులపై నిర్లక్ష్యం చూపించారు. అది బాధను కలిగించింది. దక్షిణాది నటులను కూడా గుర్తించాలని కోరుతున్నాను. మీరు దీనిని సరిగ్గా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.' అని పేర్కొన్నారు.

## గోయల్‌కు రాహుల్ చురక..!



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ం మంత్రి పీయూష్ గోయల్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ వామపక్ష వాది అన్న గోయల్ వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఇలాంటి మూఢ విశ్వాసం గల వాళ్లు.. ద్వేషంతో కళ్లు మూసుకుపోయిప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రొఫెషనల్స్ గురించి తెలియని వాళ్లు అలా మాట్లాడుతారని విమర్శించారు. పీయూష్ గోయల్ పూణెలో మీడియాతో మాట్లాడుతూ.. అభిజిత్ బెనర్జీ లెఫ్ట్‌లర్నింగ్ పర్సన్ అని వ్యాఖ్యానించగా.. స్పందించిన బెనర్జీ మంత్రి తన ప్రొఫెనలిజం(వృత్తి నైపుణ్యాలు) నే ప్రశ్నించారని మండిపడ్డారు. గోయల్ వ్యాఖ్యలపై రాహుల్ స్పందిస్తూ.. అభిజిత్ ముఖర్జీ జి, ఇలాంటి మూఢ విశ్వాసులకు ద్వేషంతో కళ్లు మూసుకుపోయాయి..మీ గురించి వాళ్లకు తెలియజేయాల్సిన అవసరం లేదు అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## ఢిల్లీలో వీహెచ్‌పీ యజ్ఞం



**న్యూఢిల్లీ:** శతాబ్దాలనాటి అయోధ్యలో రామ జన్మభూమి వివాదానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం తుది తీర్పు వెలువరించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో విశ్వ హిందూ పరిషత్ అయోధ్యలోని రామమందిరం నిర్మాణం కోరుతూ ఆదివారం ఢిల్లీలో యజ్ఞాన్ని నిర్వహించింది. దేశరాజధాని నడిబొడ్డున ఉన్న కైలాష్ కాలనీలో యజ్ఞాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విహెచ్‌పీ నేత వినోద్ బన్సాల్ మాట్లాడుతూ రాముడికి వ్యతిరేకంగా నిలబడేవారందరికీ మంచి భావాన్ని కలిగించాలని కోరుతూ ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. అత్యున్నత న్యాయస్థానం మరికొన్ని రోజుల్లో తుది తీర్పును వెలువరించేఅవకాశం ఉండగా ఇలాంటి కార్యక్రమం అవసరం ఏమిటని విలేఖరులు ప్రశ్నించగా అయోధ్యలో రామనిర్మాణాన్ని వ్యతిరేకించేవారి మారాలన్నదే తమ ఉద్దేశ్యమన్నారు.

## బంగారం వదిలి కత్తులు కొనండి..?

**లక్నో:** అయోధ్య తీర్పు వెలువడనున్న నేపథ్యంలో ధంతేరాస్‌నాడు బంగారానికి బదులుగా ఇనుప కత్తులు కొనాలని యూపీకి చెందిన బీజేపీ నేత, డియోబంద్ నగర బీజేపీ అధ్యక్షుడు గజరాజ్ రాణా అన్నారు. సమీప భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటుంది కాబట్టి కొనమని హిందూ సమాజాన్ని కోరుతున్నామన్నారు. ప్రతి సంవత్సరం దీపావళి పండుగకుముందు ధంతేరాస్ జరుపుకుంటారు. సంప్రదాయం ప్రకారం ప్రజలు లోహపు వస్తువులను కొనుగోలు చేస్తారు. తాను ఏ సమాజానికి, మతానికి వ్యతిరేకంగా మాట్లాడలేద న్నారు. విపత్కర పరిస్థితుల్లో మనల్ని మనం రక్షించుకోవాలని తెలిపేందుకు ఆ విధంగా వ్యాఖ్యానించామని గజరాజ్ రాణా వివరణ ఇచ్చారు.

## సెయింట్ స్టీఫెన్స్ లెక్చరర్ అనుమానస్పద మృతి

**న్యూఢిల్లీ:** దేశరాజధాని ఢిల్లీలోని పిటంపుర ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన 55ఏళ్ల మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఆమె కుమారుడి మృతదేహాన్ని సారాయ్ రోహిల్లా రైల్వేస్టేషన్ ట్రాక్‌పై కనుగొన్నామన్నారు. మృతుడిని అలాన్ స్టాన్లీగా గుర్తించామని ఇతను ఢిల్లీలోని ప్రతిష్ఠాత్మక సెయింట్ స్టీఫెన్స్ కాలేజ్‌లో ఫిలాసఫీ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఐఐటీ ఢిల్లీ నుంచి పీహెచ్‌డీ చేస్తున్నట్టు తెలిసిందన్నారు. బాధితులు ఇద్దరూ కేరళలోని కొట్టాయంకు చెందినవారని ప్రస్తుతం ఢిల్లీలో నివసిస్తున్నారన్నారు. వారి బంధువులంతా కేరళలోనే ఉన్నారని తెలిపారు. అలాన్ అతడి తల్లి లిస్సీపై కేరళలో ఓ కేసు నమోదైందని బెయిల్‌పై ఉన్నట్టు దర్యాప్తులో తెలిసిందన్నారు. లిస్సీ రెండో భర్తను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారని నమోదైన కేసుపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## కుటుంబ వేధింపులపై బీజేపీ నేత కుమార్తె ఫిర్యాదు



**భోపాల్:** మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే సురేంద్రనాథ్ సింగ్ కువార్తె సొంత కుటుంబ సభ్యులపై పోలీసులుకు ఫిర్యాదు చేశారు. 28ఏళ్ల భారతిసింగ్ తనను మరో రాజకీయ నేత కుమారుడికిచ్చి వివాహం చేసేందుకు కుటుంబ సభ్యులు ఒత్తిడి చేస్తున్నారని, దీంతో తను ఇంటినుంచి వెళ్లిపోయినా వేదిస్తూనే ఉన్నారని తెలిపింది. అక్టోబర్ 16న మాజీ ఎమ్మెల్యే సురేంద్రనాథ్ సింగ్ తమ కువార్తె మానసిక వ్యాధితో బాధపడుతుందని, తప్పిపోయిందని పోలీసులుకు ఫిర్యాదు చేశారు.

## రైల్వే బోర్డు కుదింపు

**న్యూఢిల్లీ:** రైల్వేశాఖ సంస్కరణలను వేగవంతం చేస్తోంది. ఇటీవల ప్రైవేటు భాగస్వామ్యానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తాజాగా రైల్వేబోర్డు పరిమాణాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో పనిచేస్తున్న సిబ్బందిలో 25 శాతం మందిని ఇతర విభాగాలకు పంపాలని చూస్తోంది. ప్రస్తుతం 200 మంది అధికారులు విధులు నిర్వహిస్తుండగా, వీరి సంఖ్యను 150కి తగ్గించనుంది. డైరెక్టర్ స్థాయి, ఆపై హోదాలోని అధికారులను జోనల్ రైల్వేస్‌కు బదిలీ చేయనుంది. తద్వారా సంస్థ సామర్థ్యాన్ని పెంచొచ్చని రైల్వేశాఖ భావిస్తోందని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. జోనల్‌స్థాయిలో సీనియర్ అధికారుల సేవలు అవసరం ఉన్నందున, ఈ చర్య సత్ఫలితాన్నిస్తుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ ఆలోచన 2000 సంవత్సరంలో వాజ్‌పేయి ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల కార్యాచరణకు నోచుకోలేదు. రైల్వేబోర్డు సహా శాఖలోని కొన్ని విభాగాల్లో అవసరానికి మించి సిబ్బంది ఉన్నారని, వీరి సేవలను సమర్థవంతంగా వినియోగించుకోలేక పోవడం వ్యతిరేక ఫలితాన్నిచ్చిందని సదరు అధికారి వ్యాఖ్యానించారు. ఏ విభాగంలో కచ్చితంగా ఎంతమంది సిబ్బంది అవసరం అన్నదానిపై ఇప్పటికీ సరైన మదింపు జరగడం లేదన్నారు. దీనివల్ల సంస్థపై ఆర్థికభారం పెరగడంతోపాటు, సమర్థత దెబ్బతింటోందని అన్నారు. రైల్వేబోర్డు కుదింపు పరిణామం మొత్తం రైల్వేశాఖ ప్రక్షాళనలో తొలిఅంకం కానుంది.

## పాఠ్య ప్రణాళిక ముసాయిదాపై సమీక్ష!

**న్యూఢిల్లీ:** జాతీయ స్థాయిలో పాఠ్య ప్రణాళిక ముసాయిదా (ఎన్‌సీఎఫ్) పునస్సమీక్షకు కేంద్రం సిద్ధమైంది. ఈ మేరకు సమగ్ర కరసత్తుకు శ్రీకారం చుట్టనుంది. నవంబర్ రెండవ వారం నుంచి ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నట్లు నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ హృషికేష్ సేనాపతి తెలిపారు. పాఠ్యాంశాల్లోని విషయాలతోపాటు, బోధనా పద్ధతులపైనా సమీక్ష జరుగుతుందని చెప్పారు. దేశంలో పాఠశాల విద్యకు సంబంధించిన ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. నూతన పాఠ్య ప్రణాళిక ముసాయిదా ప్రక్రియను 2020 డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా, ఎన్‌సీఈఆర్‌టీ నిర్దిష్ట రోడ్‌మ్యాప్‌ను ఇటీవల జాతీయ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖకు అందజేసింది. జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) 2020 ఖరారైన తర్వాత ఆయా గ్రూపులపై సంప్రదింపుల ప్రక్రియను చేపట్టే అవకాశం ఉంది. 15 ఏళ్ల తర్వాత విద్యా విధానంపై సమీక్ష జరుగుతోంది. ఇదివరకు 1975, 1988, 2000, 2005 సంవత్సరాల్లో నాలుగుసార్లు ఎన్‌సీఎఫ్ చేపట్టారు. కాలం చెల్లిన అంశాల పాఠ్యాంశాలను తొలగించనున్నారు. అదేవిధంగా కాలానుగుణంగా కార్పొరేట్ పోటీకి తగ్గట్లు సిలబస్‌ను రూపొందించనున్నారు. 2005 నాటి ప్రతిపాదనలు చాలావరకు అమలుకు నోచుకోనందున ఇప్పుడు వాటిని మరోసారి పరిశీలించే అవకాశం ఉందని సేనాపతి తెలిపారు.

# ‘మహా’ సంగ్రామం

- నేడే పోలింగ్ • హర్యానా అసెంబ్లీతో పాటు 16 రాష్ట్రాల్లో..

65 స్థానాల్లో ఉపఎన్నిక • 24న ఓట్ల లెక్కింపు.. అదే రోజు ఫలితాల వెల్లడి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** రెండు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో నేడు అసలు పరీక్ష. ఇవాళ జరిగే పోలింగ్ సరళే ఏ పార్టీ అధికార పీఠాన్ని చేజిక్కించుకుంటుందో తేలుస్తుంది. గెలుపుపై ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ధీమాగా ఉన్న ఓటరు మనోగతం ఏంటన్నది ఫలితాలు విడుదలైతే గానీ బయటప డదు. నేడు పోలింగ్ జరగనుండగా.. ఈనెల 24న ఫలితాలు విడుదలకానున్నాయి.

దీంతో మహారాష్ట్ర, హర్యానాలో గెలిచేదెవరు.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేదెవరన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.మహారాష్ట్రలో ఏ ప్రాంతంలో ఎవరి ప్రభావం ఎక్కువ ఉండొచ్చన్న దానికి నాలుగు ప్రధాన కారణాలున్నాయని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు. ఎన్నికలపై ఎన్సీపీ ప్రభావం... శివసేన మరోమారు భారీ మెజార్టీపై పెట్టుకున్న ఆశలు, రెండోసారి అధికారాన్నన్ని జేజిక్కించుకోవాలనుకుంటున్న బీజేపీ పంతం, రైతుల సమస్యలు, నిరుద్యోగ ప్రభావం వంటివి ఈ ఎన్నికలను అత్యంత ప్రభావం చూపడనున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### పవార్ పవర్

ఎన్సీపీ అధినేత శరత్ గోవింద్ రావు పవార్‌కు సతర, పుణెలోని పలు ప్రాంతాల్లో పట్టుంది. గ్రామాల్లో పవార్‌కు అమితమైన అభిమానం ఉండటం వల్ల ఈ ప్రాంతాల్లో బీజేపీ, శివసేన ప్రభావం అంతగా ఉండకపోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.పూణెకు 50 కిలోమీటర్ల దూరంలోని వింగ్ గ్రామంలో పవార్ గురించి ప్రశ్నించగా.. ఈ ఎన్నికల తర్వాత ఆయన ఎన్నికల్లో ప్రచారం చేయగలరో..లేదో.. ఈ ఎన్నికలు ఎన్సీపీకి ఎంతో కీలకమైనవి. అని పేర్కొన్నాడు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి ఎన్సీపీ పోటీ చేయగా.. శరద్ పవారే కూటమిని లీడ్ చేశారు. బీజేపీకి గట్టి పోటీనిచ్చే నేతల్లో శరద్ పవార్ ఒకరని స్థానికంగా పేరుంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ సీఎం పృధ్వీరాజ్ చౌహాన్ మాత్రం పవార్‌ను ముందుంచడం వెనక వేరే వ్యూహం ఉందని అంటున్నారు. పవార్ ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయకపోవడం వల్ల ఆయన ఏ ప్రాంతంలోనైనా ప్రచారం చేసే అవకాశం దక్కిందని.. ఆయా ప్రాంతాల కాంగ్రెస్ నేతలకు మద్దతుగా పవార్ ప్రచారం చేశారని వివరించారు. ఎన్నో ఎన్నికలు చూసిన అనుభవం పవార్‌కు ఉండటం ప్రజల్లో కలిసివచ్చే అంశమైతే ఎన్సీపీలో పుట్టి, పెరిగిన అనేక మంది నాయకులు బీజేపీలో ఉండటం గమనార్హం. 2014 ఎన్నికల్లో ఎన్సీపీ- కాంగ్రెస్ కంటే ఒకే ఒక్క స్థానం తక్కువ గెలుచుకుంది.

### మెజార్టీపై శివసేన దృష్టి

శివసేన గత ఎన్నికల సమయంలో బీజేపీతో చేతులు కలిపి కొన్నాళ్లు ప్రభుత్వంలో.. ఆ తర్వాత ప్రతిపక్షంగా కీలక పాత్ర పోషించింది. ఈ సారి కూడా బీజేపీతో పొత్తు కుదుర్చుకుంది. 1989 నుంచి బీజేపీ, శివసేన చేతులు కలపగా.. నాటి నుంచి బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో శివ సేన అసెంబ్లీ ఎన్నికల్లో అధిక స్థానాలు చేజిక్కించుకుంటున్నాయి. 2014లో అనూహ్యంగా బీజేపీకి రాష్ట్రంలో మెజారిటీ పెరగడంతో రెండు పార్టీల మధ్య సీటింగ్ అరేంజ్‌మెంట్స్‌కు కూడా మారిపోయాయి. బీజేపీకి 122, శివసేనకు63 అసెంబ్లీ స్థానాలు రావడంతో బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ సీఎంగా ఐదేళ్లు కొనసాగగా.. కొన్నాళ్లు బీజేపీతో బాగానే ఉన్న సేన.. మరికొన్నాళ్లు బేధాభిప్రాయాలు కలిగి ఉంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 150 స్థానాల్లో, శివసేన 124 స్థానాల్లో పోటీ చేయగా... 14 స్థానాలను చిన్నపార్టీలైన మిత్రపక్షాలకు కేటాయించారు. ఈ రెండు పార్టీలది కామన్ ఎజెండా కావడం కూడా కలిసివచ్చింది. హిందుత్వ, జాతీయవాదం నినాదాలతో ప్రజల్లోకి వెళ్తున్న శివసేన, బీజేపీలు ఈ ఎన్నికల్లో హామీల వర్షం కురిపించాయి. స్వాతంత్ర్య సమర యోధుడు వినాయక్ సావర్కర్‌కు భారత రత్న ఇవ్వాలన్నది బీజేపీ ప్రధాని హామీగా ఉంది. ఇకశివసేన అధినేత ఉద్దవ్ థాక్రేకు ఈ ఎన్నికలు చాలెంజ్‌గా మారాయి.

### కీలకంగా మరాఠా ఓట్లు

మహారాష్ట్ర ఎన్నికల్లో ఎక్కువగా మరాఠా ఓట్లే ప్రభావితం చూపిస్తాయి. మొత్తం ఓటర్లలో మరాఠాల ఓట్లు 29 శాతం ఉండగా.. 2014 అసెం బ్లీ ఎన్నికల్లో బీజేపీకి 24 శాతం, ఎన్సీపీ 17 శాతం, కాంగ్రెస్ 11 శాతం మరాఠా ఓట్లు రాబట్టగలిగాయి. మరాఠాల పరంగా చూస్తే కాంగ్రెస్ పార్టీ ఓట్ షేర్ రెండు దశాబ్దాల్లో చూస్తే 47 శాతం నుంచి 11 శాతానికి పడిపోయింది. మరాఠాలు తమకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నా.. 2014 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు నాటి కాంగ్రెస్- ఎన్సీపీ ప్రభు త్వం అంగీకరించినా అమలు చేయలేదు. దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం రిజర్వేషన్ల అంశాన్ని పరిష్కరిం చింది. విద్య లో 12 శాతం, ఉద్యోగాల్లో 13 శాతం రిజర్వే షన్లను మరాఠాలకు కల్పించారు. అనేక వర్గాలను ఏకతాటిపైకి తేవడంలోనూ ఫడ్నవీస్ విజయం సాధించారు.

### వ్యవసాయం, ఉద్యోగ సమస్యలు

మహారాష్ట్రలో మోడీ మానియా బాగా సాగుతున్నప్పటికీ వ్యవసాయం, ఉద్యోగ సమస్యలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. వ్యవసాయ సంక్షోభం కూడా బీజేపీకి కొంత ఇబ్బందికర పరిస్థితులను తెచ్చిపెట్టింది. 2017 లో రైతులకు రూ.34 వేల కోట్ల రుణమాఫీని ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదు. ఈ రంగంలో అభివృద్ధి 2017-18 లో 3.1 శాతం ఉండగా 2018-19 0.4 శాతం తగ్గిపోవడం.. 2015-2018 మధ్య మహారాష్ట్రలో 12 వేల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడటం ఆందోళన కలిగించే అంశం. నిరుద్యోగం కూడా బీజేపీకి ఎదురుదెబ్బ అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ రెండు అంశాలను అస్త్రంగా మార్చుకుని ప్రతిపక్షాలు ప్రజలను తమవైపు తిప్పుకునే అవకాశముందని చెబు తున్నారు. అయితే ప్రధాని మోడీ పాపు లారిటీ,, 370 రద్దు వంటి అంశాలు బీజేపీకి కలిసిరావచ్చని అంచనా వేస్తున్నారు.

## ఫిర్ ఏక్ బార్ అంటున్న బీజేపీ

### • యువత చేతిలో నేతల భవిత

హర్యానా రాష్ట్రంలో నేతల భవిష్యత్తు యువ ఓటర్ల చేతిలో ఉంది. మొత్తం రాష్ట్రంలోని 1.83 కోట్ల మంది ఓటర్లలో 89 లక్షల మంది 40 ఏళ్ల లోపు వయస్సు కలిగినవారే ఉన్నారు.భావోద్వేగాలకు ఎక్కువగా ప్రభావితం అయ్యే వయస్సు కావడంతో దేశభక్తి సహా అన్ని రకాల భావోద్వేగాలను ప్రధాన పార్టీలు ప్రయోగిస్తున్నాయి. అదేసమయంలో నిరుద్యోగ సమస్య అధికార బీజేపీని కలవరపెడుతున్నప్పటికీ, మిగతా అన్ని విషయాల్లో ఆ పార్టీకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పదవిలో ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్ వివాదరహితుడిగా, అవినీతి మరక లేకుండా పాలన అందించగలిగారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కారు కలిసొచ్చేవిగా మారాయి.

### జాతీయాంశాలు

దేశ రాజధాని ఢిల్లీకి ఆనుకుని ఉన్న హర్యానా రాష్ట్రం ఓ రకంగా చెప్పాలంటే రాజధాని విస్తరణకు వేదికగా మారింది. ఉమ్మడిగా ఎదుర్కొనే సమస్యల్లో కాశ్మీర్ శాంతిభద్రతల పరిస్థితులు కూడా ఒకటి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆర్టికల్ 370 రద్దు వంటి నిర్ణయం ద్వారా ఆ సమస్య పరిష్కారానికి అడుగు పడిందని సైనిక కుటుంబాల్లో అత్యధికులు భావిస్తున్నారు. మోడీ సర్కారు తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంగా అభివర్ణిస్తున్నారు. ఇది ఖట్టర్ సర్కారుకు కలిసొచ్చే అంశంగా మారింది.

### జాట్ల ప్రాబల్యం

రాష్ట్ర జనాభాలో సంఖ్య ప్రకారం బలంగా ఉన్న జాట్లు ఇన్నేళ్లుగా రాజకీయాలపై అత్యధిక ప్రభావం చూపుతూ వచ్చారు. తమకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ రెండూ విఫలమయ్యాయన్న అభిప్రాయం జాట్లలో పాతుకుపోయింది. చౌతాలా వంటి నేతలు ఐఎన్ఎల్డీ వంటి రాజకీయ పార్టీలను స్థాపించి అస్థిత్వాన్ని చాటుకున్నారు.

### డేరాలు - బాబాలు

బాబాలు, స్వామీజీలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావం చూపుతూ వచ్చారు. అయితే గత ఐదేళ్లలో డేరా సచ్చా సౌధా వ్యవస్థాపకుడు బాబా రామ్ రహీం సింగ్ జైలుపాలు కావడం, మరికొందరు బాబాలు కూడా కేసుల్లో ఇరుక్కోవడంతో ఈ ఆశ్రమాల ప్రభావం రాజకీయాలపై క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. అయినా సరే, కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ కొందరు బాబాలు ఎన్నికల్ని ప్రభావితం చేస్తున్నారు..

### బరిలో క్రీడాకారులు, టిక్ టాక్ స్టార్లు

అధికార భారతీయ జనతా పార్టీ నుంచి రాష్ట్రం గర్వపడే క్రీడాకారులుగా పేరొందిన బబితా ఫోగట్, యోగేశ్వర్ దత్ టికెట్లు సాధించి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. వీరికి తోడు టిక్ టాక్ స్టార్‌గా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం పొందిన సోనాలి ఫోగట్ వంటివారు బరిలో నిలవడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశంగానే కనిపిస్తోంది.



## ఓట్ల చీలికపైనే గంపెడాశలు..!

- 55 మంది స్వతంత్రులుగా పోటీ • 220 స్థానాలు పక్కా అంటున్న బీజేపీ
- 15-20 స్థానాలకు రెబల్స్ పోటు • బీజేపీ-సేన కూటమికి 100 మంది రెబల్స్

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 288 నియోజకవర్గాల్లో పక్కా 220 స్థానాల్లో గెలిచి తీరుతామం టూ బీజేపీ-శివసేన కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది. అయితే ఇరు పార్టీలను రెబల్స్ కొంత ఇరకాటంలో పెట్టే అవకాశాలు లేకపోలేదు. 55 మంది టికెట్ ఆశించి భంగపాటుకు గురయ్యారు. వీరంతా వారి వారి నియోజకవర్గాల్లో బీజేపీ, శివసేనకు వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగారు. తమ నామినేషన్లు ఉపసంహరించుకోవాలని ఇరు పార్టీల అగ్రనేతలు వారికి సూచించినా.. వారు మాత్రం అస్సలు వెనక్కి తగ్గలేదు. బీజేపీ, శివసేన ప్రధాన అభ్యర్థుల విజయంలో అయినా.. ఓటమిలో అయినా.. రెబల్స్ కీలక పాత్ర పోషిస్తారని, ఓట్ల చీలిక కూడా భారీగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ-శివసేన కూటమికి రెబల్స్ కారణంగా.. 15-20 సీట్ల వరకు పదవీ గండం ఉందని చెబుతున్నారు. బీజేపీ, శివసేన కూటమిగా ఏర్పాటు కాకపోయి ఉంటే అన్నీ స్థానాల్లో బలమైన అభ్యర్థులు బరిలో నిలిచేవారు.

అయితే చివరి వరకు టికెట్ ఆశించిన వారికి అధిష్టానం మొండి చేయి చూపించడంతో కొందరు పార్టీ మారగా.. మరికొందరు స్వాతంత్ర అభ్యర్థులుగా పోటీకి దిగగా, మరి కొందరు అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి ఉండగా.. మరికొందరు సదరు అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్, ఎన్‌సీపీ నుంచి వచ్చిన చాలా మంది నేతలందరికీ బీజేపీ, శివసేన కూటమి టికెట్ కేటాయించింది. కూటమి నుంచి సుమారు 100 మందికిపై రెబల్స్ ఉన్నారు. వీరంతా తమ పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకం గా నామినేషన్లు కూడా దాఖలు చేశారు. తరువాత సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఉద్ధవ్ ఠాక్రేలు బరిలో దిగి బుజ్జగింపులు చేయడంతో కొందరు దిగొచ్చారు. ఇప్పుడు మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల బరిలో సుమారు 1,500 మంది అభ్యర్థులు ఉన్నారు.

### స్వతంత్రులుగా బరిలోకి..

బీజేపీ, సేన కూటమి తరపున కల్యాణ్ ఈస్ట్, కల్యాన్ వెస్ట్ నుంచి అభ్యర్థులను ప్రకటించింది. గణపత్ గాయక్‌వాడ్ కల్యాణ్ వెస్ట్ అధికారిక అభ్యర్థి. నాలుగు సార్లు కార్పొరేటర్, సేన రెబల్ అభ్యర్థి ధనంజయ్ బొడరే అదే నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు.

అయితే ఈ నేపథ్యంలో గాయక్‌వాడ్ ఓట్లన్నీ, సేన ఓట్లు రెబల్ అభ్యర్థికి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఐదుగురు సేన కార్పొరేటర్లు కూడా తమ పదవులకు రాజీనామా చేసి ధనంజయ్‌కు మద్దతు తెలిపారు. కళ్యాన్ వెస్ట్ నుంచి అధికారిక అభ్యర్థి విశ్వనాథ్ ఉండగా.. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే నరేంద్ర పవార్ రెబల్‌గా మారారు.

## మాకు ఈ ప్రభుత్వాలొద్దు..!

- మహారాష్ట్ర, హర్యానా ఓటర్లు
- హర్యానాలో 57.5 శాతం, మహాలో 54.9 శాతం వ్యతిరేకం

**న్యూఢిల్లీ :** హర్యానా, మహారాష్ట్ర మెజార్టీ ఓటర్లు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాలు మారాలని కోరుకుంటున్నట్టు ఐఏఎన్ఎస్-సీ ఓటర్ సర్వేలో వెల్లడైంది. కానీ ప్రధానిగా మాత్రం మోడీయే ఉండాలని కోరుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. సర్వే ప్రకారం.. హర్యానాలో 57.5 శాతం ఓటర్లు బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అభిప్రాయపడుతున్నారు.

ఇక మహారాష్ట్రలో ఫడ్నవిస్ ప్రభుత్వాన్ని తప్పించాలని 54.9 శాతం ఓటర్లు కోరుకుంటున్నారు. ఇవే ప్రభుత్వాలు ఉండాలని హర్యానాలో 41.6 శాతం ఓటర్లు, మహారాష్ట్రలో 44.6 శాతం ఓటర్లు భావిస్తున్నారు. సీఎం మనోహర్ ఖట్టర్ కావాలని 54.5 శాతం ఓటర్లు, వద్దు అని 44.7 శాతం ఓటర్లు, కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేలు కూడా మారాలని 64 శాతం ఓటర్లు, వారే ఉండాలని 34.2 శాతం ఓటర్లు కోరుకుంటున్నారు. ఇక మహారాష్ట్రలో స్థానిక ఎమ్మెల్యేలు మారాలని 54.7 శాతం ఓటర్లు, వీరే ఉండాలని 43.1 శాతం ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.

ఇక జాతీయ స్థాయిలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఉండాలని హర్యానాలో 72 శాతం కోరుకుంటున్నారు. మారాలని 26.9 శాతం ఓటర్లు, 1.1 శాతం ఓటర్లు ఏం చెప్పలేకపోయారు. హర్యానాలో మోడీయే ప్రధానిగా ఉండాలని 76.3 శాతం ఓటర్లు, వద్దని 22.8 శాతం ఓటర్లు, 0.9 శాతం ఓటర్లు ఏం తేల్చుకోలేకపోయారు. మహారాష్ట్రలో 67.2 శాతం ఓటర్లు కేంద్రంలో బీజేపీ ఉండాలని, 71.5 శాతం ఓటర్లు మోడీ ప్రధానియే ఉండాలని కోరుకుంటున్నారు. ఎన్‌డీఏను మార్చాలని 31.3 శాతం ఓటర్లు, మోడీ మారాలని 27.5 శాతం ఓటర్లు అభిప్రాయపడుతున్నారు.

## నైతిక నిష్టకు పరాశరన్ మారుపేరు

- ఏజ్ కేర్ ఇండియా సంస్థ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** అపారమైన జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, కఠోర శ్రమ, నైతికత విలువలు పాటించడం వల్లే ప్రముఖ న్యాయ కోవిదుడు, మాజీ అటార్నీ జనరల్ పరాశరన్ ఉన్నత వ్యక్తిగా గౌరవాన్ని అందుకుంటున్నారని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఏజ్ కేర్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పరాశరన్‌కు 'మోస్ట్ ఎమినెంట్ సీనియర్ సిటిజన్' అవార్డును అందజేశారు. భారత న్యాయవాదుల సంఘానికి పితామహుడిగా, సూపర్ అటార్నీ జనరల్‌గా పిలుచుకోవడం.. ఆయనకు భారత సమాజం ఇచ్చే గౌరవమని వెంకయ్య నాయుడు కొనియాడారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడంతోపాటు.. తప్పొప్పులను నిర్మొహమాటంగా చెప్పడం ఆయనకే చెల్లిందన్నారు. కీలకమైన కేసుల్లో ఆయన వాదించిన తీరుపై న్యాయమూ ర్తులే ప్రశంసించిన కొన్ని సందర్భాలను కూడా ఉపరాష్ట్రపతి ఉదహరించారు. ఆయన వాదనల్లో చట్టాలతో పాటు పురాణాల్లోని అంశాలను పేర్కొనేవారన్నారు. రామసేతు కేసులోనూ పరాశరన్ సేతును కాపాడుకునేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు.



మహాత్మగాంధీ 150వ జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని భారతీయ సినీ, టీవీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులతో ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో టాలీవుడ్ నటి రకుల్‌ప్రీత్ సింగ్ పాల్గొని...ప్రధానితో సెల్ఫీ దిగారు.

# ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తాయి

**- ఖైదీ గురించి కార్తి**



ప్రముఖ తమిళ నటుడు కార్తికి తెలుగులోనూ మంచి పేరుంది. ఆవారా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయిన ఆయన వరుస సినిమాలతో సందడి చేస్తూనే ఉన్నారు. తాజాగా టైటిల్ పాత్రలో ఆయన నటించిన చిత్రం ఖైదీ. ఇంతకీ కార్తీ జైలుకు ఎందుకు వెళ్లాడు? ఆ తర్వాత జరిగే అనేక ఆసక్తికర పరిణామాల నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా దీనిని తెరకెక్కించారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రానికి లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించారు. తెలుగులో శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె.కె.రాధమోహన్ ప్రేక్షకులకు అందిస్తున్నారు. దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ఈ చిత్రం గురించి...అలాగే పలు అంశాల గురించి హీరో కార్తి ఆదివారం హైదరాబాద్‌లోని పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు.

**ఈ చిత్రం ఎలా మొదలైంది?**

లోకేష్ కనకరాజ్ లఘు చిత్రాలు చేసి చిత్ర పరిశ్రమలోనికి వచ్చారు. ఈ చిత్రకథ చెప్పేటప్పుడు ఇదొక కొత్త ఐడియా. తప్పకుండా మీకు నచ్చుతుంది అని చెప్పారు. సినిమా మొత్తం మాస్ అంశాలతో యాక్షన్‌తో ఉంటుంది. ఒక రాత్రిలో నాలుగు గంటల్లో జరిగే కథ ఇది. ఆ నాలుగు గంట ల్లోనే చాలా సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలుంటాయి. దీనిని ఒక భారీ బడ్జెట్ సినిమాగా నిర్మిస్తే... తప్పకుండా విజయం సాధిస్తుందని అని పించింది. అలా కథ మీద బలమైన నమ్మ కం ఏర్పడటంతో ఈ చిత్రం కార్యరూపం దాల్చింది.

**ఇందులో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

నా పాత్ర చిత్రణ నాకు బాగా నచ్చిన అంశం. పది సంవత్సరాల జైలు జీవితం పూర్తిచేసుకుని బయటకు వచ్చే ఒక ఖైదీ పాత్రను ఇందులో పోషించాను. అప్పటి వరకు తాను చూడని ఓ కూతురు ఉంటుంది. తను ఎలా ఉంటుందో కూడా తెలీదు. తనకు ఎదురైన అవాంతరాలను అధిగ మించి తన కూతురిని చూడగలిగాడా? లేదా? అన్నదే కథ. పది సంవత్సరాల పాటు తన కుమార్తెను చూడలేదు అంటూ అభినయానికి బాగా అవకాశం ఉన్న పాత్ర అని నాకు అనిపించింది.

**పాత్ర చేయడానికి ముందు ఎలాంటి పరిశోధన చేశారు?**

ఈ సినిమా చేయడానికి ముందు నిజమైన ఖైదీలను కలవడం జరిగింది. దర్శకుడు వారిని కలిసిన పుడు చాలా కొత్త విషయా లను వారు చెప్పారు.

**సినిమా మొత్తం రాత్రి సమయాల్లో చేసినట్లున్నారు?**

నిజమేనండి! 60 రాత్రులు షూటింగ్ చేశాం. ఈ సినిమా చేసిన తర్వాత ఈ దర్శకుడు వెంటనే విజయ్‌గారితో సినిమా చేస్తున్నారు. ఇప్పటి వరకు నేను చేసిన దర్శకులంతా చాలా ప్రతిభ కలిగినవాళ్లే.

**ఏ కోవకు చెందిన చిత్రంగా భావించవచ్చు?**

ఇదొక న్యూ ఏజ్ యాక్షన్ చిత్రంగా దీనిని చెప్పవచ్చు. నా పాత్ర మాత్రం మాస్ గా ఉంటుంది ఇది యూనిక్ కాంబినేషన్, అతను ఎవరు? అతని గతం ఏంటి? అన్నది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ట్రైలర్‌లో చూపించిన డైలాగ్స్‌కు విశేషమైన స్పందన లభిస్తోంది. విడుదల తర్వాత సినిమాలో డైలాగ్స్ వింటే థ్రిల్ ఫీలవుతారు. ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఇలాంటి సినిమా చేసే అవకాశం ఎప్పుడో ఒక్కసారే వస్తుంది. నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసే టప్పుడు కూడా ఇలాంటి సినిమాలు చేయాలని అనుకున్నాను. పాటలు, రొమా న్స్ లేకుండా కేవలం మాస్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాలుండే విభిన్న చిత్రమిది. తెలుగులో కూడా కొత్త కొత్త కథలతో థ్రిల్లర్ సినిమాలు వస్తున్నాయి. అర్జున్‌రెడ్డి, అడవిశేష్ నటించిన ఎవడు వంటి చిత్రాల ఘన విజయమే ఇందుకు ఉదాహరణ.

**కథకు అడ్డు వస్తాయనే పాటలు పెట్టలేదు:**

**కె.కె.రాధామోహన్**

ఇలాంటి మాస్, యాక్షన్, ఎమోష నల్ థ్రిల్లర్ కథలో లీనమైన ప్రేక్షకుడికి పాటల వల్ల సీరియస్‌నెస్ పోయే అవకాశం ఉంటుంది. నేటి ట్రెండ్‌లో విభిన్నమైన కథలలో అవసరం లేకపోయినా పాటలు పెట్టడం కరెక్ట్ కాదు కాబట్టే పాటలను ఈ చిత్రంలో పెట్టలేదు. ఈ తరహా మాస్ యాక్షన్ చిత్రానికి రీరికార్డింగ్ అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఇందులో రీరికార్డింగ్ కూడా అంత బాగా అలరిస్తుం ది. ఇందులో ఓ ఇంగ్లీష్ పెట్టడమనేది ఓ కొత్త ఆలోచన అని ఇదే ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీ సత్యసాయి ఆర్ట్స్ అధినేత కె.కె.రాధా మోహన్ వెల్లడించారు.

**చిరంజీవి ఖైదీ చిత్రం అక్టోబర్ 28నే విడుదలైంది కదా! దీనిపై మీ అభిప్రాయం?**

ఆ విషయం నాకు తెలియదు. ఇది కూడా ఓ మంచి సబ్జెక్టు ఉన్న చిత్రం కావడం వల్ల ఆ సినిమా మాదిరిగా విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది.

**తదుపరి సినిమాలు?**

జీతూ జోసఫ్‌తో ఒక కుటుంబ థ్రిల్లర్ చిత్రం చేస్తున్నాను. ఆకట్టుకునే చాలా బలమైన కథ. ఆ చిత్రంలో మా వదిన జ్యోతికగారు కూడా నటిస్తున్నారు అంటూ ఇంటర్వ్యూ ముగించారు.

# విజయం కంటే గొప్పది



ఎన్టీఆర్

ఇమేజ్ ఛత్రంలో మిగిలిపోవడం తనకిష్టం లేదంటున్నారు టాలీవుడ్ అగ్ర హీరో ఎన్టీఆర్. నువ్విదే చేయగలవు అనడం ఏ నటుడికీ సరికాదన్నది ఆయన అభిప్రాయం. తన చిత్రాల్లో ప్రతిసారీ ఏదో భారీగా, కొత్తగా ఉండాలని అభిమా నులు కోరుకుంటారనీ, అయితే ఆ ఇంకేదో తనకూ తెలియదంటున్నారు యంగ్ టైగర్. ఎన్టీఆర్, రామ్ చరణ్‌తో కలిసి ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో నటిస్తు న్నారు. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ ప్రతిష్టాత్మక సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. భూమి హక్కు కోసం, బానిసత్వ విముక్తి కోసం ఆదివాసీల పక్షాన పోరాడిన కొమురం భీం పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారు. సినిమాల ఎంపిక, నటన పట్ల ఎన్టీఆర్ తన దృక్పథం వెల్లడిస్తూ....నటుడు తన నటనతో మొదట సంతృప్తిపరచాల్సింది దర్శకుడినే. తన కథలో నటుడు ఎలా ఉండాలో దర్శకుడి ఊహలో ఉంటుంది. దానికి తగినట్లు చేశామా లేదా అనేది దర్శకుడి సంతోషంలో చూసుకోవాలి. విజయం సాధించడం ఒక్కటే సినిమా అంతిమ లక్ష్యం కాదు. ప్రతిరోజూ సంతోషిస్తూ ఒక సినిమాలో నటించాలి. ఆనందంగా లొకేషన్‌కు వెళ్లి రావాలి. నటుడిగా నేను ప్రయాణాన్ని ఆస్వాదిం చని చిత్రాలు కొన్ని ప్రేక్షకాదరణ పొందాయి. నేను చాలా ఇష్టపడుతూ నటించినవి అపజయం పాలైనవీ ఉన్నాయి. అయితే ఆ సినిమాను ఇష్టపడి చేయడమే ముఖ్యమనుకుంటాను. అలాంటి అనుభవం విజయం కంటే

గొప్పది. నా సినిమాల నుంచి అభిమానులు ఎప్పుడూ ఇంకేదో ఉండాలని కోరుకుంటారు. అయితే ఆ ఇంకేదో అనేది నాకూ తెలియదు. ఒక నటుడిని నువ్వు ఇదే చేయగలవు అనే ఛత్రంలో పెట్టడం నాకిష్టం లేదు. అని అన్నారు.



ప్రమాణ స్వీకారం నాటి ఫొటో...

# మాలో మళ్లీ వివాదం

మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ తరచూ వివాదాలతో వార్తలకెక్కుతోంది. గత పాలకవర్గంలోనూ వివాదాలు వెల్లువెత్తాయి. అప్పట్లో శివాజీరాజా, నరేష్‌ల మధ్య విమర్శలు, ప్రతి విమర్శల పర్వం కొనసాగిన విషయం తెలిసిందే. ఎన్నికల తర్వాత నూతన పాలకవర్గం అధ్యక్షుడిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా జీవితరాజశేఖర్‌లు గెలుపొందారు. అభిప్రాయ భేదాల కారణంగా వీరి మధ్య వివాదాలు తలెత్తి...ప్రస్తుతం అవి తారాస్థాయికి చేరాయని పరిశ్రమలో వినిపిస్తోంది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు కూడా వారి మధ్య వివాదాలను తేటతెల్లం చేస్తున్నాయి కూడా. నరేష్ ప్రమేయం లేకుండా జనరల్ మీటింగ్ హాజరుకావాలని కార్యవర్గ సభ్యులకు జీవిత రాజశేఖర్ వర్తమానం పంపడం మరింత వివాదానికి దారితీసిందని అంటున్నారు.

ఆదివారం జీవిత నేతృత్వంలో జరిగిన జనరల్ మీటింగ్‌లో గందరగోళం ఏర్పడినట్లు తెలిసింది. కొందరు సభ్యులు మధ్యలో అలిగి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కార్యవర్గ సభ్యుడు పృథ్వీ స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. మాలో జరుగుతున్న పరిణామాలు తనను ఎంతగానో బాధించా యని పృథ్వీ అన్నారు. ఎన్నికలు ముగిసి ఎనిమిది నెలలు పూర్తయ్యాయి. ప్రతీఒక్కరూ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియాలా ఫీలవుతున్నారు. అందరూ కలిసి పని చేయాలి కానీ ఇక్కడ అలా జరగడం లేదు. మా గురువు పరుచూరి గోపాలకృష్ణను మాట్లాడట నివ్వడం లేదు. అత్యవసరంగా మీటింగ్ అని అంటే తిరుపతి నుంచి వచ్చా అని పృథ్వీ వెల్లడించారు. మరోవైపు అధ్యక్షుడు లేకుండా మీటింగ్ ఎలా పెడతారని నరేష్ స్పందించినట్లు తెలిసింది. ఇది కేవలం స్నేహపూర్వక సమావేశమని జీవిత రాజశేఖర్ అంటున్నారు. సమావేశం పెట్టుకోవచ్చునని కోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో ఫ్రెండ్లీ సమావేశంగా దీనిని పెట్టామని జీవిత బృందం చెబుతున్నారు.

# పూరీలో ఉప్పెన



వైష్ణవ్‌తేజ్

మెగాస్టార్ చిరంజీవి మేనల్లుడు వైష్ణవ్‌తేజ్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం ఉప్పెన. అతని సరసన క్రితిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. తమిళ నటుడు విజయ్ సేతుపతి కీలక పాత్ర పోషిస్తున్నారు. సుకుమార్ వద్ద దర్శకత్వశాఖలో పనిచేసిన బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ సోమవారం నుంచి పూరీ, కోల్‌కతా, గ్యాంగ్‌టక్ ప్రాంతాల్లో జరగనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. 20 రోజుల పాటు ఈ షెడ్యూల్ జరగనున్నట్లు... ఇందులో భాగంగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తామని బృందం తెలిపింది. త్వరలోనే సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ మొదలు పెడతామని వారు చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శాందత్ సైనుద్దీన్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఎడిటింగ్: నవీన్ నూలి, ఆర్ట్: మోనిక రామకృష్ణ.

# వోగ్ వేడుకలలో తారల మెరుపులు..

వోగ్ వుమెన్ ఆఫ్ ద ఇయర్ పురస్కార వేడుకలు ముంబైలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బాలీవుడ్‌లో ఏడాదికి మేటి తారలను ప్రకటించారు. ఆలియా భట్, కత్రీనా కైఫ్, తాప్సీ, జాన్వీ కపూర్, అనన్య పాండే, అమైరా దస్తూర్, అనుష్క శర్మ, రాధికా ఆప్టే, సోనాలీ బింద్రే, సుర్వీన్ చావ్లా తదితర నాయికలు పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రన్వీర్ సింగ్, కరణ్ జోహార్, దుల్కర్ సల్మాన్ వేడుకలకు ప్రత్యేకత తీసుకొచ్చారు. స్టైల్ ఐకాన్ ఆఫ్ ఇయర్ గా అనుష్క శర్మ, ఫర్మారర్ ఆఫ్ ద ఇయర్‌గా ఆలియా భట్, రిస్క్ టేకర్ ఆఫ్ ద ఇయర్‌గా కత్రీనా కైఫ్, ట్రైబ్లేజర్ ఆఫ్ ద ఇయర్‌గా తాప్సీ పన్ను పురస్కారాలు దక్కించుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో సందేశాత్మక వీడియోలు పోస్టు చేసిన నవతార అనన్య పాండే యూత్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఆఫ్ ద ఇయర్‌గా అవార్డు సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ద ఇయర్‌గా రన్వీర్ సింగ్, ఫిల్మ్ మేకర్ ఆఫ్ ద ఇయర్‌గా జోయా అక్తర్ పురస్కారాలు గెల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో హాలీవుడ్ తారలు లిల్లీ సింగ్, విన్నీ హార్లో పాల్గొనడం విశేషం.



మనుషి చిల్లార్



అమైరా



సోనాలీ బింద్రే



క్రతీనా కైఫ్



జాన్వీ కపూర్



అనుష్క శర్మ



దియా మీర్జా



అనన్య పాండే



తాప్సీ



సుర్వీన్ చావ్లా

**2**

ఒకే సిరీస్‌లో మూడు ద్విశతకాలు నమోదవడం భారత్‌కు ఇది రెండోసారి. సౌతాఫ్రికాతో జరుగుతున్న చివరి టెస్టులో టీమిండియా ఓపెనర్ రోహిత్ శర్మ (212) డబుల్ సెంచరీతో చెలరేగాడు. అంతకుముందు మయాంక్ అగర్వాల్, కోహ్లీలు కూడా ద్విశతకాలు సాధించారు. ఫలితంగా 64 ఏళ్ల క్రితం ఒకే సిరీస్‌లో టీమిండియా సాధించిన మూడు ద్విశతకాలు రికార్డు ఇప్పుడు మళ్లీ పునరావృతమైంది. 1955-56 సీజన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో వినోద్ మన్కడ్ (2), పాలీ ఉమ్రిగర్ (1) డబుల్ సెంచరీలు సాధించారు.

**3**

భారత్ తరపున వన్డే, టెస్టుల్లో డబుల్ సెంచరీ సాధించిన మూడో బ్యాట్స్‌మన్‌గా రోహిత్ శర్మ రికార్డుల్లో నిలిచాడు. వన్డేలలో మూడు డబుల్స్ సాధించిన రోహిత్ టెస్టుల్లో తొలి ద్విశతకాన్ని నమోదు చేసుకున్నాడు. ఇక రోహిత్ కంటే ముందు ఈ రెండు ఫార్మాట్‌లో భారత తరపున సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్‌లు డబుల్ సెంచరీలు సాధించారు. ఇప్పుడు వారి సరసన రోహిత్ శర్మ చేరాడు.

## డాన్ బ్రాడ్‌మన్ 71 ఏళ్ల రికార్డు బద్దలు..



71 ఏళ్లుగా ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాట్స్‌మన్ డాన్ బ్రాడ్‌మన్ పేరిట ఉన్న అత్యధిక సగటు రికార్డును రోహిత్ శర్మ బద్దలు కొట్టాడు. సౌతాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్టులో డబుల్ సెంచరీతో చెలరేగిన రోహిత్ బ్రాడ్‌మన్ రికార్డును సొంతం చేసుకున్నాడు. సొంతగడ్డపై జరిగిన టెస్టు సిరీసుల్లో 10 లేదా అంతకంటే ఎక్కువ ఇన్నింగ్స్‌ల్లో అత్యధిక సగటు సాధించిన బ్యాట్స్‌మన్‌గా రోహిత్ నిలిచాడు. స్వదేశంలో గత 10 ఇన్నింగ్స్‌లలో రోహిత్ 99.84 సగటుతో పరుగులు రాబట్టాడు. ఫలితంగా డాన్ బ్రాడ్‌మన్ సాధించిన 98.22 సగటు రికార్డును 71 ఏళ్ల తర్వాత రోహిత్ అధిగమించాడు.

# రోహిత్ జోరు

# సఫారీలు బేజారు



## ద్విశతకంతో చెలరేగిన హిట్‌మాన్ • రహానె సూపర్బ్ సెంచరీ

### • రాణించిన జడేజా.. ఉమేశ్ మెరపులు • భారత్ తొలి ఇన్నింగ్స్ 497/9 డిక్లేర్డ్ • సౌతాఫ్రికా 9/2

**రాంచీ:** సౌతాఫ్రికాతో జరుగుతున్న చివరి టెస్టులో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో భారీ పరుగులు సాధించింది. ఓపెనర్ రోహిత్ శర్మ (212; 28 ఫోర్లు, 6 సిక్స్‌లు) మరోసారి విజృంభించి టెస్టుల్లో తొలి డబుల్ సెంచరీ నమోదు చేసుకున్నాడు. ఇతనికి తోడుగా వైస్ కెప్టెన్ అజింక్య రహానె (115; 192 బంతుల్లో 17 ఫోర్లు, 1 సిక్స్) సూపర్బ్ సెంచరీ సాధించాడు. చివర్లో జడేజా (51), ఉమేశ్ యాదవ్ (31; 10 బంతుల్లో 5 సిక్స్‌లు) విజృంభించడంతో భారీ స్కోరు చేసిన భారత్ 497/9 స్కోరువద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా రెండో రోజు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 9 పరుగులు చేసింది. ఆదివారం రెండో రోజు కూడా వెలుతురులేమి కారణంగా పూర్తి ఓవర్ల మ్యాచ్ కొనసాగలేదు.

### ఆరంభంలోనే సఫారీలకు షాక్..

భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్డ్ చేసిన తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు భారత పేసర్లు ఆరంభంలోనే షాకిచ్చారు. షమి తొలి ఓవర్‌లోనే డీన్ ఎల్గర్ (0)ను పెవిలియన్‌కి పంపాడు.తర్వాత మరో ఓపెనర్ డికాక్ (4)ను ఉమేశ్ యాదవ్ పల్టీ కొట్టించాడు. తర్వాత వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకే నిలిపివేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 9/2 స్కోరు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ (1 బ్యాటింగ్), జుబేర్ హంజ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ కంటే సౌతాఫ్రికా ఇంకా 488 పరుగుల వెనుకంజలో ఉంది.

### రహానె శతకం..

224/3 ఓవర్‌నైట్ స్కోరుతో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియాకు ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ, అజింక్య రహానె మరిన్ని పరుగులు జోడించారు. రహానె ఆచితూచి ఆడుతుంటే రోహిత్ మాత్రం అవకాశం దొరికినప్పుడు చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ వేగంగా పరుగులు సాధించాడు. ఈ క్రమంలోనే బాధ్యతగా ఆడుతున్న ఉప కెప్టెన్ రహానె 169 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్‌తో 11వ టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ దశలోనే హిట్‌మ్యాన్ రోహిత్ కూడా 199 బంతుల్లో 150 పరుగులు సాధించాడు.మరోవైపు టీమిండియా 300 పరుగుల మార్కును అందుకుంది. ఆ కొద్ది సేపటికే కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న అజింక్య రహానె (115) ఔటవడంతో 267 పరుగుల కీలక భాగస్వామ్యానికి తెరపడింది. భారత్ 306 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది.

### రోహిత్ దూకుడు..

అనంతరం రోహిత్ శర్మ, వృద్ధిమాన్ సాహాలు భారత ఇన్నింగ్స్‌ను ముందుకు సాగించారు. సాహా ఆచితూచి ఆడుతుంటే రోహిత్ మాత్రం దూకుడుగా ఆడుతూ స్కోరుబోర్డును పరిగెత్తించాడు. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగి పోయాడు. ఈ క్రమంలోనే కళ్లు చెదిరే సిక్స్‌తో రోహిత్ 249 బంతుల్లో 28 ఫోర్లు, 5 సిక్స్‌లతో టెస్టుల్లో తొలి డబుల్ సెంచరీని నమోదు చేసుకున్నాడు. అనంతరం కొద్ది సేపటికే రబాడ అద్భుతమైన బంతితో రోహిత్ శర్మ (212)ను పెవిలియన్‌కి పంపాడు. సాహాతో కలిసి రోహిత్ ఐదో వికెట్‌కు 64 పరుగులు జోడించాడు. ఈ దశలో ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టీమిండియా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే బాధ్యత తనపై వేసుకున్నాడు. ఇతనికి సాహా మంచి సహకారం అందించాడు. ఇద్దరూ సమన్వయంతో ఆడుతూ భారత్ స్కోరును 400కు దాటించారు. అనంతరం ఆచితూచి ఆడుతున్న సాహా 42 బంతుల్లో 24 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత నిలకడగా ఆడుతున్న జడేజా కూడా 119 బంతుల్లో 4 ఫోర్లతో 51 పరుగులు చేసి వెనుదిరిగాడు.

### ఉమేశ్ విధ్వంసం..

ఈ దశలో క్రీజులోకి వచ్చిన టెయిలెండర్ బ్యాట్స్‌మన్ ఉమేశ్ యాదవ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తాను ఎదుర్కొన్న తొలి రెండు బంతుల్లో వరుసగా సిక్సులు బాది సంచలనం సృష్టించాడు. తర్వాత ఓవర్‌లో మరో మూడు సిక్సర్లు కొట్టి ఔరా అనిపించాడు. ఫలితంగా 30 పరుగులను అత్యధిక సగటుతో సాధించిన బ్యాట్స్‌మన్‌గా ఉమేశ్ కొత్త చరిత్ర సృష్టించాడు. చివరికి మరో సిక్స్ కోసం ప్రయత్నించి ఔటయ్యాడు. అనంతరం 116.3 ఓవర్లలో 497/9 స్కోరు వద్ద కెప్టెన్ కోహ్లీ భారత్ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశాడు. సఫారీ బౌలర్లలో జార్జ్ లిండే 4, రబాడ 3 వికెట్లు తీశారు.



### స్కోర్‌బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** మయాంక్ అగర్వాల్ (సి) ఎల్గర్ (బి) రబాడ 10, రోహిత్ శర్మ (సి) ఎంగిడి (బి) రబాడ 212, పుజారా (ఎల్బీ) రబాడ 0, విరాట్ కోహ్లీ (ఎల్బీ) నోర్జే 12, రహానే (సి) క్లాసెన్ (బి) లిండే 115, రవీంద్ర జడేజా (సి) క్లాసెన్ (బి) లిండే 51, వృద్ధిమాన్ సాహా (బి) లిండే 24, అశ్విన్ (స్టంప్డ్) క్లాసెన్ (బి) పీడ్ 14, ఉమేశ్ యాదవ్ (సి) క్లాసెన్ (బి) లిండే 31, నదీమ్ (నాటౌట్) 1, షమి (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు: 11, మొత్తం (116.3 ఓవర్లలో) 497/9 డిక్లేర్డ్.

**వికెట్ల పతనం:** 1-12, 2-16, 3-39, 306, 5-370, 6-417, 7-450, 8-464, 9-482.

**బౌలింగ్:** కగిసో రబాడా 23-7-85-3, లుంగి ఎంగిడి 20-5-83-0, ఆన్రిచ్ నోర్జే 24.3-5-79-1, జార్జ్ లిండే 31-2-133-4, డేన్ పీడ్ 18-3-101-1.

**సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** డీన్ ఎల్గర్ (సి) సాహా (బి) షమి 0, డికాక్ (సి) సాహా (బి) ఉమేశ్ 4, జుబేర్ హంజ (బ్యాటింగ్) 0, డుప్లెసిస్ (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు: 4, మొత్తం (5 ఓవర్లలో) 9/2.

**వికెట్ల పతనం:** 1-4, 2-8.

**బౌలింగ్:** మహ్మద్ షమి 1-1-0-1, ఉమేశ్ యాదవ్ 1-0-4-1, నదీమ్ 2-2-0-0, రవీంద్ర జడేజా 1-0-1-0.

## ఉమేశ్ వీరంగం



**రాంచి :** మన తోక బ్యాటింగ్‌కూడా ఇటీవల బలపడుతోంది. బౌలర్లు జడేజా, అశ్విన్‌లతోపాటు ఇటీవల ఉమేశ్ యాదవ్, షమికూడా తమ బ్యాటింగ్‌కు పనిచెపుతున్నారు. దక్షిణాఫ్రికాతో ఇక్కడ జరుగుతున్న మూడో టెస్టులో ఆ విషయం మరోసారి రుజువయింది. భారత పేసర్ ఉమేశ్ యాదవ్ కేవలం పది బంతుల్లోనే అయిదు సిక్సర్లతో 31 పరుగులు సాధించి భారత్ భారీ స్కోరుకు తనవంతు సహకారం అందించాడు. ఈ నేపథ్యంలో అతడు తక్కువ బంతులలో 30 అంతకు మించి స్కోరు చేసిన వారిలో ప్రథముడిగా నిలిచాడు. తక్కువ బంతులలో 30 అంతకుమించి పరుగులు సాధించి 200కుపైగా స్ట్రైక్‌రేట్ సాధించిన వారి వివరాలు

| పేరు | పరుగులు | బంతులు | స్ట్రైక్‌రేట్ |
|---|---|---|---|
| ఉమేశ్ యాదవ్(ఇండియా) | 31 | 10 | 310 |
| స్టీఫెన్ ఫ్లెమింగ్ (న్యూజిలాండ్) | 31నాటౌట్ | 11 | 281 |
| నామ్ మెకలీన్ (వెస్టిండీస్) | 31 | 12 | 258 |
| అబ్దుర్ రజాక్ (పాకిస్తాన్) | 43 | 17 | 252 |
| డబ్ల్యు.పి.హోవెల్ (ఆస్ట్రేలియా) | 35 | 15 | 233 |
| ప్రవీణ్ కుమార్ (ఇండియా) | 40 | 18 | 222 |
| డి గ్రాండ్‌హోమ్ (న్యూజిలాండ్) | 33నాటౌట్ | 15 | 220 |
| జాక్వెస్ కలిస్ (దక్షిణాఫ్రికా) | 54 | 25 | 216 |

## చిన్ననాటి నెచ్చెలితో నాదల్ వివాహం



**మల్లోర్క(స్పెయిన్) :** స్పెయిన్ బుల్, టెన్నిస్ దిగ్గజం రాఫెల్ నాదల్ తన చిన్ననాటి నెచ్చెలిని వివాహమాడాడు. 14 ఏళ్లుగా ప్రేమలో ఉన్న నాదల్, మారియా ఫ్రాన్సిస్కా పెరెల్లో శనివారం ఒక్కటయ్యారు. మల్లోర్క దీవిలోని ఒక భవంతిలో కొద్ది మంది ఆహూతుల మధ్య వారిద్దరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. పదేళ్ల క్రితం తన సోదరి మారిబెల్ ద్వారా ఫ్రాన్సిస్కాను కలుసుకున్న నాదల్ అప్పటి నుంచి ఆమెతో ప్రేమలో పడిపోయాడు. గత కొద్ది కాలంగా ఫ్రాన్సిస్కా నాదల్ ఆడే టోర్నీలకు హాజరై అతనికి స్ఫూర్తిగా నిలుస్తోంది. ఈ వివాహ వేడుకకు 1975-2014 మధ్య కాలంలో స్పెయిన్ రాజుగా వ్యవహరించిన జువాన్ కార్లోస్-1తోపాటు పలువురు ప్రముఖ టెన్నిస్ ఆటగాళ్లు హాజరైనట్టు సమాచారం.

## ఎల్గర్‌పై మండిపాటు

**న్యూఢిల్లీ :** ఓటమి పరాభవాలనుంచి దృష్టితప్పించేందుకు దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ డీన్ ఎల్గర్ భారత హోటళ్లు, ఆహారంపై విమర్శలు చేయడం క్రికెట్ అభిమానులకు ఆగ్రహం తెప్పించింది. ఎల్గర్ భారత్‌లో ఆహారం అందరికీ సరిపడదని, ఇక్కడి హోటళ్లుకూడా పరిశుభ్రంగా ఉండవని వ్యాఖ్యలు చేశాడు. దానికిసంబంధించిన వీడియో వైరల్‌కావడంతో అభిమానులు రెచ్చిపోయారు. ఎల్గర్ వ్యాఖ్యలను ఎండగడుతూ ఈ ఆటగాడు ఆటపై శ్రద్ధ చూపకుండా ఇక్కడి హోటళ్లు, ఆహారం గురించి మాట్లాడతాడని, క్రికెట్ తప్ప అన్ని విషయాలపై అతనికి శ్రద్ధ ఎక్కువని ఘాటుగా స్పందించారు. భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఎల్గర్ తొలి టెస్టు మినహా, తరువాతి రెండు మ్యాచ్‌లలో పెద్దగా రాణించింది లేదు. భారత్‌లో పరిస్థితులను వివరించేముందు క్రికెట్‌లో తానేమిటో నిరూపించుకోవాలని చురకలేశారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్ఖలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076




## విజేతలు తైజు, మొమోటా

**ఒడెన్స్:** తైజు యింగ్, కెంటో మొమోటాలు డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్‌ఫైనల్లో నాలుగో సీడ్ తైజు యింగ్ (చైనీస్ తైపీ) 21-17, 21-14తో మూడో సీడ్ జపాన్ సంచలనం నొజోమి ఒకుహరపై విజయం సాధించి టైటిల్ సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ నెంబర్‌వన్ కెంటో మొమోటా (జపాన్) 21-14, 21-12తో చెన్ లాంగ్ (చైనా)ను వరుస గేముల్లో చిత్తు చేసి మరో టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. పురుషుల డబుల్స్ ఫైనల్‌లో టాప్‌సీడ్ జోడీ మార్కస్ గిడియన్, కెవిన్ సుకముల్జో (ఇండోనీసియా) 21-14, 21-13తో స్వదేశానికే చెందిన మహ్మద్ అహ్‌సాన్, సెటియవాన్ ద్వయంను ఓడించారు. మహిళల డబుల్స్‌టైటిల్ పోరులో బీక్ హానా,జాంగ్ యుంగ్ (కొరియా) జంట 9-21, 21-19, 21-15తోచెన్ క్వింగ్ చెన్, జియా యి ఫన్ (చైనా) జోడీపై విజయం సాధించింది.

## ఫైనల్లో ముర్రే

**ఆంట్వెర్ప్ :** రెండున్నరేళ్ల తరువాత ఆండీ ముర్రే ఒక టోర్నీలో ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ప్రపంచ మాజీ నంబర్‌వన్ ఆటగాడు ముర్రే ఇక్కడ జరుగుతున్న యూరోపియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ సెమీస్‌లో 3-6, 7-5, 6-2 స్కోరుతో ఫ్రాన్స్‌కు చెందిన యుగో హంబర్ట్‌పై గెలుపొందాడు. ముర్రే ఫైనల్లో మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత స్టాన్ వావ్రింకాతో తలపడతాడు. వావ్రింక మరో సెమీస్‌లో 6-3, 6-2తో ఇటలీ టీనేజర్ జానిక్ సిన్నర్‌పై గెలుపొందాడు. చివరిసారిగా ముర్రే 2017 మార్చిలో దుబాయ్ టోర్నీలో ఫైనల్‌కు చేరాడు.

nps national pension system PENSION FOR ALL
ఇప్పుడు ఎన్‌పిఎస్ ట్రిపుల్ ఇఇఇగా ఉన్నది
మినహాయింపు ! పెట్టుబడి సమయంలో ఆదాయపు పన్ను మినహాయింపు పొందండి
మినహాయింపు ! రాబడి మొత్తంపై ఆదాయపు పన్ను మినహాయింపు
మినహాయింపు ! మెచ్యూరిటీ సమయంలో పన్ను మినహాయింపును ఆనందించండి
ఎన్‌పిఎస్ ఎందుకు ?
• తక్కువ వ్యయం కలిగినది
• వ్యక్తులు, ఉద్యోగులు మరియు యజమానులకు వేరు వేరు పన్నులు.
• ఆకర్షణీయమైన మార్కెట్ లింక్డ్ ఫలాలు
• సులభంగా మార్చుకొనుట
• అనుభవం గల పెన్షన్ ఫండ్స్‌చే వృత్తి పరమైన నిర్వహణ.
• పిఎఫ్ఆర్‌డిఎ చే నిర్వహించబడును పార్లమెంట్ చట్టం ద్వారా రెగ్యులేటర్ ఏర్పాటు చేయబడినది
• కనీస కంట్రిబ్యూషన్ - ₹ 500/-తో ప్రారంభించవచ్చును.
ఎవరు చేరవచ్చును ?
దిగువ తెలిపిన ప్రమాణాలు నెరవేర్చగల ఎవరేని లేదా అందరూ చేరవచ్చును.
• భారతీయ పౌరులు : రెసిడెంట్ లేదా నాన్ రెసిడెంట్
• చేరు తేదీ నాటికి 18-65 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు.
• ఉద్యోగులు లేదా స్వయం ఉపాధి పొందు వారు
పన్ను ప్రయోజనాలు మరియు ఎన్‌పిఎస్
• సమయానుకూలంగా సవరించినవిధంగా ఐటి చట్టం 1961 యొక్క సెక్షన్ 80 సిసిడి క్రింద లభించే పరిమితి ₹ 1.50లక్షలు అపైన ₹ 50,000/- లు అదాచేయుటకు అదనపు మినహాయింపును ఎన్‌పిఎస్ అనుమతిస్తుంది మరియు ₹ 15,450 వరకు అదనపు పన్ను ఆదా.
• ఎన్‌పిఎస్‌లో పెట్టుబడి ద్వారా ₹ 2.00 లక్షల వరకు పన్ను మినహాయింపు క్లెయింను మీరు వినియోగించుకోగలరు.
• పదవీ విరమణ మెచ్యూరిటీపై ఏకమొత్తం విత్‌డ్రా చేసుకొనుట మరియు యాన్యుటీ కొనుగోలుపై పన్ను మినహాయింపు పొందండి.
NPS TRUST National Pension System Trust
Regulated by PFRDA
మరింత సమాచారం కొరకు కోడ్‌ను స్కాన్‌చేయండి.
NPS లేదా మీ దగ్గరలోని POP-SP గురించి మరింత తెలుసుకొనడానికి మా టోల్ ఫ్రీ నెం. 18001110708కి కాల్‌చేయండి. లేదా 56677* కు NPS అని ఎస్ఎంఎస్ చేయండి (*ప్రామాణిక ఛార్జీలు వర్తిస్తాయి) లేదా మా వెబ్‌సైట్ www.npstrust.org.in దర్శించండి
davp 15102/13/0012/1920

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.